ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

ప్రకాశం
జిల్లా వార్తలు

బుధవారం 11, జూన్ 2025


ఒంగోలులోని జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కంగారూ మదర్‌కేర్ సెంటర్

నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణలో కీలక పరిణామం. తల్లి ఆరోగ్యంతోపాటు పసికందు ప్రాణాలు నిలబెట్టేందుకు వినూత్నమైన కేఎంసీ విధానంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టి సారించారు. కంగారూ మదర్ కేర్ సెంటర్‌లతో మంచి ఫలితాలు లభిస్తుండటంతో జిల్లాలోనూ ఏర్పాటుకు శ్రీకారం పలికారు. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలో ఆ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఆ విధానాన్ని జిల్లాలోనూ అమలు చేయాలని కలెక్టర్ భావించారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి తెలియజేయగా ఆయన కనిగిరిలో ఏర్పాటుకు ముందుకొచ్చారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో ఒంగోలులోనూ పనులు పూర్తి చేశారు. బుధవారం రెండు చోట్లా వీటిని ప్రారంభించనున్నారు.



నవజాత శిశువులకు కంగారూ కేర్!

తక్కువ బరువుతో పుట్టిన పసికందుల ప్రాణాలు నిలబెట్టే వినూత్న విధానం

కేఎంసీతో ఆరోగ్య సంరక్షణ

- ఎమ్మెల్యే 'ఉగ్ర' సొంత నిధులతో కనిగిరిలో ఏర్పాటు
- కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో ఒంగోలు జీజీహెచ్‌లోనూ కేంద్రం
- రెండు చోట్లా నేడు ప్రారంభం
- త్వరలో మరిన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు

తల్లీబిడ్డకు ప్రయోజనాలు ఇవీ..

- నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో శరీర ఉష్ణోగ్రత పడిపోయే ప్రమాదం ఉంది. దీంతో వారిలో జీవక్రియల తీరు దెబ్బతింటుంది. వారి బాడీ టెంపరేచర్ హెచ్చు తగ్గులు లేకుండా కంగారూ కేర్ పద్ధతి సహాయపడుతుంది.
- తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు బరువు పెరగడానికి కంగారూ కేర్ సెంటర్ సహాయపడుతుంది. ఈ విధానంతో తల్లి శరీరం నుంచి బిడ్డకు వెచ్చదనం అందుతుంది. అది బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.
- పసిపిల్లల్లో ఉండే శ్వాస సంబంధ సమస్యల్ని దూరం చేయడానికి కూడా కంగారూ కేర్ సహాయపడుతుంది. హార్ట్ బీట్ నియంత్రణలో ఉంటుంది. ఈ పద్ధతితో 48 గంటల్లోనే మంచి ఫలితాలు వస్తాయని వైద్యులు వెల్లడిస్తున్నారు.
- ఇంక్యుబేటర్‌లో ఉంచిన శిశువుల కంటే కంగారూ కేర్ పద్ధతిలో సంరక్షించిన పిల్లల్లో వారి యుక్త వయస్సులో మెదడు పనితీరు మెరుగుపడుతుంది.
- పసిపిల్లలు ఎంత ఎక్కువగా నిద్రపోతే అంత త్వరగా పెరుగుతారని వైద్యులు వెల్లడిస్తున్నారు. నెలలు నిండకుండా జన్మించిన పిల్లలకు తల్లి శరీర స్పర్శ ఆ వెచ్చదనం వారిలో నిద్రను ప్రేరేపిస్తుందని చెప్తున్నారు. పాలు కూడా సరిగా తాగుతారని, దీని వలన ఇమ్యూనిటీ పెరుగుతుందంటున్నారు.

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తక్కువ బరువుతో పుట్టిన, నెలలు నిండకుండానే జన్మించిన చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు భరోసా దక్కింది. తల్లి స్పర్శతో మరింత ఎదుగుదల, పుట్టినప్పటి నుంచే తల్లితో అనుబంధాన్ని పెంచే వినూత్న విధానాన్ని అందుబాటులోకి తేవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్ణయించారు. ఈమేరకు జిల్లాలో కంగారూ మదర్ కేర్ సెంటర్ ఏర్పాటు విషయాన్ని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన కనిగిరిలో ఏర్పాటుకు అంగీకరించడంతోపాటు తన సొంత నిధులు వెచ్చించి కేఎంసీని ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులోనూ మరోకేంద్రం ఉండేలా దృష్టిసారించిన కలెక్టర్ స్థానిక జీజీహెచ్‌లో ఏర్పాట్లు చేయించారు.

కంగారూ మదర్ కేర్ అంటే?

'కంగారూ మదర్ కేర్' అనే పదం ఆస్ట్రేలియాలోని కంగారు జంతువు నుంచి తీసుకున్నారు. అది తన బిడ్డను శరీంలో ఒక సంచిలా ఉండే దానిలోనే భద్రంచేసి సంరక్షించుకుంటుంది. ఆ విధానమే ఈ కంగారూ మదర్ కేర్ సెంటర్. తల్లి చాతికి హత్తుకునేలా చిన్నారిని పడుకోబెడతారు. అలా బిడ్డకు తల్లి స్పర్శను పుట్టినప్పటి నుంచే తెలియజేస్తారు. సాధారణంగా తక్కువ మిగతా 6వ పేజీలో

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్

- తొలిరోజు హాజరైన 350 మంది
- ప్రిఫరెన్షియల్ కేటగిరీ విషయంలో వివాదంతో జిల్లాలో నిలిచిన ప్రక్రియ


అధికారుల వద్ద అభ్యంతరం తెలుపుతున్న టీచర్ల సంఘాల నాయకులు

ఒంగోలు విద్య, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ మొదలై అంతలోనే నిలిచిపోయింది. తొలిరోజైన మంగళవారం టీచర్ల బదిలీల సీనియారిటీ జాబితాలోని మొదటి 350 మందిని కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. తొలుత 50 మందిని కౌన్సెలింగ్ హాలులోకి పిలిచారు. బదిలీల సీనియారిటీ జాబితాలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ విషయంలో వివాదం తలెత్తింది. దీంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. రాత్రి 9 గంటలకు కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు

మిగతా 6వ పేజీలో

ఆగ్రహ జ్వాలలు

అమరావతిని ఉద్దేశించి అగౌరవ వ్యాఖ్యలపై జిల్లావ్యాప్తంగా కొనసాగిన నిరసనలు

అమరావతి రాజధాని ప్రాంత మహిళల పట్ల సాక్షి మీడియాలో అనుచిత వ్యాఖ్యల ప్రసారంపై జిల్లావ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు వ్యక్తమయ్యాయి. ఆ మీడియా సంస్థపైనా, అందులో లైవ్ డిబేట్ నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకుడు కృష్ణంరాజులపై తెలుగు మహిళలు, కూటమి శ్రేణులు భగ్గుమన్నారు. వారి చిత్రపటాలను చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వారి ఫొటోలను, కొన్నిచోట్ల సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. 7



దర్శిలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మి, మహిళలు

సమస్య కన్నా సభకు ప్రాధాన్యం

- నేడు పొదిలిలో పొగాకు రైతులతో జగన్ ముఖాముఖి
- ఆ పంట సాగులేని ప్రాంతాల నుంచి భారీగా తరలింపునకు నేతల యత్నాలు

6



డీపీవో కార్యాలయ పరిధిలో 122మంది బదిలీ

డిప్యూటీ ఎంపీడీవోలు 16 మంది, సెక్రటరీలు 106 మందికి స్థానచలనం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న 122మంది బదిలీ అయ్యారు. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తదనుగుణంగా ప్రక్రియను నిర్వహించారు. ఐదేళ్ల ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులు తొమ్మిది మంది ఉండగా రిక్వెస్టు కింద 71మంది, పరిపాలన సౌలభ్యం కోసం మరో 29మందిని మార్చారు. అందులో ఇతర జిల్లాలకు 13మందిని బదిలీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవోలు (ఈవోపీఆర్‌డీ) 16 మంది, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 20మంది, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు 45మంది, గ్రేడ్-4 39మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో డిప్యూటీ ఎంపీడీవోలు ఎనిమిది మందిని, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-3 కార్యదర్శులు ముగ్గురిని బాపట్ల, నెల్లూరు జిల్లాలకు పంపారు.

సీజన్ సానుకూలం

- సాగుకు రైతుల సన్నద్ధం
- పలుచోట్ల దుక్కుల దున్నకం
- మరో వర్షం కురిస్తే విస్తారంగా పైర్లు
- నేడు ఏరువాక పౌర్ణమి
- ఒంగోలు-2 పొగాకు వేలం కేంద్రం వద్ద ఉత్సవానికి ఏర్పాట్లు
- మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు



ఒంగోలు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ ఏడాది ఏరువాక సాగుకు సానుకూల వాతావరణం కనిపిస్తోంది. పంటల సాగులో ఏరువాకకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఏటా ఆ రోజున రైతులు సాగు ప్రారంభిస్తారు. ప్రస్తుతం మారిన కాలమాన పరిస్థితుల్లో ఏరువాక ఉత్సవానికి గతంలో వలే ప్రాభవం లేకపోయినప్పటికీ ఆ సమయానికి సాగుకు సన్నద్ధం కావడం రైతులు ఇప్పటికీ పాటిస్తున్నారు. అలా ఈ ఏడాది ఏరువాక పౌర్ణమి బుధవారం రాగా ఇప్పటికే జిల్లాలో పంటల సాగుకు సానుకూల వాతావరణం ఏర్పడింది. హిందూమత విశ్వాసాల ప్రకారం జ్యేష్ఠ పౌర్ణమిని ఏరువాక పౌర్ణమిగా పరిగణిస్తారు.. ఆరోజు అత్యంత శుభప్రదంగా రైతులు భావించి పంటల సాగుకు ఉపక్రమిస్తారు. ఏరువాక నాడు ఎద్దులతో అరకలు కట్టి పొలాల దున్నకం ప్రారంభిస్తే పంటలు బాగా పండుతాయన్నది రైతుల నమ్మకం. శాస్త్రాలు, ఆచారాలు అలా ఉంచితే మారుతున్న వ్యవసాయ పద్ధతులు, రైతాంగంలో వచ్చిన మార్పులతో ఎద్దులు మాయమైపోవడంతో ఏరువాక సంబరాలు తగ్గాయి. అయితే జూన్‌లో వచ్చే పౌర్ణమి ఏరువాక పౌర్ణమి కాగా అప్పటి నుంచి ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభమవుతాయి. గత మిగతా 6వ పేజీలో



దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజైన మంగళవారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై విహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు.

అనకొండలపై ఆగ్రహం

- ఎర్రమట్టి తవ్వకాలను అడ్డుకున్న యరజర్ల గ్రామస్థులు
- అర్ధరాత్రి నుంచి తెల్లారేదాకా టిప్పర్ల ఎదుట బైఠాయింపు
- నాలుగు వాహనాలను సీజ్ చేసిన అధికారులు
- అసైన్డ్ భూముల్లో తవ్వకాలతో సమీప పంటలు నాశనం

7లో

యరజర్ల వద్ద తవ్వకాలతో చెరువును తలపిస్తున్న అసైన్డ్ భూమి



సహకార శాఖలో బదిలీలు


ఒంగోలులోని డీసీవో కార్యాలయం

- డీసీఏవోగా రవిరాజశేఖర్

ఒంగోలు విద్య, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి (డీసీఏవో)గా పనిచేస్తున్న పోలిశెట్టి రాజశేఖర్‌ను కావలి డివిజనల్ సహకారాధికారిగా బదిలీ చేశారు. నెల్లూరు జిల్లా గుడూరు డివిజనల్ సహకారాధికారిగా పనిచేస్తున్న జి.రవిరాజశేఖర్‌ను ఇక్కడ డీసీఏవోగా నియమించారు. ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా పల్నాడు జిల్లా సహకార ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న డి. శ్రీనివాసరావును నియమించారు. ఇక్కడ డీసీఏవోగా పనిచేస్తున్న పి.రాజశేఖర్ ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా కూడా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పి.రాజశేఖర్ మంగళవారం ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. డీసీఏవోగా రవి రాజశేఖర్, ఒంగోలు డీఎల్‌సీఏగా శ్రీనివాసరావులు బాధ్యతలు

మిగతా 6వ పేజీలో

బాలికను వేధింపు కేసులో రోజంతా నిలబడే శిక్ష

గిద్దలూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అట్లకాడతో బాలికకు వాతలు పెట్టిన క్రిమినల్ కేసులో ఒక మహిళకు కోర్టులో ఒక రోజు మొత్తం నిలబడి ఉండే శిక్షను న్యాయాధికారి విధించారు. దీనితోపాటు రూ.5వేలు బాలికకు నష్టపరిహారం ఇచ్చేలా అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర తీర్పు చెప్పారు. మండలంలోని క్రిష్ణంశెట్టిపల్లెకు చెందిన మౌనిక అనే నిందితురాలు బాలికకు అట్లకాడతో వాతలు పెట్టిన కేసులో ఒక్క రోజు కోర్టులోనే నిలబడేలా శిక్ష విధించారు. బాధితురాలు బాలికకు రూ.5వేల పరిహారం ఇప్పించేలా తీర్పు నిచ్చారు.

సీజన్ సానుకూలం

(5వ పేజీ తరువాయి)

ఏడాది జూన్ 21న రాగా ఈసారి పదిరోజుల ముందుగానే వచ్చింది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 2.02 లక్షల హెక్టార్లు కాగా అందులో సుమారు 75వేల హెక్టార్లలో ప్రధాన పంట అయిన కంది వేస్తారు. 30వేల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారు. ఆ రెండే సగం విస్తీర్ణం కాగా ఏరువాక నుంచి దుక్కులు దున్ని నెలాఖరు నుంచి విత్తనం వేస్తారు. అదేసమయంలో ఏరువాక సమీపించే వారం, పది రోజుల ముందు నుంచే జిల్లాలో కొద్దిపాటి జల్లులు పడితే తొలకరి పైర్లుగా పిలిచే నువ్వు, సజ్జ, పెసరలతోపాటు జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట అలాగే పశుగ్రాస పంటలు వేస్తారు. ఒక్కో ఏడాది వాతావరణం అనుకూలించక వర్షాలు పడకపోతే ఆ పైర్లు ఆగిపోతాయి. అయితే ఈ ఏడాది జిల్లాలో ఏరువాక నాటికి పంటల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది.

చాలావరకు నువ్వు చల్లారు..

పొగాకు విస్తారంగా సాగు చేసే కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం నువ్వు విత్తనం చల్లారు. దర్శి ప్రాంతంలో పెసర, పశ్చిమప్రాంతంలో సజ్జ విత్తనం కొంతమేర వేశారు. అలాగే పశ్చిమాన బోర్లు ఉన్న దగ్గర మరింతగా పంటలు వేస్తున్నారు. చాలాచోట్ల గతనెలలో కురిసిన వర్షాలతో దుక్కులు దున్ని భూములు సాగుకు సిద్ధం చేశారు. అలా ఏరువాక సమయానికి అనుకూల వాతావరణంతో రైతులలో సాగుపై కొంత ఉత్సాహం కనిపిస్తోంది. జిల్లాలోని పలుప్రాంతాల్లో బుధవారం ఏరువాకను నిర్వహించనున్నారు.

నేడు త్రోవగుంటకు మంత్రులు, ఎమ్మెల్యేలు

ఒంగోలు-2పొగాకు వేలం కేంద్రం వద్ద ఏటా ఏరువాక రోజున అరకలు కట్టి పొలం దున్ని ఉత్సవం చేస్తారు. అలా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, ఏలూరి సాంబశివరావు తదితరులు హాజరవుతున్నట్లు సమాచారం. పొగాకు రైతు సమస్యలపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిన నేపథ్యంలో ఆ అంశాలను కూడా రైతులకు వివరించేందుకు వారంతా వస్తున్నట్లు సమాచారం.

సహకార శాఖలో బదిలీలు

(5వ పేజీ తరువాయి)

స్వీకరించారు. సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న పలువురు అధికారులు కూడా బదిలీ అయ్యారు. వినుకొండ ఎస్‌డీఏకేసీవోగా పనిచేస్తున్న ఎన్.సురేంద్రబాబును ఒంగోలు ఎస్‌డీఎల్‌సీవోగా నియమించారు అద్దంకి ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న ఎల్.సుధాకరరావును చీరాలకు బదిలీ చేశారు. కందుకూరు ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న వేణుగోపాలరావును ఒంగోలు జిల్లా సహకారాధికారి కార్యాలయానికి స్థానచలనం కల్పించారు. గిద్దలూరు ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న జి.వీరప్రసాద్‌ను మార్కాపురానికి బదిలీ చేశారు. పలువురు సీనియర్ ఇన్‌స్పెక్టర్లు కూడా బదిలీ అయిన వారిలో ఉన్నారు. దర్శి ఎస్‌డీఎల్‌సీవో కార్యాలయంలో పనిచేస్తున్న జీవీ.ప్రసాదరావును బాపట్లకు, అద్దంకిలో పనిచేస్తున్న వై.వెంకటేశ్వరరావును దర్శికి, బి.మాధురిని ఒంగోలు నుంచి కందుకూరు, అద్దంకిలో పనిచేస్తున్న టి.శ్రీనివాసులును ఒంగోలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రేపు కడవకుదురులో అథ్లెటిక్స్ ఎంపిక

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 12వ తేదీన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగిరెడ్డి స్వామిరెడ్డి, ఎం.వెంకటరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే అథ్లెట్లు 2007 జూన్ 7వ తేదీకి ముందు పుట్టినవారై ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన అథ్లెట్స్‌ను ఆంధ్రప్రదేశ్ సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక చేస్తామని,వివరాలకు 7416825797, 9542354041, 9666685664 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమస్య కన్నా సభకే ప్రాధాన్యం

పొగాకు సాగులేని ప్రాంతాల నుంచి భారీగా తరలింపుకు నేతల యత్నాలు

నేడు పొదిలిలో పొగాకు రైతులతో జగన్ ముఖాముఖి



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాక సందర్భంగా భారీగా ప్రజలను సమీకరించేందుకు వైసీపీ నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. తద్వారా ప్రజల్లో పార్టీకి ముఖ్యంగా జగన్‌కు ఆదరణ తగ్గలేదన్న భావన కలిగించే ఉద్దేశంతో ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ నేతల ప్రయత్నాలను పరిశీలిస్తే జగన్ బుధవారం పొదిలి రాక వెనక పొగాకు రైతుల సమస్య పరిష్కారమా లేక బల నిరూపణ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారణాలు ఏమైనా ఈ ఏడాది దేశవ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించటం లేదు. కొన్ని పంటల ఉత్పత్తులు అయితే కొనే నాధుడే కరువయ్యాడు. ఈ దశలో ఆయా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు కూడా చేపట్టాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా విషయానికి వస్తే ప్రధానమైన వాణిజ్య పంట పొగాకు అధికంగా సాగు అవుతుంది. ఒకవైపు దొర పొగాకు, బర్లీ పొగాకును రైతుల భారీగా పండించారు.

బర్లీ సమస్య ప్రభుత్వం స్పందన ఇలా...

బర్లీ సాగులో పర్చూరు నియోజకవర్గం అగ్రగామిగా ఉంది. మొత్తం నల్ల బర్లీ సాగులో 65శాతం సాగు అక్కడే జరుగుతుంది. నల్ల, తెల్లబర్లీని కొనే వారు కరువయ్యారు. ఈ సమస్యను తొలుత పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు జోక్యం చేసుకున్నారు. వివిధ పరిణామాల అనంతరం బర్లీ పొగాకు కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపింది. పర్చూరు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ బర్లీ పొగాకు రైతుల సమస్యలపై వైసీపీ గాని ఆ పార్టీ అధినేత జగన్ కాని ప్రభుత్వంపై ఒత్తిడి చేసిన దాఖలాలు లేవు.

నేగు జగన్ కార్యక్రమ తీరు తెన్ను

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ముఖ్య ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసీపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమే. కానీ అందుకు జగన్ దొర పొగాకు అధికంగా పండే ప్రాంతాలను వదిలేసి పొదిలి ప్రాంతాన్ని ఎంచుకోవటమే చర్చనీయాంశమైంది. దీనికితోడు జగన్ రాక సందర్భంగా ప్రజలను భారీగా సమీకరించేందుకు వైసీపీ నాయకులు సర్వశక్తులొడ్డి ప్రయత్నించటం కూడా చర్చనీయాంశమైంది. అందునా దొర పొగాకు తక్కువగా పండే దర్శి, మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి జనసమీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ప్రాంతాల్లోనే ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నాయకులు భారీగా వాహనాలు ఏర్పాటు చేయటం విశేషం. మరోవైపు తూర్పు ప్రాంతంలో కూడా వైసీపీ నాయకులు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి అదేదో బలప్రదర్శన అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. దీంతో జగన్ రైతుల కోసమా.. బలప్రదర్శన కోసమా అనేది చర్చనీయాంశమైంది. పైగా ఆయన కూడా ఎప్పటిలాగే గంట సమయం మాత్రమే కేటాయించటం విశేషం.

జిల్లాలోనే అత్యధికం

ఇక దొర పొగాకు సాగు విషయానికి వస్తే ప్రకాశం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగు అవుతుందనేది జగమెరిగిన సత్యం. ఈ పంట సాగు కూడా అధికంగా కందుకూరు, కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు ఆ తర్వాత కనిగిరి, పొదిలి ప్రాంతాలతోపాటు ఇతర నియోజకవర్గాల్లో అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో సాగవుతుంది. గత ఏడాది అత్యధిక ధర లభించింది. మంచి లాభాలు వచ్చాయి. దీంతో రైతులు మరింత ఉత్సాహంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. దిగుబడి పెరగటంతో మార్కెట్‌లో సమస్య ఎదురైంది. అంతోఇంతో కొనుగోలులో సమస్యలు లేవు. గత ఏడాది కన్నా ధర తగ్గటమే ప్రధాన సమస్య. ఈ విషయంపై రాష్ట్రప్రభుత్వం కూడా స్పందించింది. ఒంగోలులో మంత్రులు స్వామి, రవికుమార్, రామనారాయణరెడ్డి ఇతర టీడీపీ ఎమ్మెల్యేలు ఈ సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బోర్డు చైర్మన్, అధికారులు, వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని కేంద్ర పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడటంతో పాటు వ్యాపార సంస్థలు రైతులకు న్యాయం చేయకపోతే ఇబ్బందిపడతారని హెచ్చరికలు జారీ చేశారు. ఆ తర్వాత కొనుగోలులో వేగం పెరిగినప్పటికీ గత ఏడాది ధర మాత్రం రైతులకు లభించని మాట నిజం. బర్లీ పొగాకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించిన రాష్ట్రప్రభుత్వం తదనంతర చర్యగా దొర పొగాకు సమస్యపై దృష్టిసారించింది.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న వేటపాలెం ఎడ్లజత





బండను లాగుతున్న ఎడ్ల జత, ప్రథమ బహుమతి రూ.70వేలు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు సింగయ్య

సింగరాయకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఐదో రోజైన మంగళవారం ఆలయ సమీపంలో గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

పలు జిల్లాల నుంచి ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత నిర్ణీత 20 నిమిషాల్లో 3300 అడుగుల దూరంలాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన గొటికె హెత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో 3,168 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలేనికి చెందిన ఎడ్లజత నిర్ణీత సమయంలో 3,144 అడుగుల దూరంలాగి తృతీయ స్థానం దక్కించుకుంది. బల్లికురవ గ్రామానికి చెందిర పావులూరి వీరిస్వామిచౌదరికి చెందిన పీవీఎస్ఆర్ బుల్స్ 3100 దూరం లాగి చతుర్థస్థానాన్ని, ప్రకాశం జిల్లా అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు శివశంకర్ ఎడ్లజత నిర్ణీత 20 నిమిషాల్లో 2700 అడుగుల దూరంను లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్లజత యజమానులకు వరుసగా బహుమతులను టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య రూ.70వేలు, గంజిప్రసాద్ రూ. 50వేలు, బాపట్ల బ్రదర్స్ రూ. 40వేలు, చిమట మాధవ రూ.20వేలు అందజేశారు. నేడు రాష్ట్ర స్థాయి రాదాడి పోటీలను నిర్వహించనున్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి



మరుగుదొడ్లు కూల్చివేసిన స్థలాన్ని చూస్తున్న కమిషనర్

పొదిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలు, కాలువలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి హెచ్చరించారు. నగరపంచాయతీ స్థలాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, బోర్డులు, శాశ్వతంగా ఏర్పాటు చేసిన ఇనుప ఫ్రేంలను ఆయన మంగళవారం తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎక్కడా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయవద్దన్నారు. చిన్నబస్టాండ్ సెంటర్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే తోపుడుబండ్లను, బంకులను తొలగించారు. పెద్దబస్టాండ్ నుంచి చిన్నబస్టాండ్ వరకు ప్రధాన రహదారిలో ఉన్న కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. ప్రధాన కాలువను ఆనుకొని ఉన్న మరుగుదొడ్లను గతంలో రాత్రికి రాత్రే కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రస్తుతం మరుగుదొడ్లు కోర్టు పరిధిలో ఉందని వారి ఆదేశానుసారం వెళతామని చెప్పారు. సామూహిక మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించడం, ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పొదిలి అభివృద్ధి విషయంలో రాజకీయ జోక్యం ఉండదని ఎమ్మెల్యే చెప్పారని తెలిపారు. మరుగుదొడ్లను ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. ఆ స్థలాన్ని నగరపంచాయతీ స్వాధీనం చేసుకుందని త్వరలో మరుగుదొడ్లు నిర్మాణం చేపడతామని కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు.

మోదీ సేవలో తరిస్తున్న ప్రభుత్వం

యోగాంధ్ర కాదు సంక్షేమాంధ్ర ముఖ్యం

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసి యోగాంధ్ర పేరుతో మోదీ మెప్పు కోసం ప్రయత్నిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు విమర్శించారు. ప్రకాశం జిల్లాలో నెలకొన్న సమస్యలపై సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామాన్ని మంగళవారం సందర్శించిన అనంతరం ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగాంధ్ర పేరుతో ఈనెల 21న ప్రధాని కోసం విశాఖపట్నంలో కోటి మందితో కార్యక్రమం తలపెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పొగాకుకు గిట్టుబాటు ధరలు లేక, నిరుద్యోగం, ఉపాధి కరువు, అందని కనీస వేతనాల వంటి సమస్యలతో అల్లాడుతుంటే యోగాంధ్ర పేరుతో కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది పొగాకు రైతుకు 50శాతం లోగ్రేడ్ దిగుబడి రాగా దానిని కొనుగోలు చేయకపోవడంతో బ్యారన్‌కు రూ.5లక్షలకుపైగా నష్టం వస్తుందన్నారు. గతేడాది లాభాలు పొందిన కంపెనీలు ఈ ఏడాది పొగాకు కొనుగోలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వ్యాపారుల మెడలు వంచే పనిని ఈ ప్రభుత్వం చేసే పరిస్థితి లేదని తెలిపారు. చంద్రబాబు తీరు కార్పొరేట్లకు మేలు చేకూర్చే విధంగా ఉందని ఆరోపించారు. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో పొగాకు రైతు ఆదాయం 40శాతం పడిపోతే ఐటీసీ షేర్ విలువ నాలుగు శాతం పెరగడం వెనుక ప్రభుత్వ ప్రోత్సాహం ఉన్నట్లే కదా? అని ప్రశ్నించారు. శ్రమజీవులకు యోగాతో పనిలేదని, వారి శ్రమకు తగ్గ ఫలితం పొందినప్పుడే మానసిక ప్రశాంతత పొందుతారని తెలిపారు. మైనంపాడు గ్రామాన్ని సందర్శించగా ఉదయం ఆరున్నర గంటలకే ఉపాధి కూలీలు ఐదు కిలోమీటర్లు కాలినడకన వెళ్లారని, మరి కొందరు అడ్డా కూలీలు ఏడు గంటలకే ఒంగోలు బయలుదేరి వెళ్లారని తెలిపారు. ప్రభుత్వానికి నిజంగా ప్రజలపై ప్రేమ ఉంటే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామ ఎస్సీకాలనీలో 100 మందికిపైగా ఇంటర్, బీటెక్ వంటి చదువులు చదివితే కేవలం ఐదుగురు మాత్రమే ఉద్యోగాలు పొందారని, మిగిలిన వారు నిరుద్యోగులుగా ఉన్నారని తెలిపారు. వారు చాలా అభద్రతాభావంలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రధాని ఈనెల 21న వస్తున్నందున విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయమని ఆయనతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వారానికి ఒక అఘాయిత్యం చోటుచేసుకుంటుందని ఆరోపించారు. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా, మద్యపానం పెరిగిపోయిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ జిల్లాలో 1.14 లక్షల హెక్టార్ల బంజరు భూములు ఉన్నాయని, అందులో కలెక్టర్ ఏడు ప్రాంతాల్లో 5 వేల ఎకరాలను అదానీ కంపెనీకి కట్టబెట్టారని ఆరోపించారు. పొగాకు సమస్యను పరిష్కరించకపోతే రైతులను సమీకరించి ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పూనాటి ఆంజనేయులు, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవీఇవీ

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం



కందకాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయలపల్లి, నర్సాయపాలెం గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ఫాంపాండ్లు, కంధకాలు, గోకుల షెడ్లను దిశ జాయింట్ డైరెక్టర్ ఉమేష్ కుమార్‌రామ్, రూరల్ డెవలప్‌మెంట్ అకౌంట్ ఆఫీసర్ జీఎస్ రావత్, ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాలలో గ్రామసభలను నిర్వహించి ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏడు వారాలుగా చేసిన పనులకు నగదు జమకాలేదని కూలీలు బృంద సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

58 కేసుల నమోదు



మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

మార్కాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డివిజన్‌లోని విద్యుత్ అధికారులంతా 36 బృందాలుగా విడిపోయి సుమారు 1,351 సర్వీసులను తనిఖీ చేసినట్లు డీఈఈ పీవీ నాగేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో విద్యుత్ మీటర్లు లేకుండా అనధికారికంగా విద్యుత్ వాడుతున్న 13 మందిపై డైరెక్ట్ ట్యాపింగ్ కింద, విద్యుత్ సర్వీసు ఉండి అదనపు లోడు వినియోగిస్తున్న 30 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. మొత్తంగా 58 కేసుల్లో రూ.1.97 లక్షల మేర అపరాధ విధించడం జరిగిందన్నారు. అనంతరం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులు కేసులు నమోదు చేసిన వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు డీపీఈ ఉషారాణి, మార్కాపురం ఏడీఈ సియానాయక్, డివిజన్‌లోని అన్ని సబ్ డివిజన్‌ల, మండలాల అధికారులు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు కంగారూ కేర్..!

(5వ పేజీ తరువాయి)

బరువుతో పుట్టిన పిల్లలు, నెలల నిండకుండానే జన్మించిన చిన్నారులను ఇంక్యుబేటర్‌లో పెడుతుంటారు. కాగా కేఎంసీ విధానంతో తల్లి నిత్య స్పర్శతో పిల్లల శరీరం వెచ్చగా ఉండటంతోపాటు, వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కంగారూ కేర్ వల్ల తల్లి పాలు కూడా పెరుగుతాయని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

నేడు కనిగిరి, ఒంగోలులో ప్రారంభం

తొలిసారిగా కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి, ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)లో కేఎంసీలను మంగళవారం ప్రారంభించనున్నారు. కనిగిరిలో కేర్ సెంటర్ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తన సొంత నిధులు వెచ్చించారు. ఒంగోలు జీజీహెచ్‌లో కేఎంసీ ఏర్పాటుకు ఆరోగ్యశ్రీ నిధులను ఖర్చు చేశారు. కనిగిరిలో కేంద్రాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర ప్రారంభించనున్నారు. ఒంగోలు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మధ్యాహ్నం 4 గంటలకు మంత్రి, కలెక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభిస్తారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తన సొంత నియోజకవర్గంలోని కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలోనూ కేఎంసీ ఏర్పాటుపై దృష్టి సారించారు. ఇది అక్కడ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఎర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రి, దోర్నాలలోనూ ఏర్పాటు దిశగా వైద్యాధికారులు చర్యలు చేపట్టారు.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్

(5వ పేజీ తరువాయి)

డీఈవో కిరణ్‌కుమార్ ప్రకటించారు. ఈ వివాదాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఉదయం 350 మంది కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని డీఈవో కోరారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం నిర్వహిస్తున్నది పేరుకు మాన్యువల్ కౌన్సెలింగ్ అయినా జరిగేది అంతా ఆన్‌లైన్‌లోనే. సీనియారిటీ జాబితాలు, ఖాళీల వివరాలు అన్నీ వెబ్‌సైట్ ద్వారా ప్రదర్శిస్తారు. వరుస క్రమంలో ఒక్కో టీచర్‌ను పిలుస్తారు. వారు కోరుకున్న స్థానం, సీనియారిటీ జాబితాలో సంఖ్య అన్నీ నమోదు చేస్తారు. ఆ తర్వాత బదిలీ ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో జనరేట్ అవుతాయి. బదిలీల కౌన్సెలింగ్ మూడు రోజుల్లో పూర్తిచేయాలని కమిషనర్ ఆదేశించారు. పాత జడ్పీ మీటింగ్ హాలులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

మార్పులకు నోచాన్స్

కౌన్సెలింగ్ ప్రారంభమైన తర్వాత సీనియారిటీ, ఖాళీల జాబితాల్లో ఎటువంటి మార్పులు, చేర్పులకు అవకాశం లేదని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మంగళవారం మధ్యాహ్నం స్థానిక సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గ్రీవెన్స్ అన్నీ పరిష్కారం అయ్యాక జాబితాలు ఫ్రీజ్ అవుతాయన్నారు. కౌన్సెలింగ్‌ను పరిశీలించేందుకు యూనియన్‌కు ఒకరిని అనుమతిస్తామన్నారు. జాబితాలపై ఎటువంటి అభ్యంతరాలు తెలపకుండా కౌన్సెలింగ్‌కు సహకరించాలని కోరారు. కౌన్సెలింగ్ కేంద్రానికి మండల విద్యాధికారి-1లను పిలుస్తున్నామని ప్రిఫరెన్షియల్ కేటగిరి, స్పౌజ్ విషయంలో వారి నుంచి వివరణ తీసుకుంటామన్నారు. ఎంఈవోలు ఏమైనా తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాత స్థానాలకు ఎంటీఎస్ టీచర్లు

మినిమం టైం స్కేలు (ఎంటీఎస్)తో పనిచేస్తున్న టీచర్లు పాఠశాలల పునఃప్రారంభ రోజైన ఈనెల 12న వారు పనిచేస్తున్న పాత స్థానాల్లోనే విధులకు హాజరు కావాలని కమిషనర్ ఆదేశించారు. రెగ్యులర్ టీచర్ల బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటుపై దృష్టిపెడతామని పేర్కొన్నారు.

పీఈటీ, ఎల్‌పీల వెబ్‌ఆప్షన్లు ప్రారంభం

వ్యాయమ ఉపాధ్యాయులు, భాషా పండితుల బదిలీలకు వెబ్‌ఆప్షన్లు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ రాత్రితో వెబ్ ఆప్షన్లు గడువు ముగుస్తున్నందున పీఈటీ, ఎల్‌పీలు త్వరితగతిన ఆప్షన్లు పెట్టుకోవాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలో పీఈటీలు 32మంది, భాషాపండితులు 14 మంది బదిలీకి దరఖాస్తు చేశారు. పీఈటీల్లో 12మంది తప్పనిసరిగా స్థానచలనం కావాల్సి ఉండగా 20మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేశారు. భాషాపండితులు 10మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉండగా నలుగురు అభ్యర్థన మేరకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి వెబ్‌ఆప్షన్లు గడువు మంగళవారం రాత్రితో ముగుస్తుంది. బుధవారం బదిలీ ఉత్తర్వులు విడుదల కానున్నాయి.

అన'కొండ'లపై ఆగ్రహం


గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రదేశం

- ఎర్రమట్టి తవ్వకాలను అడ్డుకున్న యరజర్ల గ్రామస్థులు
- అర్ధరాత్రి నుంచి తెల్లారేదాకా టిప్పర్ల ఎదుట బైఠాయింపు
- నాలుగు వాహనాలను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు
- అసైన్డ్‌భూముల్లో తవ్వకాలతో సమీప పంటలు నాశనం

యరజర్ల కొండ కరిగిపోతోంది. ఎర్రమట్టి విచ్చలవిడిగా తరలిపోతోంది. నిత్యం జేసీబీలతో తవ్వి వందలాది టిప్పర్లతో అక్రమార్కులు తోలుకెళ్లి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నెలరోజుల్లో రూ.2 కోట్ల విలువైన గ్రావెల్‌ను తరలించినట్టు అంచనా. క్వారీయింగ్ వల్ల పక్కనున్న వ్యవసాయ భూములకు నష్టం కలుగుతుందని రైతులు మొత్తుకున్నా లెక్క చేయలేదు. అడ్డుకున్నా పట్టించుకోలేదు. గ్రావెల్ టిప్పర్లను యరజర్ల గ్రామస్థులు అడ్డుకుని సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు బైఠాయించడంతో అధికారులు కదిలారు. నాలుగు టిప్పర్లను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఒంగోలు క్రైం/ఒంగోలు (రూరల్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విచ్చలవిడి అక్రమాలతో ఒంగోలు రూరల్ పరిధిలోని యరజర్ల కొండ కరిగిపోతోంది. కొందరు అనుమతుల్లేకుండా ఎర్రమట్టిని తోడేస్తున్నారు. ఇప్పటికే రూ.రెండు కోట్ల విలువైన మట్టిని అక్రమంగా తరలించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రోజూ 100 లారీలు చొప్పున 15 రోజుల నుంచి కొండప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ తవ్వకాలపై గ్రామస్థులు పలుసార్లు అడ్డు చెప్పడంతో మరోచోట యరజర్లలో అసైన్డ్ భూములు కొనుగోలు చేసి 4 ఎకరాల్లో 50 అడుగులు లోతులో తవ్వేశారు. ఇప్పటికే దాదాపుగా 2000 లారీల గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. మొత్తం నెల రోజుల్లో 3,500 లారీల మట్టి తవ్వి తరలించినట్టు అంచనా. ఈ మట్టిని ఒంగోలులో లారీ రూ.6వేల చొప్పున అమ్మి రియల్ ఎస్టేట్ భూముల్లో మెరక పోస్తున్నారు.

సాగర్ కాలువ పక్కనే క్వారీయింగ్..

పది రోజులు కిందట సాగర్ కాలువ పక్కనే 100 అడుగుల లోతున మట్టి క్వారీయింగ్ చేశారు. దీంతో సిమెంట్ కాంక్రీట్‌తో ఉన్న కాలువ దెబ్బతింటోంది. దీన్ని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు గ్రావెల్ లారీలను నిలుపుదల చేశారు. పెద్దల సిఫార్సుతో ఫోన్ చేయించటంతో అధికారులు లారీలను వదిలేసి వెళ్లిపోయారు. తవ్వకాలను మరోచోటకు మార్చారు. యరజర్లలోని డీకే భూముల్లో క్వారీయింగ్ చేస్తున్నారు.

లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

మట్టి తవ్వి తరలిస్తున్న నాలుగు లారీలను యరజర్ల గ్రామస్థులు సోమవారం రాత్రి అడ్డుకున్నారు. రాత్రి 9 గంటల నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకు లారీలకు అడ్డంగా బైఠాయించారు. 'లారీలు ఆపండి.. లేదంటే మమ్మల్ని తొక్కించి వెళ్లండి' అని రైతులు భీష్మించారు. దీంతో లారీలను నిలుపుదల చేశారు. విషయం తెలుసుకున్న మైనింగ్ అధికారులు మంగళవారం లారీలను ఒంగోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్, మైన్స్ డీడీ ఒంగోలు, ఆర్డీవో, స్థానిక పోలీసు అధికార్లకు యర్రజర్ల గ్రామ రైతులు పువ్వకాయల ఆదిశేషయ్య, వీరంజనేయులు తదితరులు ఫిర్యాదులు చేశారు.

టిప్పర్లను సీజ్ చేశాం

యర్రజర్లలో అసైన్డ్ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు చేసి అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకొని రవాణా శాఖ అధికారులకు అప్పగించాం. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపిన అసైన్డ్ భూములను పరిశీలించాం. తవ్వకాలు జరిపిన భూముల యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

- రాజశేఖర్‌బాబు, మైనింగ్ డీడీ

చుట్టూ 50 ఎకరాల్లో పంటలకు నష్టం

పట్టా భూములున్న ప్రదేశంలో డీకే పట్టాను కొందరు కొనుగోలు చేసి అక్రమంగా మట్టి తవ్వకాలు ప్రారంభించారు. ఈ భూమిలో 50 అడుగుల లోతున క్వారీయింగ్ చేసి రోజుకు వందకుపైగా టిప్పర్లను లోడుతో బయటకు తీసుకెళుతున్నారు. తవ్వకాల వల్ల క్వారీయింగ్ పక్కనున్న పంట పొలాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. క్వారీయింగ్ కుంటల చుట్టూ ఉన్న పట్టా భూముల్లో నీటి శాతం (తేమ) ఉండదు. దీనివల్ల పంటలు పండే పరిస్థితి ఉండదు. ఇప్పుడు క్వారీయింగ్ జరిగే భూముల చుట్టూ నిమ్మ తోటలు, ఇతర కూరకాయ పంటలున్నాయి. అవన్నీ దెబ్బతింటాయి. వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. ఈ క్వారీయింగ్‌తో కిలో మీటరు వరకు భూములు నాశనమవుతాయి. దాదాపు 50 ఎకరాలు పనికిరాకుండా పోతాయి. దీనిపై కలెక్టర్ తక్షణం చర్యలు తీసుకోవాలి. **- యరజర్ల గ్రామస్థులు**


టిప్పర్లకు అడ్డంగా నిలుచున్న రైతులు

భగ్గుమన్న మహిళలు


నిరసన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

- అనుచిత వ్యాఖ్యలపై ఒంగోలులో నిరసన
- 'సాక్షి'ని రద్దు చేయాలని డిమాండ్

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కించపరిచిన జగన్ సొంత మీడియా సాక్షి మీడియాను వెంటనే రద్దు చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని మహిళలను కించపరుస్తూ చేసిన వాఖ్యలను ఖండిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ మహిళలు పెద్దఎత్తున నిరసన తెలియజేశారు. మంగళవారం స్థానిక చర్చిసెంటర్ నుంచి అద్దంకి బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు నల్లబ్యాడ్జీలు, నల్ల దుస్తులు ధరించి, ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. జగన్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి సాక్షి పత్రికలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి మహిళలను అవమానిస్తూ యాంకర్ కొమ్మినేని శ్రీనివాస్, ఎనలిస్ట్ కృష్ణంరాజు చేసిన వాఖ్యలను సాక్షి మీడియాలో ప్రసారం చేయడం దుర్మార్గమన్నారు. నీచపు రాజకీయాలు చేస్తూ, తెలుగు మహిళల ఆత్మ గౌరవాన్ని కించపరుస్తూ ప్రసారాలు చేయడాన్ని తెలుగు సమాజం ఖండిస్తుందన్నారు. సాక్షి పేపర్, చానల్ యజమాన్యం వైఎస్.భారతి రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డిపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియా తరుపున బహిరంగ క్షమాపణలు చెప్పాలని మహిళలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం, నాళం నరసమ్మ, రావుల పద్మజ, పసుపులేటి సునీత, కామరాజుగడ్డ కుసుమ కుమారి, నిడమనూరి పావని, మండువ లావణ్య, హాజీమున్నీసా, ఆరిగ శైలజ, పెద్దిశెట్టి వరలక్ష్మి, బీరం అరుణ, మేరీ రత్నకుమారి, పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కృష్ణంరాజు ఫొటోను చెప్పుతో కొడుతున్న మహిళలు

జగన్ పర్యటన దేనికి?

- వైసీపీ హయాంలో పశ్చిమ ప్రాంతానికి తీరని ద్రోహం
- ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పొదిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ జగన్ పశ్చిమ ప్రాంత పర్యటనకు దేనికో వైసీపీ నాయకులే చెప్పాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రశ్నించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు పశ్చిమ ప్రకాశం అభివృద్ధిని విస్మరించారన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ఈ ప్రాంత పర్యటనకు వచ్చే అధికారం జగన్‌కు లేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా జాతికి అంకితం పేరుతో ఈ ప్రాంత ప్రజలను మభ్యపెట్టినందుకా? పొదిలి పెద్దచెరువుకు పైపులైన్ ద్వారా నీటిని తీసుకొస్తానని కాంట్రాక్టర్‌ను మోసగించినందుకా? రూ.11కోట్లతో పొదిలి ప్రధాన రహదారి విస్తరణ పనులు చేస్తానన్న హామీని నెరవేర్చనందుకా? మార్కాపురంను జిల్లాగా చేయనందుకా? ఎందుకు జగన్‌రెడ్డి ఇక్కడకు వస్తున్నారని కందుల ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలను ఇన్ని రకాలుగా మోసగించిన వ్యక్తి ఏ ముఖం పెట్టుకొని పర్యటనకు వస్తున్నారనో చెప్పాలన్నారు. జగన్ పొగాకు బోర్డును సందర్శించిన రోజును దుర్దినంగా అందరూ భావించాలన్నారు. ఈ ప్రాంతంలో 11 మిలియన్ కిలోల పొగాకుకు అనుమతి ఉంది కానీ, 18 మిలియన్‌ల పొగాకును రైతులు పండించారు. 11 మిలియన్‌లే కాదు 18 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేసేందకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. జగన్ పొగాకు బోర్డు పర్యటన బూటకమని, ఆయన మాటలు ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే కందుల కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మహిళలకు రక్షణలో విఫలం


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆరోపించారు. వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రవణమ్మ ఆధర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మహిళలకు రక్షణ కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రత విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఈ ప్రాంతం, అ ప్రాంతం అనేది లేకుండా మహిళలతో పాటు బాలికలపై కూడా నిరంతరం అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీ నిర్వహించారు.

కార్పొరేషన్‌లో మన పరిస్థితేంటి?

- అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత కోసం జనసేన కార్పొరేటర్ల సమావేశం

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : 'అధికార కూటమి ప్రభుత్వంలో ఉన్నాం. కానీ ప్రాధాన్యత లేదు. కనీసం కార్పొరేషన్ అధికారులు కూడా గుర్తించడం లేదు. కార్పొరేషన్‌లో మన పరిస్థితి ఏమిటి?' ఇదీ ఒంగోలు నగరపాలక సంస్థ జనసేన కార్పొరేటర్ల మనోగతం. సోమవారం మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసుల రెడ్డి నివాసంలో సమావేశమైన 21 మంది జనసేన కార్పొరేటర్లు పలు అంశాలపై చర్చించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోని జనసేన పార్టీలో కార్పొరేటర్లుగా ఉన్నప్పటికీ తగిన గుర్తింపు ఇవ్వడం లేదని, కనీసం డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనుల్లోనూ ప్రాధాన్యత ఇవ్వకపోవడ బాధకరమని అసంతృప్తితో వ్యక్తం చేసినట్టు తెలిసింది. నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నా మన డివిజన్‌లలో అభివృద్ధి పనుల కేటాయింపుల్లో వెనుకంజలోనే ఉన్నామని పలువురు కార్పొరేటర్లు సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. కార్పొరేషన్‌లో కమిషనరు గానీ, ఇతర అధికారులు గాని తగిన గౌరవం ఇవ్వడం లేదని, మరికొందరు కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఐదేళ్లపాటు కార్పొరేటర్‌లుగా అభివృద్ధిలో కొనసాగుతామనుకుంటే చోటుచేసుకున్న పరిణామాలు మూడేళ్లకే ఆ వైభవం కోల్పోవాల్సి వచ్చిందని మరి కొంతమంది కార్పొరేటర్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

తమ నాయకుడు, మాజీ మంత్రి బాలినేనికి ఇదే విషయాన్ని వివరించారు. అయితే ఆయన ఆదేశాల ప్రకారం ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని అధిక శాతం మంది కార్పొరేటర్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించగా, మరి కొందరు కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించాల్సిన అవసరం కూడా ఉందని వెల్లడించారు. జనసేనలో ఉన్నా, తగిన గుర్తింపు లేకపోవడం మరింత బాధకరమని, త్వరలోనే బాలినేని ఆదేశాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని వారు ఒక నిర్ణయానికి వచ్చారు. 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్‌ను జనసేన ఫ్లోర్ లీడర్‌గా ఎన్నుకున్నారు.

ఉపకార వేతనానికి 200 మంది ఎంపిక

ఒంగోలు విద్య, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మినాన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) జాతీయ ఉపకార వేతనానికి జిల్లా నుంచి 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గత ఏడాది డిసెంబరు 8న జరిగిన పరీక్షకు 3,184 మంది హాజరు కాగా వారిలో 200 మంది ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో జనరల్ విద్యార్థులు 43 మంది, ఎస్సీ విద్యార్థులు 55 మంది, ఎస్టీ విద్యార్థులు 12 మంది, వెనుకబడిన తరగతుల విద్యార్థులు 90 మంది ఉన్నారు. వీరికి 9,10 తరగతులు, ఇంటర్మీడియెట్ రెండు సంవత్సరాలు కలిపి నాలుగు సంవత్సరాల పాటు ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనాలను బ్యాంకుఖాతాకు జమ చేస్తారు. ఇంటర్మీడియెట్ ప్రభుత్వ కళాశాలల్లో చదివే వారికి ఉపకార వేతనం లభిస్తుంది. ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ కోరారు.

వ్యవసాయశాఖలో భారీగా బదిలీలు

- ఏపీఎంఐపీ పీడీగా శ్రీనివాసులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యవసాయశాఖలో అధికారులను బదిలీలు చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్లతో పాటు ఏడీఏలు, ఏపీఎంఐపీ పీడీని బదిలీలు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీఎంఐపీ పీడీగా ఇక్కడ పనిచేస్తున్న పీవీ రమణను చిత్తూరు జిల్లాకు బదిలీ చేయగా గుంటూరులో పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసులును ఇక్కడ పీడీగా నియమించారు. వ్యవసాయశాఖలో డిప్యూటీ డైరెక్టర్లుగా పనిచేస్తున్న అధికారులను బదిలీలు చేశారు. పల్నాడులో పనిచేస్తున్న మురళీని ఒంగోలుకు, ఒంగోలులో పనిచేస్తున్న వి.శారదను గుంటూరు కమిషనరేట్‌కు, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎం.రజనీకుమారిని ఒంగోలులోని డీటీసీకి, అనంతపురంలో పనిచేస్తున్న జీవీ శివప్రసాద్‌ను ఒంగోలుకు బదిలీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఏడీఏలు బదిలీలు అయ్యారు. మార్కాపురంలో పనిచేస్తున్న వి.సరస్వతీదేవిని గుంటూరుకు, కనిగిరిలో పనిచేస్తున్న వెంకటరమణను వైపాలెం, చీరాలలో పనిచేస్తున్న ఉషారాణిని ఒంగోలు డీఏవోగా, గిద్దలూరులో పనిచేస్తున్న డి.బాలాజీనాయక్‌ను మార్కాపురం, ఒంగోలులో పనిచేస్తున్న బి.ఇబ్రహీంను అద్దంకికి, ఒంగోలు డీఏవోగా పనిచేస్తున్న బి.రమేష్‌బాబును ఏడీఏ(ఆర్) ఒంగోలు, వైపాలెంలో పనిచేస్తున్న వి.శోభారాణిని ఒంగోలు డీటీసీ, రేపల్లెలో పనిచేస్తున్న వి.వాణిశ్రీని మార్కాపురం బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు


చప్పరంపై లక్ష్మీనరసింహస్వామి

సింగరాయకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పూజల అనంతరం లక్ష్మీనరసింహుడు చప్పరం వాహనంపై కొలువుదీరారు. అనంతరం మోతకాపులు గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. రాత్రికి లక్ష్మీనరసింహుడు ప్రత్యేకంగా అలంకరించిన హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీ నరసింహాచార్యులు, అర్చకుడు నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా స్వామివారి పందిళ్లు

హనుమంత సేవ సందర్భంగా స్వామివారి ఉత్సవం జరిగే వీధుల్లో పాతసింగరాయకొండ గ్రామస్థులు పందిళ్లు వేశారు. సున్నం, ఎర్రమట్టితో కర్రలను పూజించి మామిడి తోరణాలతో ఏర్పాటు చేసిన ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హనుమంత వాహనంపై కొలువుదీరిన వరాహ లక్ష్మీనరసింహుడుని ప్రతి పందిర వద్ద నిలిపి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బుధవారం ఉదయం మోహిని ఉత్సవం జరగనుంది. రాత్రికి గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.


దివ్యాంగులు, అంధులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

దివ్యాంగులు, అంధులకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ కింద 16 మందికి ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఈ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. దివ్యాంగులకు 16 మందికి 2021-22 గ్రూపు-4 అంధుల విభాగంలో ఉద్యోగ నియామకాలు అందజేశారు. అంధుల విభాగంలో జూనియర్ అసిస్టెంట్లుగా ఇద్దరు, మ్యాట్రిన్‌కంస్టోర్ కీపర్‌గా ఒకరు, 2022-23 సంవత్సరంలో గ్రూపు-4 విభాగంలో బధిరులకు ఒక జూనియర్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్లుగా ఇద్దరు, వాచ్‌మెన్2, సేవిక ఒకపోస్టు, బధిరుల విభాగంలో ఆఫీసు సబార్డినేట్‌గా ఒకరికి, శారీరక అంగవైకల్యం విభాగంలో ఆఫీసు సబార్డినేట్‌గా ఒకరికి, కామాటిగా ఒకరికి ఉద్యోగ నియామక పత్రాన్ని కలెక్టర్ అందజేశారు.

నేడు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

- మార్కాపురంలో సమావేశానికి ఏర్పాట్లు
- ఎన్నికల అధికారిగా డీఆర్వో ఓబులేసు

మార్కాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసంపై బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు తెలిపారు. ఉదయం 11.00 గంటలకు స్థానిక మున్సిపాలిటీలోని శ్రీఅమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ హాలులో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారని తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై జరిగే ప్రత్యేక సమావేశం కావడంతో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎక్స్ అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డితోపాటు 34 మంది కౌన్సిలర్లు ఈ సమావేశంలో పాల్గొనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఇంటి పట్టాల పునఃపరిశీలన చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూన్10 (ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాల పునఃపరిశీలన ప్రక్రియను పటిష్ఠంగా చేపట్టాలని సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. ఇంటి స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. మంగళవారం విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్‌బాషా, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

నాగులుప్పలపాడు, జూన్10 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో కె.రాఘవేంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన యాళ్ల మహాలక్ష్మి గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో కార్యాలయ సూపరింటెంట్‌గా పని చేస్తున్న దక్షిణామూర్తి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. ఈక్రమంలో చీమకుర్తి ఎంపీడీవో కె..రాఘవేంద్రరావును జిల్లాపరిషత్ ఉన్నతాధికారులు ఇక్కడకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావును కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పేస్‌లో ముగిసిన అధ్యాపకుల శిక్షణ


సర్టిఫికెట్‌లను అందుకున్న అధ్యాపకులతో శ్రీధర్

ఒంగోలు విద్య, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు గత వారం రోజులుగా డేటా సైన్స్ అండ్ ఎనలటాక్స్ అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కళాశాల సీఎస్ఈ విభాగం, జేఎన్‌టీయూకే సంయుక్తంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాయి. నిష్ణాతులైన ప్రొఫెసర్లు రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. కో ఆర్డినేటర్‌గా కాకినాడ ప్రొఫెసర్ ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, కళాశాల తరుపున గిరిబాబు పర్యవేక్షించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఫ్యాకల్టీ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, సీవీ.సుబ్బారావు, కె.రూప, ఆర్.వీరాంజనేయులు, జె.గణేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


ప్రతిభా అవార్డులు అందుకున్న విద్యార్థులు

నాగులుప్పలపాడు, జూన్10 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ అవార్డులు అందుకొన్నారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన రావెళ్ల రమ్యలక్ష్మి, ఈస నాగసాయిఅమూల్య, కంపిరి అనూష, అడుసుమల్లి చాముండేశ్వరి 587కి పైగా మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.20వేలు నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్‌లను ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. మండలానికి 8 అవార్డులు రాగా తమ పాఠశాల విద్యార్థులు 4 సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీభవాని మంగళవారం తెలిపారు. విద్యార్థులను ఆమె అభినందించారు.

నేటి నుంచి కామేపల్లి పోలేరమ్మ తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జరుగుమల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లిలో ఉన్న పోలేరమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల బుధవారం నుంచి ప్రారంభంకానుంది. తొలిరోజు అమ్మవారి నగరోత్సవం, గురువారం విద్యుత్ ప్రభల ఏర్పాటు, శుక్రవారం పాల పొంగళ్లు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో భైరాగిచౌదరి తెలిపారు.

మానసిక ఉల్లాసానికి చిల్డ్రన్స్ క్లబ్ దోహదం


విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో మానసిక ఉల్లాసానికి, సృజనాత్మకతను పెంపొందించేందుకు చిల్డ్రన్స్ క్లబ్స్ బాగా ఉపయోగపడుతుందని బాలోత్సవం కమిటీ నాయకుడు వి.బాలకోటయ్య పేర్కొన్నారు. స్థానిక చైతన్యకాలనీలో మంగళవారం చిల్డ్రన్స్ క్లబ్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమలో ఆయన మాట్లాడారు. పిల్లలు సృజనాత్మకంగా ఆలోచించడానికి చిల్డ్రన్స్ క్లబ్ ద్వారా ఆటలు, పాటలు, బొమ్మలు, డాన్సులు, మ్యూజిక్ తదితర రకాలరూపాలలో అనేక విషయాల పట్ల అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఐద్వా నగర కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ పిల్లలు ఉత్సాహంగా నేర్చుకున్న అంశాలపై ప్రదర్శన ఏర్పాటు చేయడం బాగుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యదర్శి బండి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు పుస్తకాలను అందజేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సంతనూతలపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మైనంపాడు దళిత కాలనీలో పర్యటించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. వ్యవసాయసీజన్‌లో మాత్రమే పనులు దొరుకుతున్నాయని, మిగతా రోజులు ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్న ఇంతవరకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. అనంతరం ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడగా తమ కూలీ డబ్బులు సరిగా పడటం లేదని తెలిపారు. ఉపాధి కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మాబు, ఎన్.వెంకటేశ్వర్లు, బి.సుబ్బారావు, హనుమంతరావు, కమాల్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేయాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు


నక్కలవారితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరావు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న డివైడర్లపై నగర సుందరీకరణ కోసం మొక్కలు నాటాల్సి ఉన్నందున వీధి వ్యాపారులు తమకు కేటాయించిన స్థలంలో వ్యాపారాలు చేసుకోవాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్ ఎదురు వీధి వ్యాపారాలు నిర్వహిస్తున్న నక్కలవారితో మాట్లాడారు. ఎవరికి కేటాయించిన షాపుల్లో వారు వ్యాపారులు చేసుకోవాలని, రోడ్డుకు ఇరువైపులా అమ్మకాలు చేయవద్దని ఆయన ఆదేశించారు. దీంతో నక్కల రాణెమ్మ మాట్లాడుతూ తాము 60మంది వరకు వ్యాపారాలు చేసుకుంటుండగా, 18మందికి మాత్రమే షాపులు ఇచ్చారని, మిగిలిన వారికి కూడా కేటాయిస్తే వెళతామన్నారు. దీంతో కమిషనర్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయంగా షాదీఖానా వైపు ఖాళీగా ఉన్న ప్రాంతంలో వ్యాపారాలు చేసుకోవాలని, ప్రస్తుతం డివైడర్ పనులు జరుగుతున్నందున ఖాళీ చేసి నగర అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ సుధాకర్ టీపీవో బాబూరావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కలకు ఆపరేషన్లు

నగరంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణకు చర్యలు చేపట్టినందున ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కమిషనర్ వెంకటేశ్వరరావు ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశించారు. మంగళవారం వీధికుక్కలను అదుపులోకి తీసుకునే బాధ్యతలను చేపట్టిన పశువుల వైద్యులు ఏజెన్సీ, అలాగే జంతు ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థల వారితో ఆయన సమావేశం అయ్యారు. సమష్టిగా పనిచేసి, వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ సహకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికులు మాట్లాడుతూ వీధి కుక్కలను ఎక్కడ పట్టుకున్నారో అక్కడే వదిలేయకుండా వేరే ప్రాంతంలో వదిలేస్తున్నారని తెలిపారు. ఇలా చేయడం వల్ల పలు ఇబ్బందులు ఎదువుతున్నాయని చెప్పారు. సమావేశంలో వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ జగత్ శ్రీనివాసరావు, శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, శ్రీనాథ్, సేవ్ ద యానిమల్ సంస్థ దివ్య, పలువురు వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.

చీమకుర్తిలో ఆక్రమణల తొలగింపు ప్రారంభం

● పరిశీలించిన మున్సిపల్ సిబ్బంది



బస్టాండ్‌సెంటర్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

చీమకుర్తి, జూన్10(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలో ఆక్రమణలు తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని నయాగారా హోటల్ నుంచి ఇసుకవాగు సెంటర్ వరకూ ఆక్రమణల పర్వం చోటుచేసుకోవటంతో రహదారి కుచించుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఒంగోలు నుంచి కర్నూల్‌కి వెళ్లే రహదారికి ఇరువైపులా ఈ ఆక్రమణలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికితోడు తోడు రోడుకు ఇరువైపులా భారీస్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండటంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. దీంతో మున్సిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించాలనే నిర్ణయానికి వచ్చారు. పట్టణం సుందరీకరణలో భాగంగా కూడా ఆక్రమణలు తొలగింపు తోడ్పడనుంది. రహదారికి డివైడర్లు నిర్మించి సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తే గెలాక్సీపురం ధగధగలాడిపోతుందని, పట్టణ రూపురేఖలు మారిపోతాయని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. అందుకోసమే ఆక్రమణలు తొలగింపును చేపట్టారు. కాగా గతంలో కూడా ఇలాగే ఆక్రమణలును తొలగించారు. కానీ ఎటువటి సుందరీకరణ చర్యలు చేపట్టలేదు. దీంతో తిరిగి ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. ఈసారైనా మళ్లీ ఆక్రమణలు జరగకుండా మున్సిపల్ అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చెరువులో పడి యువకుడు మృతి


వెంకటేష్ మృతదేహం

సంతనూతలపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు పెద్ద చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. చీమకుర్తికి చెందిన నేరెళ్ల వెంకటేష్ (25) సోమవారం మధ్యాహ్నం చీమకుర్తి నుంచి ఒంగోలుకు ఆటోలో బయలుదేరాడు. రాత్రి 10 దాటిన అతను ఇంటికి చేరుకోకపోవడంతో చుట్టుపక్కల వారిని, వేరే ఊళ్లలో బంధువులను కుటుంబసభ్యులు విచారించారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం స్థానికులు కొందరు పెద్దచెరువు వైపుగా వెళ్తుండగా మృతదేహం నీటిలో తేలియాడుతున్న విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చేరుకుని వెంకటేష్ మృతదేహంగా గుర్తించి కన్నీరుమున్నీరు అయ్యారు. పోలీసులు చెరువులో నుంచి మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మార్గం మధ్యలో సంతనూతలపాడు చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిగిఉంటాడని, ప్రమాదవశాత్తు నీటిలో పడి వెంకటేష్ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు తండ్రి పున్నారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● రవాణా రంగ కార్మికుల విజ్ఞప్తి



డీటీసీ సుశీలకు వినతిపత్రం అందజేస్తున్న సమాఖ్య నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆటో, రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మోహన్ కోరారు. మంగళవారం ఒంగోలులోని ఉప రవాణా కమిషనర్ సుశీలను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో మోటారు రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు జీవోనెంబరు 21ని తొలగించాలని, ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ.15వేలతోపాటు ఐదుశాతం వడ్డీతో డ్రైవర్లకు ఆటోలు కొనుగోలు చేసేందుకు రూ.4లక్షలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు మోజేష్, పి.కొండలు, సుధాకర్, శాంసన్, ఎల్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

చీమకుర్తి, జూన్10(ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వరకుమార్ కోరారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై మంగళవారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ ఓటర్‌కు ఆధార్ సీడింగ్‌ని పక్కాగా నిర్వహించాలని కోరారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు పలు రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఒంగోలు క్రైం, జూన్10(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని బంగారు గొలుసును మోటార్‌సైకిల్ వచ్చిన ఓ అగంతకుడు లాక్కెళ్లాడు. ఈ ఘటన ఒంగోలు నగరం శ్రీనగర్‌కాలనీలో 4వ లైన్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సీతాలక్ష్మి, అమె చెల్లెలు కలిసి ఆసుపత్రికి వెళ్ళి చికిత్స చేయించుకుని మెడికల్ షాపులో మందుల తీసుకుని ఆటోలో ఇంటికి బయలుదేరారు. వారు ఇంటి వద్ద ఆటో దిగి లోపలికి వెళ్లే సమయంలో పోతురాజు కాలువ వైపు నుంచి 30 ఏళ్ళ వయస్సుగల యువకుడు టోపీ, మాస్క్ ధరించి మోటార్‌సైకిల్‌పై వచ్చి సీతాలక్ష్మి మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు ఒక్కసారిగా లాక్కోని వెళ్ళాడు. దీంతో వారు పెద్దగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చేసరికి అగంతుకుడు అక్కడి నుంచి పరారీ అయ్యాడు. అనంతరం బాధితురాలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

ఒంగోలు క్రైం, జూన్10(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 23మందికి ఒక్కొకరికి రూ.10వేల చొప్పున కోర్టు జరిమానా విధించినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. జిల్లాలోని పలుప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 23మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి వారందరికీ రూ.2.30లక్షలు జరిమానా విధించారని పేర్కొన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

గ్రానైట్ లారీలు సీజ్


సీజ్ చేసిన లారీల వద్ద సీఐ శ్రీకాంత్, ఎస్ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ రాళ్లను పరిమితికి మించి తీసుకెళ్తున్న లారీలను మంగళవారం సంతనూతలపాడు పోలీస్టేషన్ వద్ద ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు లారీలను రూరల్ సీఐ శ్రీకాంత్ సీజ్ చేశారు. రామాయపట్నం పోర్టుకు పెద్దపెద్ద రాళ్లతో అతివేగంగా వెళ్తున్న లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అజయ్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

సంతనూతలపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు-2 సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు బాలికలకు పౌష్టిక ఆహారం, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులను తక్షణమే ఆదుకోవాలి

ఒంగోలు(రూరల్), జూన్10(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను కేంద్రప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలిని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.హనుమారెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలు పొగాకువేలంకేంద్రం-2లో జరుగుతున్న వేలం ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది పొగాకు క్వింటా సరాసరి రూ.28వేలు రాగా ఈ ఏడాది రూ.22,800 మాత్రమే పలుకుతోందని చెప్పారు. లోగ్రేడ్ పొగాకును అసలు కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. విదేశీ ఆర్డర్లు లేవని సాకులు చెప్పి పొగాను కొనుగోలు చేయక పోవటం దారుణంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్/ఒంగోలు(రూరల్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఢిల్లీలోని స్పీకర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓ బిర్లాను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సత్కరించారు. అనంతరం పలు అంశాలపై మాగుంట చర్చించారు.

రేపు మాగుంట రాక : ఒంగోలు నగరంలో ఈ నెల 12వ తేదీన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పర్యటించనున్నట్లు కార్యాలయ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 9.30 గంటలకు ఎ-1 కన్వెన్షన్ హాలులో బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగాఫెయిర్‌లో పాల్గొంటారు. 10.30 గంటలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవ వేడుకలకు హాజరవుతారు. సాయంత్రం అమరావతికి బయలుదేరి వెళతారు.

టీడీపీ నాయకుల నివాళి

మద్దిపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు వలివర్తి సరస్వతి(74) మంగళవారం మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న టీడీపీ మండలాధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మండవ జయలక్ష్మి ఆమె మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవబత్తిన ప్రసాద్‌రావు, మండవ గోపీచంద్, రావి నరసింహారావు, దాట్ల వేణురాజు, అద్దేపల్లి దుర్గాభవానీ, ముల్లూరి మురళి, చిట్టిబోయిన అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణ పనుల పరిశీలన

మద్దిపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని జూనియర్ కాలేజీ ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువను మంగళవారం పంచాయతీ రాజ్ డీఈ కృష్ణమోహన్ పరిశీలించారు. గత కొంతకాలంగా ఈ మార్గంలో డ్రైనేజీ కాలువ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పల్లె పండుగ నిధులతో నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పనులు వేగవంతం చేయాలని ఏఈ రవికి సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు

ఒంగోలు కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ వృద్ధురాలు భవానికి జీవనోపాధి, వైద్య ఖర్చులకు రూ.32వేలు ఆర్థికసాయం, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ బాష, మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక నటరాజ కళాకేంద్రంలో విశ్రాంత ఉద్యోగులు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గంగిశెట్టి నరసింహారావు, గంటా కోటేశ్వరరావు, షేక్ కలాం, షరీఫ్, దేవరశెట్టి ఎలమంద, బడితల వెంకటేశ్వర్లు, దిడ్డి రామారావు, వెంకటసుబ్బయ్య, తెనాలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేస్తున్న బీజేపీ

● సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

కొండపి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విమర్శించారు. కేంద్ర సంస్థలను ప్రత్యర్థులపైకి ఉసిగొల్పి అక్రమ కేసులు బనాయిస్తున్నదన్నారు. స్థానిక రాములు భవనంలో మంగళవారం జరిగిన సీపీఐ కొండపి నియోజకవర్గ మహాసభలో ఆయన మాట్లాడారు. 100 సంవత్సరాలుగా సీపీఐ పేదల పక్షాన పోరాడి అనేక విజయాలు సాధించిందన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ, పేదల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించిందన్నారు. కొండపి ప్రాంతంలో అనేక మంది కమ్యూనిస్టు భావజాలంతో నిజాయితీగా పనిచేసి ప్రజానాయకులుగా ఎదిగి పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ భూములు ఇప్పించిన చరిత్ర ఉన్నదన్నారు. ఈ సందర్భంగా సీపీఐ కొండపి నియోజకవర్గ కార్యదర్శిగా ఆర్.లక్ష్మిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.వెంకట్రావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, టి.ప్రభాకర్, డి.బాలాజీ పాల్గొన్నారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

కొండపి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కొండపి సీడీపీవోగా సుశీలాదేవి మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ కొండపి సీడీపీవోగా పనిచేసిన మాధవీలత ఉలవపాడు ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు.

రేపటి నుంచి నందిపాడులో తిరునాళ్లు

మద్దిపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నందిపాడులోని శ్రీ గంగా పార్వతి కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాళ్లు ఈనెల12వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు మంగళవారం తెలిపారు. తిరునాళ్లలో భాగంగా 12వ తేదీన అంకురార్పణ, 13న స్వామి వారి కల్యాణోత్సవం, 14 స్వామి వార్ల గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఈవో ఏర్పాట్లు పర్యవేక్షిస్తారని తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

హాజరైన ఎమ్మెల్యే బీఎన్

మద్దిపాడు, జూన్10(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సీతారామపురంలో మనీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర సాయి క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలని కోరారు. కాగా టోర్నీ విజేత నెల్లూరు జట్టుకు రూ.లక్ష, రన్నర్ మద్దిపాడు టీంకు రూ.75 వేలును, మెమెంటోలను అందజేశారు. అలాగే మద్దిపాడులో దివ్యాంగురాలు గుంటూరు విశాలికి రూ.20 వేలు ఆర్థికసహాయం అందజేశారు. టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, ఎం.రామకృష్ణ, గడ్డం రవి, దాసరి రమేష్, మార్నేని రాఘవ, మోపర్తి లాల్‌బహదూర్, కొణిజేటి శివకుమార్, మనీ, తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలు కళాపరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం

ఒంగోలు(రూరల్), జూన్10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో మంగళవారం రాత్రి కొప్పోలు కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వేచ్ఛ నాటికను విశ్వకళాపరిషత్ హైదరాబాద్ వారు, అలాగే మాఇంటి మహాభారతం గుంటూరు వారు ప్రదర్శించారు. అనంతరం సీనియర్ కళాకారుడు పాల్వంచ తిరుమల వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు రఘుపతి, వెంకటరామారావు, సభ్యులు పాల్గొన్నారు.



విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈవో సుబ్రమణ్యం

పాఠశాలలకు విద్యా సామగ్రి పంపిణీ

పెద్దారవీడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా సామగ్రిని ఎంఈవోలు సుబ్రమణ్యం, శ్రీనివాసులు పంపిణీ చేశారు. మండలంలోని దేవరాజుగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలో 6వేల మంది విద్యార్థులకు యూనిఫాం వచ్చినట్లు తెలిపారు. అదే విధంగా 6వేల బూట్లు, 20వేల పాఠ్య పుస్తకాలు, 30వేల నోటు పుస్తకాలు వచ్చాయన్నారు. 1, 6వ తరగతి విద్యార్థులకు డిక్షనరీలను ప్రభుత్వం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు సన్న బియ్యంతో అన్నం పెట్టనున్నట్లు తెలిపారు.

మూడు రోజులు సాగర్ నీటి సరఫరా నిలిపివేత

మార్కాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులపాడు సాగర్ నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు తెలిపారు. త్రిపురాంతకం మండలం దూపాడు వద్ద పైప్‌లైన్ పనులు జరుగుతున్నందున ఈ మేరకు సరఫరా ఆపివేస్తున్నామని తెలిపారు. పురపాలక సంఘంలోని ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

సమతుల ఎరువులు వాడితే భూమికి మేలు



రైతులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి మానస

త్రిపురాంతకం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు సమతుల్యంగా వాడితేనే భూమికి మేలని కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి టి.మానస అన్నారు. మండలంలోని ఎండూరివారిపాలెంలో ప్రీ ఖరీఫ్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మితిమీరిన రసాయన ఎరువుల వాడకం వల్ల భూమికి నష్టం జరిగి రైతుకు అన్యాయం జరుగుతుందన్నారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని, అందుకోసం ఖరీఫ్‌కు ముందుగానే భూసార పరీక్షలు చేయించుకుని అవసరమైన మేరకు భూమికి ఎరువులు అందించి పంటల సాగుకు ఉపక్రమించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు తెలుసుకుని వినియోగించుకోవాలని కోరారు.

3 నెలల హుండీ ఆదాయం రూ.17,17,255

త్రిపురాంతకం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరిదేవి ఉభయదేవస్థానాలు, అన్నదాన హుండీలను అమ్మవారి ఆలయ ఆవరణలో లెక్కించినట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి డి.రజనికుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మూడునెలల 7రోజుల కాల పరిమితికి వచ్చిన ఈ మొత్తంలో స్వామివారి దేవస్థానం హుండీలో రూ.12,13,154, అమ్మవారి దేవస్థానం హుండీలో రూ.4,40,426, అన్నదానం హుండీలలో రూ.63,675 మొత్తం కలిపి 17లక్షల 17వేల 255 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం డివిజన్ పర్యవేక్షణాధికారి నాగమల్లేశ్వరరాజు, చైర్మన్ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నట్లు చెప్పారు.

తహసీల్దార్‌గా రఫి అహ్మద్



తహసీల్దార్‌కు శుభాకాంక్షలు చెప్తున్న సిబ్బంది

రాచర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల నూతన తహసీల్దార్‌గా షేక్ రఫి అహ్మద్ నియమితులయ్యారు. ఆయన పెద్దారవీడు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతి పొంది కలెక్టర్ ఆదేశాల మేరకు రాచర్ల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన రిలీవ్ అయి హైకోర్టు లైజనింగ్ అధికారిగా డిప్యుటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం రాచర్ల తహసీల్దార్‌గా స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న అశోక్ రెడ్డి దోర్నాలకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన రఫిని కార్యాలయ డీటీ వెంకటేశ్వర్లు, రీసర్వే డీటీ భారతీబాయి, ఆర్ఐ హర్షగౌడ్, కార్యాలయ సిబ్బంది ప్రభాకర్, అమృతవర్షిణి, వినోద్, జాషువా, వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి, సత్కరించారు.

పశు వైద్యాధికారి బదిలీ

రాచర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుమలవీడు పశువైద్యాధికారి డాక్టర్ వి.వి.సాయిచక్రవర్తి నెల్లూరు జిల్లా హెడ్‌క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతల నుంచి రిలీవ్ కాగా వైద్యశాల సిబ్బంది ఆయనను సన్మానించి వీడ్కోలు పలికారు. అనుమలవీడు పశువైద్యాధికారిగా డాక్టర్ నాగమణి బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సిబ్బంది తెలిపారు. ఆమె దర్శి మండలం రాజంపల్లిలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వస్తున్నారు.

13న బహిరంగ వేలం

రాచర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు అటవీ ప్రాంతంలోని నెమలిగుండ్ల రంరంగనాయకస్వామి భూముల కౌలుకు ఈనెల 13న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న ఈవో ఎం.నాగయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆకవీడు, చోళ్లవీడు, చినగానిపల్లి, తురిమెళ్ళ, జెపిచెరువు, అనంపల్లి, రాచర్ల, అనుమలవీడు, రామాపురం, సోమిదేవిపల్లి, రంగాపురం దేవస్థాన భూములకు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో వేలంపాట జరుగుతాయని, పాటదారులు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. వివరాలకు 9603322656 సంప్రదించాలని కోరారు.

రైతులు రుణాలను వినియోగించుకోవాలి

గిద్దలూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు బ్యాంక్ ద్వారా రుణాలు పొంది వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఏజీఎం ముకేష్‌కుమార్ సింహ అన్నారు. మంగళవారం మండలం కొత్తపల్లె గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గిద్దలూరు మెయిన్ బ్రాంచి ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ముకేష్‌కుమార్ మాట్లాడుతూ క్రాప్ లోన్లు, అగ్రి లోన్లను ఉపయోగించుకుని రైతులు మంచి పంటలు సాగు చేసి తద్వారా లబ్ధిపొందాలని తెలిపారు. కార్యక్రమంలో మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ సీతారామారావు, అగ్రి ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న బ్యాంక్ అధికారి ముకేష్‌కుమార్‌సింహ

మరమ్మతులు మరిచారు

» పల్లెల్లో పని చేయని బోర్లు
» కంభం సబ్‌డివిజన్‌లో చేతిపంపుల దుస్థితి
» నీటి కోసం ప్రజల అవస్థలు

కంభం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలలో చేతిపంపుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామీణ ప్రజలు దాహం తీరకపోవడంతోపాటు అనారోగ్యం పాలవుతున్నారు. ఆయా పంచాయతీలలో ఎప్పటికప్పుడు పని చేయని బోర్లను గుర్తించి వాటి మరమ్మతులు చేయించాల్సి ఉన్నా చర్యలు చేపట్టకపోవడంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన చేతిపంపులు నిరుపయోగంగా మారాయి. గత వైసీపీ పాలనలో పంచాయతీల నిధుల దారి మళ్లింపుతో చిన్నపాటి మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీనితో ప్రస్తుతం వేసవి కారణంగా పల్లెల్లో నీటి కష్టాలు ఎక్కువై స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 3 నియోజకవర్గాల పరిధిలోని 15 మండలాల వ్యాప్తంగా 6వేల వరకు చేతిపంపులు ఉన్నాయి.



కంభం కొత్తకాలువ దగ్గర చేతిపంపు దుస్థితి

వీటిలో చాలా వరకు పల్లెల్లో చేతిపంపులు పని చేయడం లేదు. కొన్ని చోట్ల భూగర్భజలాలు అడుగంటిన కారణంగా కొన్ని బోర్లు పని చేయడం లేదు. కొన్ని చోట్ల నీరున్నా మరమత్తులు చేయలేదు. వేసవికి ముందే మంచినీటి పథకాలు, చేతిపంపుల మరమత్తులు చేపట్టాల్సిన అధికారులు అరకొరగా పర్యవేక్షించడం, నామమాత్రపు మరమ్మతులతో సరిపెట్టడంతో చాలా వరకు పని చేయడం లేదు. నీటి వసతి ఉన్నా చేతిపంపులకు పరికరాల కొరత వేధిస్తున్నది. కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల్లో చేతిపంపులకు నీరు అందుతున్నా చిన్నపాటి మరమ్మతులకు గురై బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొత్తకాలువ వద్ద ఏర్పాటు చేసిన చేతిపంపు నీళ్లతో రైతులు, ప్రయాణికులు దాహం తీర్చుకునేవారు. మరమ్మతులకు గురైన బోరును బాగు చేయకుండా వదిలివేయడంతో కొన్నేళ్లుగా నిరుపయోగంగానే ఉన్నది. అర్ధవీడు మండలం నాగులవరం ఎస్సీ కాలనీలో ఉన్న చేతిపంపు ఇటీవల సీసీ రోడ్డు వేయడంతో ఎత్తు తగ్గింది. పంపు ఎత్తు పెంచాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. మండలస్థాయి అధికారులు స్పందించి చేతిపంపులను మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



అర్ధవీడు మండలం బొమ్మిలింగం చెంచుకాలనీలో పాడైన చేతిపంపు

ఆ చానల్, పేపర్‌ను మూసివేయించాలి

మహిళా నాయకుల నిరసన

కంభం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతి మహిళల పట్ల నీచంగా మాట్లాడిన సాక్షి చానల్, పేపర్‌ను మూసివేయించాలని మంగళవారం తెలుగుదేశం పార్టీ మహిళలు నల్ల బెలూన్లతో భారీ నిరసన ర్యాలీ చేశారు. అనంతరం కందులాపురం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోట మహాలక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ సాక్షి చానల్ రిపోర్టర్ కొమ్మినేని, జర్నలిస్టు క్రిష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు సంస్థను మూసివేయించాలని డిమాండ్ చేశారు. మహిళలను అవమానపరిచేలా మాట్లాడినప్పటికీ ఆ చానల్ ఎండీ భారతిరెడ్డి ఖండించడం గానీ, క్షమాపణ చెప్పడం గానీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళలంటే గౌరవం లేకే జగన్‌రెడ్డి తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేశారని ధ్వజమన్నారు.



నల్లబెలూన్లతో నిరసన ర్యాలీ చేస్తున్న మహిళా నాయకులు

కార్యక్రమంలో కంభం టౌన్ టీడీపీ మహిళ అధ్యక్షురాలు ఆరేపల్లి సుభాషిని, అర్ధవీడు మండల నాయకురాలు కత్తి భారతి, పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

గిద్దలూరు : అమరావతి ఔన్నత్యాన్ని, అక్కడి మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా సాక్షి చానల్‌లో అవమానకర వ్యాఖ్యలు చేసిన క్రిష్ణంరాజు, కొమ్మినేనిలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర శాఖ అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది మదిరె రంగసాయిరెడ్డి మంగళవారం ప్రకటనలో కోరారు. జర్నలిస్టుగా, పత్రిక సంపాదకులుగా బాధ్యతాయుతంగా ఉండాల్సిన క్రిష్ణంరాజు, కొమ్మినేని మహిళలను అలా అసభ్య వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన ఖండించారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

ఎంపీపీ గుమ్మా పద్మజ

పెద్ద దోర్నాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ గుమ్మా పద్మజ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీడీవో ఎం.నాసర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ గుమ్మా పద్మజ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు చూడాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ నాయక్, వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్, దోర్నాల గ్రామ పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, ఆయా శాఖాధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ

వైభవంగా కంపకల్లి మహోత్సవం

రాచర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మండలంలోని యడవల్లి గ్రామంలో కంపకల్లి మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లతోపాటు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఉభయదాతలుగా కాట్రేల వారు, మార్కాపురం వారు వ్యవహరించారు. ఉదయం 9గంటలకు కంప బండి మహోత్సవం, తదుపరి గ్రామోత్సవం, అనంతరం కంపకల్లి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులను ఆహ్లాదపరిచేందుకు రాత్రి 9గంటలకు పాటకచేరి నిర్వహించారు.

రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

రాచర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుమలపల్లి గ్రామానికి చెందిన మార్తోట రంగస్వామి అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో అతని సర్జరీకి సంబంధించి అత్యావసర ఖర్చుల నిమిత్తం రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేశారు. ఈ మేరకు ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో బాధితుడి కుమారుడు రవికి మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కటికె యోగానంద్, గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, దప్పిలి కాశిరెడ్డి పాల్గొన్నారు.

పైపులకు మరమ్మతులు

తర్లుపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఓవర్ హెడ్ ట్యాంకుకు వెళ్లే పైప్ లైనులు లీకేజీ కావడంతో ట్యాంకుకు సక్రమంగా నీరు అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. సచివాలయం సమీపంలో పైపులైన్ లీకేజీ కావడంతో పంచాయతీ సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు సక్రమంగా అందుతుందని, ప్రజల దాహార్తి తీరుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి సుబాకర్ దగ్గరుండి మరమ్మతులు చేయించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పైపులకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి, అభిమానులకు తినిపించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాలక్రిష్ణ అభిమానులు, టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కేక్ కట్ చేసి బాలక్రిష్ణ అభిమానులకు, టీడీపీ నాయకులకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నటనే కాకుండా సేవా దృక్పథంతో బసవ తారక క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా పేదప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని ఆయన అన్నారు. 50 సంవత్సరాలుగా తన విలక్షణ నటనతో అలరిస్తున్న బాలకృష్ణ భవిష్యత్‌లో మరెన్నో చిత్రాలు చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజల తరఫున బాలక్రిష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు, కటికె యోగానంద్, కౌన్సిలర్ చంద్రశేఖర్, బాలీశ్వరయ్య, జీవన్‌రెడ్డి, కాశిరెడ్డి పాల్గొన్నారు.



అభిమానులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

భూములను పరిశీలించిన సబ్‌కలెక్టర్

కొమరోలు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం.336-బీ1, 400-1గల ప్రైవేటు భూములను అప్పటి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములుగా మార్చడంపై గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీంతో ఆ భూములను మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ మంగళవారం పరిశీలించారు. పదేళ్ల కిందట అప్పటి రెవెన్యూ అధికారులు పొరపాటున కొమరోలు పట్టణంలోని పోస్టాఫీసు, మఠం బజార్, సాకలి బజార్ సమీపంలోగల ప్రైవేటు స్థలాలాలను ప్రభుత్వ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడంతో ఈ ప్రాంతాల్లోని గృహాలు, స్థలాల క్రయవిక్రయాలు పూర్తిగా ఆగిపోయాయి. ఈ విషయాన్ని కొమరోలు గ్రామానికి చెందిన జాలాది రామలింగేశ్వరరావు, పులకుర్తి సుబ్బరాయుడులు కలెక్టర్‌కు విన్న వించుకున్నారు. ఈ మేరకు మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకటత్రివినాగ్ ఆయా స్థలాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. మండలంలోని అల్లినగరం రెవెన్యూ ఇలాకాలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని సర్వేనెం. 436లో 13.75ఎకరాల స్థలాన్ని సోలార్ పార్కుకు కేటాయించిన భూమిని పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి, సర్వేయర్ సిలార్ సాహెబ్, వీఆర్వోలు రమణారావు, పాండు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రమణబాబు

గిద్దలూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా ఈవీ రమణబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రమణబాబు నందిగామ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై గిద్దలూరు వచ్చారు. ప్రస్తుతం పని చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు బదిలీపై పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లారు.

ప్రతిభ అవార్డును అందుకున్న విద్యార్థులు



కౌసల్యాబాయికి బహుమతిని అందజేస్తున్న కలెక్టర్

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సాయి చైతన్య హైస్కూల్ విద్యార్థిని కౌసల్యా బాయి ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డును అందకుంది. పదో తరగతి ఫలితాలలో 594 మార్కులు సాధించిన కౌసల్యాబాయికి ప్రశంసాపత్రం, రూ.20వేల నగదు అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

గిద్దలూరు : పట్టణంలోని సూర్య విద్యా నికేతన్‌కు చెందిన లారారోజ్ అనే విద్యార్థిని షైనింగ్ స్టార్ అవార్డు పొం దారు. ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో లారారోజ్ కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో అవార్డు పొందారు. 10వ తరగతిలో 600 మార్కులకు 592 మార్కులు సాధించి సైనింగ్ స్టార్ అవార్డు, మెడల్, 20వేల చెక్కు పొందిన లారారోజ్‌ను సూర్య విద్యా నికేతన్ కరస్పాండెంట్ బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్ పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఫి మాట్లాడుతూ.. కార్మికులకు జీవో నెం.36 ప్రకారం రూ.21వేలు, రూ.24,500 వేతనాలు పెంచాలని, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు టీపీ సుబ్బరాయుడు, గొట్టం హరి, సలాంఖాన్, అల్లూరయ్య, చెన్నకేశవులు, రషీద్, కాశిరెడ్డి, మరియదాసు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎర్రగొండపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలో జరిగే జిల్లా, ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సీపీఐ జిల్లా, రాష్ట్ర మహాసభల పోస్టర్‌లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, సహాయ కార్యదర్శి గుర్నాథం, జిల్లా కార్యవర్గసభ్యుడు కృష్ణగౌడ్, తిరుమలయ్య, యోగయ్య, వెంకటశివయ్య పాల్గొన్నారు.

యోగాంధ్ర ర్యాలీ

పుల్లలచెరువు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మంగళవారం పుల్లలచెరువు బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకటయ్య మాట్లాడుతూ యోగా చేయడం వలన జీవితం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా, జైలు

గిద్దలూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడిపి పోలీసులకు చిక్కిన పలువురు జరిమానా, జైలు శిక్షలకు గురయ్యారు. మంగళవారం గిద్దలూరు అడిషనల్ జూనియర్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె.భరత్‌చంద్ర తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ కొందరు మద్యం బాబులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ గిద్దలూరు ప్రాంతంలో పట్టుపడ్డారు. మంగళవారం పట్టుబడిన నలుగురికి 10వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. దీనితోపాటు వీరిలో ఒకరికి 6 నెలలపాటు డ్రైవింగ్ లైసెన్సును తాత్కాలికంగా రద్దు పరుస్తూ తీర్పునిచ్చారు. వీరిలో ఇద్దరికి 5 రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి 3 రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

అవమానకరంగా మాట్లాడినవారిని కఠినంగా శిక్షించాలి

తాళ్లూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసులు, బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, తదితరులు ఓ ప్రకటన విడుదలచేశారు. అమరావతిపై కక్షతో ఓచానల్‌లో అసత్యప్రసారాలుచేస్తూ విషం చిమ్ముతున్నారన్నారు. అవమానంకరంగా మహిళలను మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లానవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

దొనకొండ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిరోధానికి ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని సీడీపీవో సీహెచ్ భారతి పేర్కొన్నారు. కిశోరి వికాసం ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం దొనకొండలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు, బాలకార్మికులు లేకుండా ప్రతి చిన్నారి పాఠశాలకు వెళ్లి చదువుకునేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో చదువుకోకుండా ఇళ్ల వద్ద ఉండే పిల్లలను గుర్తించి వారు పాఠశాలలకు వెళ్లేలా చైతన్యపర్చే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రీసోర్స్‌పర్సన్ వీరాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

పామూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపాలు చేస్తున్నారు. డ్రైనేజీల ముందుకు వచ్చి బండ్లు పెట్టుకోవడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. వ్యాపారులకు పలుమార్లు అధికారులు హెచ్చరించినా ఫలితంలేదు.

ఈక్రమంలో మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో కాలువలపై ఉన్న ఆక్రమణలను వ్యాపారులు స్వచ్ఛందంగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని వారం రోజుల క్రితం అధికారులు ఆదేశించారు. దాంతో వారు స్వచ్ఛందంగా కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించుకుంటున్నారు.

యోగాంధ్ర రాష్ట్రస్థాయి పోటీలకు ఉపాధ్యాయుడు ఎంపిక

పీసీపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఉపాధ్యాయుడు ఎంపికయ్యాడు. మండలంలోని పెదవరిమడుగు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న స్వర్ణ రమణయ్య మంగళవారం ఒంగోలులో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రమణయ్యను స్లైప్ సీఈవో శ్రీమన్నారాయణ, ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు, తదితరులు అభినందించారు.

74 మందికి పెన్షన్లు మంజూరు

తాళ్లూరు, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో 74మంది వితంతులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీవో దారా హనుమంతరావు మంగళవారం తెలిపారు. కొత్తప్రభుత్వం ఏర్పడిన తరువాత పెన్షన్లు తీసుకుంటూ మృతి చెందిన భర్తల పెన్షన్లను భార్యలకు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా కృష్ణమూర్తి

ముండ్లమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఎల్.కృష్ణమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దర్శిలో ఎంపీడీవోగా పనిచేస్తూ జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి ఆదేశాల మేరకు ముండ్లమూరు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా పని చేసిన పి.సునీత పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలానికి బదిలీపై వెళ్లారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఢిల్లీలోని స్పీకర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓ బిర్లాను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సత్కరించారు. అనంతరం పలు అంశాలపై మాగుంట చర్చించారు.

కాగా, ఒంగోలు నగరంలో ఈ నెల 12వ తేదీన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పర్యటించనున్నట్లు కార్యాలయ ప్రతినిధి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

10.30 గంటలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవ వేడుకలకు హాజరవుతారు. సాయంత్రం అమరావతికి బయలుదేరి వెళతారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసిహారెడ్డి


కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో నెలకొన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకునేందుకు మంగళవారం ఆయన పర్యటించారు. బొగ్గులగొంది కాలనీ, శివనగర్ కాలనీల్లో వేకువజాము నుంచి పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రధానంగా పారిశుధ్యం, మంచినీటి సరఫరా సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పారిశుధ్య సిబ్బంది సమయపాలన పాటించడంలేదన్నారు. ఒక్కోసారి వారం రోజులు దాటినా రావటం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నివాసాల మధ్య ఖాళీ ప్రదేశాల్లో చిల్లచెట్లు మొలచి దోమలు, పాములు వస్తున్నాయని బొగ్గులగొంది కాలనీ వాసులు ఎమ్మెల్యేకు తెలిపారు. మురుగు కాల్వలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాడుక నీటిని రోడ్లపైకి వదులుతున్నట్లు చెప్పారు. కనీసం బ్లీచింగ్ చల్లిన సందర్భం లేదన్నారు. కొన్నిచోట్ల వీధి లైట్లు లేకపోవటంతో రాత్రి వేళల్లో బయటికి రావాలంటే భయంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ ప్రదేశాల్లో చిల్లచెట్లను తొలగించి ఫాగింగ్ చేయించటంతో పాటు బ్లీచింగ్ వేయించాలని మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలును ఎమ్మెల్యే ఆదేశించారు. ఏఏ ప్రదేశాల్లో మురుగు కాల్వలు అవసరమో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డ్రైనేజీల్లో చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, ఫిరోజ్, సుబ్బారావు, నజిముద్దీన్, లక్ష్మయ్య, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

» ప్రత్యేక ప్యాకెట్లతో నేరుగా పాఠశాలలకు పంపిణీ


మధ్యాహ్న భోజనానికి ప్రత్యేకంగా తయారైన 25 కేజీల సన్నబియ్యం బస్తా

దొనకొండ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈనెల 12వ తేది పాఠశాలలు పునఃప్రారంభం నుంచి సన్నబియ్యంతో భోజన పథకం అమలు జరిగేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం 25 కేజీల నాణ్యమైన సన్నబియ్యంతో ప్రత్యేక ప్యాకెట్లు తయారుచేసి మంగళవారం నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు.

గతంలో మధ్యాహ్న భోజన పథకానికి రేషన్ దుకాణాల నుంచి బియ్యం పంపిణీ జరిగేది. గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన బియ్యం అందించటంలో విఫలమైంది. అప్పట్లో నాణ్యతలేని బియ్యంతో వండిన భోజనాన్ని అనేక పాఠశాలల్లో ఎంతోమంది విద్యార్థులు తినలేక ఇళ్లకు వెళ్లటం, క్యారేజీలు తెచ్చుకొని తినే పరిస్థితి నెలకొంది. ఈసమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం పోషక విలువలతో కూడిన సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది.

విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి మండలంలోని అన్నీ పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. మండలంలో ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, 69 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 5769 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలు, కాలేజీల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలుజరిగేలా ప్రభుత్వం నిర్ణయంతో విద్యార్థులందరూ తృప్తిగా భోజనం తినే అవకాశం ఉందని తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

సాంబశివరావు, ఎంఈవో, దొనకొండ



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలుచేయనున్నారు. దీంతో సంతృప్తిగా విద్యార్థులు భోజనం చేస్తారు. సన్నబియ్యంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు జరిగేలా ప్రభుత్వ నిర్ణయానికి అటు తల్లితండ్రులతో పాటు అన్నీవర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసినవారిని కఠినంగా శిక్షించాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డిమాండ్


నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అనుచిత ప్రచారాలు నిర్వహించిన చానల్ అధినేత వైఎస్ భారతీరెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని, మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దర్శిలో మంగళవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. దర్శి-కురిచేడు రోడ్డులోని ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ నుంచి గడియారస్తంభం సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మహిళలను కించపర్చే విధంగా మాట్లాడిన సజ్జల రామకృష్ణారెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను గౌరవించని వారిని సమాజం క్షమించదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, పుల్లలచెరువు చిన్నా, పి.నెమలయ్య, మోడి అంజనేయులు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, మారెళ్ల వెంకటేశ్వర్లు, ఎం.శోభారాణి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను పరామర్శించే నైతిక హక్కు జగన్‌కు లేదు

రైతులను పరామర్శించే నైతికహక్కు జగన్మోహన్ రెడ్డికి లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు బుధవారం జగన్మోహన్‌రెడ్డి వస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏ రోజైనా రైతుల సమస్యల గురించి పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. ఇప్పుడు అధికారం కోల్పోవటంతో రైతులపై కపట ప్రేమనటిస్తున్నారని విమర్శించారు.


కనిగిరిలో ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న తెలుగు మహిళలు

మహిళలను అవమానించడం సిగ్గుచేటు

కనిగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ చానల్‌లో అమరావతి మహిళలను కించపరుస్తూ ప్రసారం చేయడం సిగ్గుచేటని తెలుగు మహిళలు పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ టీడీపీ మహిళాశక్తి ఆధ్వర్యంలో మంగళవారం కనిగిరిలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన నిండు శాసనసభలో మహిళలను కించపరుస్తూ మాట్లాడిన వ్యాఖ్యలు ఇప్పటికీ మహిళల గుండెల్లో మంటలు రేపుతున్నాయన్నారు. అందుకే 11 సీట్లకు పరిమితం చేసి వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. మహిళల పట్ల కారుకూతలు ప్రసారం చేస్తున్న మీడియా సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నల్లరిబ్బన్లు ధరించి పట్టణంలోని పురవీధుల్లో మహిళలు నిరసన తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్.శ్రీరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలుగుమహిళలు కరణం అరుణమ్మ, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, దొరసాని, పార్వతమ్మ, నారాయణమ్మ, ధనలక్ష్మి, తులసి, నీరజ మహిళలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వారికి మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణం


శాంతి కల్యాణానికి స్వామివార్లను తీసుకొస్తున్న భక్తులు

పామూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పామూరులోని శ్రీమదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివార్ల కల్యాణం, గ్రామోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు నారామణం సత్యబాబు విశ్వక్షేణపూజ, పుణ్యావాచనం, నిత్యహోమం, విశేష పూజలు, హారతులు, నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివార్లకు స్థానిక సత్యదేవుని దేవస్థానం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా కల్యాణ వస్త్రాలు, మహానైవేద్యం, తలంబ్రాలను వేణుగోపాల స్వామి దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరణ చేసిన గజ వాహనంపై పామూరు మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దేవస్థాన ఆవరణలో భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సీఐ ఎం.భీమానాయక్ ఆధ్వర్యంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఎం.వెంకటేశ్వరనాయక్, ప్రేమ్‌పావని పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం ఉభయదాతలు, భక్తులు, పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

పామూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవం, రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉభయ దాతలు తెలిపారు. 17 సంవత్సరాల అనంతరం స్వామివార్ల రథోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా ఉలవపాడు నుంచి ప్రత్యేక రథాన్ని తెప్పించి అలంకరణ చేస్తున్నారు.

సుమారు 25 అడుగుల ఎత్తు ఉన్న రథం కావడంతో గ్రామంలో తిరగడానికి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను, విద్యుత్ తీగలను, పురవీధులలో ఉన్న అడ్డంకులను తొలగించారు. దాంతో పట్టణంలోని దారులన్నీ విశాలంగా తయారయ్యాయి.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

» ఏడీఈ రవికుమార్


మాట్లాడుతున్న ఏడీఈ రవికుమార్

ముండ్లమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలతోపాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఏడీఈ రవికుమార్ అన్నారు. మంగళవారం ముండ్లమూరు సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ మండల పరిధిలో ఏ గ్రామంలోనూ లోవోల్టేజీ సమస్య లేకుండా చూడాలన్నారు. పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. విద్యుత్‌కు ఎక్కడ అంతరాయం లేకుండా చూడాలన్నారు. సోలార్ విద్యుత్‌ను వినియోగించుకొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ టి.చినఅంకబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.


హైదరాబాద్ విమానాశ్రయం వద్ద పూర్వవిద్యార్థి మాడిశెట్టి నాగేశ్వరరావుతో ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు

పది టాపర్లకు విమాన ప్రయాణం

దొనకొండ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చటంతో విమానంలో ప్రయాణంతో పాటు హైదరాబాద్‌లో ఎన్నో ప్రదేశాలను సందర్శించటం ఎంతో సంతృప్తి కల్గించిందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన పాఠశాల పూర్వ విద్యార్థి మాడిశెట్టి నాగేశ్వరరావుకు రుణపడి ఉంటామన్నారు. దొనకొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1981 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థి మాడిశెట్టి నాగేశ్వరరావు తన తండ్రి మాడిశెట్టి మల్లికార్జునరావు జ్ఞాపకార్థం 2025 పదో మొదటి రెండు స్థానాల్లో వచ్చే విద్యార్థులకు బంపర్ ఆఫర్ ప్రకటించారు.

పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను స్వంత ఖర్చులతో విమాన ప్రయాణంతో పాటు రెండు రోజులు హైదరాబాద్‌లోని అన్నీ ప్రదేశాలు చూపిస్తానని ప్రధానోపాధ్యా యుడు రామాంజనేయులు హామీ ఇచ్చారు. టాపర్లుగా నిలిచిన జి.కోటేష్, శరత్‌నాయక్‌తోపాటు హెచ్ఎం రామాంజనేయులకు పూర్వ విద్యార్థి మాడి శెట్టి నాగేశ్వరరావు ఆది, సోమవారాలు హైదరాబాద్‌లోని ప్రాముఖ్యమైన అన్నీ ప్రాంతాలను చూపించి విమాన ప్రయాణం చేయించారు. నాగేశ్వ రరావు ప్రోత్సాహం విద్యార్థుల్లో విద్యాభివృద్ధి పట్ల పోటీతత్వం పెంచుతుం దని హెచ్ఎం రామాంజనేయులు పేర్కొన్నారు.

రైతు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి కె.సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో జరిగిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షలు, యాజమాన్య పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువుల ఉపయోగం గురించి వివరించారు.

బాపట్ల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.మురళీధర్ నాయక్ మాట్లాడుతూ పైర్లలో వచ్చే చీడపీడల గురించి వివరించారు. కార్యక్రమం లో వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఉద్యాన అధికారి వెంకన్నబాబు, డీఆర్సీ ఏవో శేషమ్మ, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య, ఆత్మ ఏటీఎం రామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోటిరెడ్డి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

» అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆదేశం


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పామూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో వ్యవహరించి చొరవ చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశించారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షత వహించారు. ముందుగా ఇటీవల పహల్గాంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంటీసీ బొల్లా నరసింహారావు మాట్లాడుతూ మండలంలో పామూరు, రేగిచెట్లపల్లిలో ఉన్న పశువైద్యకేంద్రాల్లో సరైన వసతులు లేవన్నారు. వెంటనే అంచనాలు తయారుచేసి మండల గ్రాంటు నిధులతో పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశించారు.

ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ పామూరులో శాశ్వత ఆధార్ నమోదుసెంటర్ ఏర్పాటుచేయాలన్నారు. బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పా రు. వైస్‌ఎంపీపీ గంధం ఏసురత్నం మాట్లాడుతూ నర్రమారెళ్ల గ్రామంలో ఒక వ్యక్తి 68ఎకరాల ప్రభుత్వ భూమిని ఇతర వ్యక్తుల పేర్లపై రెవెన్యూ అధికారుల సంతకాలు లేకుండనే పట్టాలు పొందారన్నారు. ఇందుకుసంబం ధించి అర్జీ ఉంటే చర్యలు తీసుకొంటామని ఉగ్ర హామీ ఇచ్చారు. సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ వైద్యశాలలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. వైద్యశాలకు అవసరాల గురించి అంచనాలు తయా రుచేసి ఇవ్వాలని ఉగ్ర సూచించారు.

సమావేశంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, సీడీపీవో సరోజిని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మాల్యాద్రిని పరామర్శించిన ఉగ్ర

పామూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురైన టీడీపీ సీనియర్ నాయకుడు దేవరపు మాల్యాద్రిని ఆయన నివాసంలో ఎమ్మెల్యే ఉగ్ర పరామర్శించారు. ఉగ్ర వెంట పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీను, బి.నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంటి పట్టాల పునఃపరిశీలన చేపట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాల పునఃపరిశీలన ప్రక్రియను పటిష్టంగా చేపట్టాలని సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. ఇంటి స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. మంగళవారం విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం పలు అంశాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్‌బాషా, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

ఒంగోలు క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 23మందికి ఒక్కొకరికి రూ.10వేల చొప్పున కోర్టు జరిమానా విధించినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. జిల్లాలోని పలుప్రాంతాల్లో మద్యం తాగి వాహనా లు నడుపుతున్న 23మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి వారందరికీ రూ.2.30లక్షలు జరిమానా విధించారని పేర్కొన్నారు.

వాహ నదారులు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

ఉష్ణోగ్రత (అంచనా)

11-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	35	27
తెనాలి	36	27
నరసరావుపేట	33	26
బాపట్ల	36	27
రెంటచింతల	34	26
చీరాల	36	27

ఎస్జీటీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

- రాత్రి వరకు పరిష్కారం కాని సాంకేతిక సమస్యలు
- మాన్యువల్‌గా నిర్వహణకు యత్నించినా పలు సమస్యలు
- రాత్రి వరకు ఉపాధ్యాయులు పడిగాపులు
- మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్ వాయిదా



గుంటూరు(విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గందరగోళం.. ఆందోళనలు.. సాంకేతిక సమస్యలు.. వాయిదాల మధ్య సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సా..గుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌ను జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం చేపట్టేందుకు అధికారులు శతవిధాలా ప్రయత్నించారు. అయితే రాత్రి 9 గంటల వరకు కూడా సాంకేతిక సమస్యలు ఒక కొలిక్కి రాకపోవడంతో చివరకు బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహణకు మంగళవారం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒకటి నుంచి 350 వరకు సీరియల్ నెంబర్‌లోని ఎస్జీటీ తెలుగు ఉపాధ్యాయులు మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఖాళీల జాబితా సిద్ధం కాకపోవడంతో రాత్రి 9 గంటల వరకు బదిలీల ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతోపాటు అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో కౌన్సెలింగ్‌ను బుధవారానికి వాయిదా వేసినట్లు డీఈఓ రేణుక ప్రకటించారు. దీంతో రాత్రి వరకు ఉపాధ్యాయులు జడ్పీ వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరకు కౌన్సెలింగ్ వాయిదాతో ఉపాధ్యాయులు వెనుతిరిగారు. బుధవారం జరగాల్సిన కార్పొరేషన్, మున్సిపల్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌ను కూడా వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

నేటి కౌన్సెలింగ్ వివరాలు..

మండల పరిషత్ పాఠశాలల్లోని ఎస్జీటీ(తెలుగు) ఉపాధ్యాయులకు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సీరియల్ నెంబరు 1 నుంచి 750 లోపు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ జరగనున్నది.

ఇంకొల్లు కేంద్రంగా నకిలీ పత్తి విత్తనాలు

- అధిక దిగుబడుల పేరుతో తెలంగాణలో విక్రయాలు
- నలుగురి అరెస్టు.. రూ.65 లక్షల విత్తనాలు సీజ్ చేసిన సూర్యాపేట పోలీసులు

సూర్యాపేట క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా ఇంకొల్లు కేంద్రంగా నకిలీ పత్తి విత్తనాలను తయారు చేస్తున్నారు. అధిక దిగుబడుల పేరుతో విక్రయాలు చేస్తున్న ముఠా గుట్టును సూర్యాపేట పోలీసులు బహిర్గతం చేశారు.



నకిలీ విత్తనాల ప్యాకెట్లను మీడియాకు చూపుతున్న సూర్యాపేట ఎస్పీ నర్సింహ

ఈ ముఠా నుంచి రూ.65 లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నాకాబందీతో ముఠా గుట్టురట్టయిందని సూర్యాపేట ఎస్పీ కొత్తపల్లి నర్సింహ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. సోమవారం ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపాడు బస్టాప్ వద్ద జరిగిన నాకాబందీలో మహబూబాబాద్ జిల్లా మరిపెడకి చెందిన తండ నగేశ్ బైక్‌పై గోనె సంచిలో 120 ప్యాకెట్ల పత్తి విత్తనాలను తీసుకెళ్తున్నాడు. అయితే అతడి వద్ద ఎలాంటి రసీదులు లేకపోవడంతో.. అదుపులోకి తీసుకుని, ప్రశ్నించగా.. నకిలీ విత్తనాల ముఠా డొంక కదిలింది. ఇంకొల్లుకు చెందిన మాగులూరి సాంబశివరావు అరుణోదయ కంపెనీ పేరుతో నకిలీ విత్తనాలను తయారు చేస్తున్నట్లు నగేశ్ తెలిపాడన్నారు. కర్నూలు జిల్లా పల్లిపాడుకు చెందిన చెవుల నర్సింహ ఈ విత్తనాలను సరఫరా చేసేవాడని, గుంటూరుకు చెందిన తరిగొప్పల శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లాకి చెందిన పి.రాములు, కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన బానోతు జయరాం తదితరులకు సరఫరా అయ్యేవన్నారు. శ్రీనివాసరావుకు చెందిన దుకాణంలో 37 బస్తాల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నగేశ్, శ్రీనివాసరావు, రాములు, జయరాంలను అరెస్టు చేశామని, సాంబశివరావు, నర్సింహులు పరారీలో ఉన్నారని చెప్పారు.



వేటకు వెళ్లేందుకు వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

వేటకు.. వేళాయే

- విరామం ముగింపుతో 15 నుంచి ప్రారంభం
- వలలు, బోట్లకు మరమ్మతుల్లో మత్స్యకారులు

రేపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేటకు విరామం మరో మూడు రోజులే. ఆదివారం నుంచి సముద్రంలో వేటకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. వలలకు, బోట్లకు మరమ్మతులు నిర్వహించుకుంటున్నారు. వైర్‌లెస్ పరికరాలకు మరమ్మతులు చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉందని, మత్స్యకారులు వేటకు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. మత్స్యసంపద ఎక్కువ వచ్చే అవకాశం ఉందని ఆశల్లో ఉన్నారు. పెద్దబోటులో 20మందికిపైగా మత్స్యకారులు వేటకు వెళ్తారు. వారం రోజులు సముద్రంలో వేట చేసుకుని మత్స్య సంపదతో తీరానికి చేరుకుంటారు. ఫైబర్‌బోటులో అయితే ఐదుగురు, మూడు రోజులు వేట చేస్తారు. నిజాంపట్నం హార్బర్ పరిధిలో 400 వరకు పెద్దబోట్లు, 300 ఫైబర్‌బోట్లు ఉన్నాయి. వేటపై ఆధారపడి 2 వేల కుటుంబాలు ఉండగా వారంతా వేటకు సిద్ధమవుతున్నారు. వేట విరామంలో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది.

నాటు సారా నిర్మూలనకు కమిటీలు

- కలెక్టర్ జె.వెంకటమురళి
- నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాలపై సమీక్ష

బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మద్యం అక్రమ విక్రయాలు, నాటుసారా నిర్మూలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. నాటుసారా నిర్మూలనపై నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా తయారీని అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టాలని చెప్పారు. మద్యం అక్రమ విక్రయాలు జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. గోవా నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యంను అరికట్టాలని సూచించారు. చాక్లెట్‌లు, ద్రవపదార్థాల రూపంలో గంజాయి విక్రయాలు జరిగితే సహించేదిలేదన్నారు. చీరాల మండలంలో 9 గ్రామాలు, బాపట్ల మండలంలో రెండు గ్రామాలు, రేపల్లె మండలంలో ఒక గ్రామంలో నాటుసారా ఉత్పత్తులు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. 17 గ్రామాల్లో 65 కుటుంబాలు రహస్యంగా నాటుసారా ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటికే గడిచిన నాలుగు నెలల్లో 43 కేసులు నమోదు అయ్యాయని 29 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. ఆ కుటుంబాలను వృత్తి నుంచి మాన్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటుసారా ఉత్పత్తులను బాపట్లలో పూర్తిగా అరికట్టడానికి మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమించాలని ఆదేశించారు. ఈ కమిటీలు అత్యంత చురుగ్గా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బందిని కమిటీలో చేర్చాలన్నారు. కళాజాత బృందాలతో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ హేమంత నాగరాజు, ప్రొహిబిషన్ పర్యవేక్షణాధికారి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీరు @ 24/7

- గుంటూరు సహా నాలుగు పట్టణాల్లో
- పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో పనులు
- రానున్న ఏడాదిలో పథకం ప్రారంభానికి చర్యలు

ఇక పుష్కలంగా నీటి సరఫరా

ఈ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా..

తొలుత కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా 24/7 నీటి సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. గుంటూరులో వికాస్‌నగర్, తెనాలిలో బస్టాండ్ ఏరియా, నరసరావుపేటలో ప్రకాశ్‌నగర్, చిలకలూరిపేటలో పండరీపురం ప్రాంతాలను ఎంపిక చేశారు. ఆ ప్రాంతాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లతో పాటు డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లను నిర్మించనున్నారు. ఆయా పనులకు టెండర్లు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత 24/7 నీటి సరఫరా చేయనున్నారు.

తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియక రోజంతా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండదు. ఒకవేళ ఎక్కడికైనా వెళ్తే ఆ రోజుకు తాగునీరు పట్టుకోలేమోనని ఆందోళన అవసరం లేదు. వారంలో ఏడు రోజులు.. 24 గంటలు పుష్కలంగా తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయమా.. మధ్యాహ్నమా.. సాయంత్రమా.. లేక రాత్రి అన్న తేడా లేకుండా రోజులో ఎప్పుడైనా కుళాయి తిప్పితే తాగు నీరు అందేలా సరఫరాకు చర్యలు చేపట్టింది. గుంటూరు కార్పొరేషన్‌తో పాటు తెనాలి, నరసరావు పేట, చిలకలూరిపేట పట్టణాల్లో 24 గంటల నీటి సరఫరా పథకాన్ని అమలు చేయనున్నారు. పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు. నీటి సరఫరాకు అవసరమైన పనులను గుర్తించారు. ఆయా పనులకు టెండర్ ప్రక్రియ చేపట్టారు. రానున్న ఏడాదిలో ఈ పథకం ప్రారంభించనున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎంపిక చేసిన మున్సిపల్ పట్టణాల్లో 24 గంటలు తాగునీటి సరఫరాతో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తీరిపోనున్నాయి. ఇందుకు మున్సిపాల్టీలు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. 24/7 నీటి సరఫరాకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట మున్సిపల్ పట్టణాలను ఎంపిక చేశారు. ఈ పట్టణాల్లో 24/7 నీటి (మిగతా 6వ పేజీలో)





నీటి సరఫరాకు ఎంపిక చేసిన నరసరావుపేటలోని ప్రకాశ్‌నగర్



కాకానిపాలెంలో ఆరోగ్య కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళి

విద్యా, వైద్యానికి ప్రాధాన్యం

- అద్దంకిలో డయాలసిస్, హెచ్‌ఐవీ కేంద్రాలకు కృషి
- పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి రవికుమార్

అద్దంకి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యంతో పాటు రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి, ఏడాదిలోనే మార్పు తీసుకొచ్చామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి రేణింగవరంరోడ్డులో రూ.1.46 కోట్లతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం మంత్రి కలెక్టర్ వెంకటమురళితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అద్దంకిలో డయాలసిస్ సెంటర్ అందుబాటులో లేక గుంటూరు, ఒంగోలు వెళ్లేందుకు రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రాన్ని, హెచ్‌ఐవీ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. నెల రోజుల్లో నియోజకవర్గంలో 4 ప్రభుత్వ వైద్యశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో విజయమ్మ, ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, తహసీల్దారు శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర పాల్గొన్నారు.



కలెక్టర్, డీఎంహెచ్‌వోలతో చర్చిస్తున్న మంత్రి రవికుమార్

ప్రభుత్వ భూమిని గుర్తించండి

అద్దంకికి రెండు సబ్‌స్టేషన్లు, అగ్నిమాపక కేంద్ర మంజూరైతే ప్రభుత్వ భూమి లేక వాటి ఏర్పాటుకు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు అవసరాల కోసం ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు మినీ బైపాస్ రోడ్డు ఏర్పాటుకు కాల్వ కట్టపై ఉన్న ఆక్రమణలను జూలై చివరికల్లా తొలగించాలన్నారు. శింగరకొండ నుంచి రేణింగవరం రోడ్డు వరకు కూడా రెండో విడతలో మినీ బైపాస్ పొడిగిస్తామన్నారు.

డీఎస్‌వోగా జమీర్‌బాషా

జిల్లాలో అధికారుల బదిలీలు



బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారుల బదిలీలు పెద్దఎత్తున జరిగాయి. బాపట్ల జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి డీఎస్‌వోగా ఉన్న ఈబీ విలియమ్స్‌ను ఏలూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న షేక్.జమీర్‌బాషాను నియమించారు. మంగళవారం విలియమ్స్ రిలీవ్‌కాగా జమీర్‌బాషా బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

- మైనింగ్ ఏడీ పి.రాజేష్‌కుమార్‌ను రాయచోటికి బదిలీ చేశారు.
- జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ స్థానంలో కడప డీడీఏ ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావును నియమించారు. జూలైలో రామకృష్ణ ఉద్యోగ విరమణ అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరరావు బాధ్యతలు తీసుకోనున్నారు.

తీరాన్ని కబళిస్తున్నారు

కట్టలు చదును.. ఆపై ఆక్రమణ • ప్రమాదంలో తీర ప్రాంత గ్రామాల రక్షణ

తాజాగా చదును చేసి పార్కింగ్‌కు కేటాయించిన ఓ రిసార్ట్ నిర్వాహకులు



తీరం వరకు నేలను రోడ్డుకు మూడు అడుగుల తక్కువలో చదును చేసి వేడుకలకు సిద్ధం చేసిన ఓ రిసార్ట్ నిర్వాహకులు



చీరాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చీరాల పరిసర ప్రాంతాల్లోని తీరం ఆక్రమణలతో కనుమరుగైపోతోంది. వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం వరకు తీరాన్ని కబ్జా చేసేస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. అక్రమార్కులు బరి తెగిస్తూ రిసార్ట్స్ నిర్మిస్తున్నారు. కట్టలను తొలగించి టేబుల్స్ వేస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఇటీవల ఓ రిసార్ట్ నిర్వాహకుడు ఎదురుగా ఉన్న తీరం కట్టను తొలగించి పార్కింగ్‌గా మార్చుకున్నాడు. గ్రామాలకు రక్షణగా తీరంలో సహజ సిద్ధంగా ఏర్పడిన 10 అడుగుల ఎత్తైన కట్టలు సైతం కబళిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో తీరం వెంబడి ఉన్న కట్టలు సునామీ ఉధృతిని నిలువరించాయి. అలాంటి కట్టలు కనుమరగవుతుండటంతో మత్స్యకార గ్రామీణులు భయాందోళనలు చెందుతున్నారు. తీరంలో రిసార్ట్స్ నిర్మాణంతో ఎంతో అభివృద్ధి సాధిస్తోంది. నిరుద్యోగులకు ఉపాధితో పాటు, పర్యాటక రంగం వృద్ధి చెందుతుంది. అయితే వ్యాపారులు వారి స్వలాభం కోసం తొక్కుతున్న అడ్డదారులతో ప్రజారక్షణ ప్రమాదంలో పడింది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే కూల్చేస్తాం..



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిసార్ట్స్ నిర్మిస్తే కూల్చివేస్తాం. తీరానికి సంబంధించిన కట్టలు చదును చేస్తున్నట్లు సమాచారం ఉంది. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్‌నాయుడు, ఆర్డీవో చీరాల

జీడీసీసీబీ భోక్తలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార(జీడీసీసీ) బ్యాంకులో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి భోక్తలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగుల సంఘ నేతలు డిమాండ్ చేశారు. సత్యమేవ జయతే పేరుతో మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల నేతలతో పాటు ఉద్యోగుల సంఘ నేతలు ప్రసంగించారు. రెవెన్యూ రికార్డు, ఆధార్, పాన్ కార్డులు సృష్టించి డీసీసీబీలో అక్రమంగా రుణాలు పొందిన వారి నుంచి సదరు మొత్తాన్ని వసూలు చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహకార శాఖ ద్వారా చేపట్టిన సెక్షన్ 51 విచారణ కొందరిని సంతృప్తి పరిచేలా, అసలైన నిందితులను కాపాడేందుకు జరిగినట్లుగా ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు. అక్రమాల్లో కీలక భూమిక పోషిస్తున్న అధికారులకు కొందరు పెద్దల సహకారం ఉన్నట్లుగా భావించాల్సి వస్తుందని తెలిపారు. స్కాంతో సంబంధంలేని ఉద్యోగులపై చర్యలు నిలుపుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

సత్యమేవ జయతే అంటూ సహకార ఉద్యోగుల దీక్ష

ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి శ్రీనివాసరావు, అఖిల భారత కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ నేతలు కె.వి.ఎస్.రవికుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఎం.హనుమంతరావు, అరుణ్‌కుమార్, అంజిబాబు, జాతీయ కార్యదర్శి గని, కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు రెడ్డి, పవన్, శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్(టీడీపీ), మస్తాన్‌వలి(కాంగ్రెస్), సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు కొరివి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, రచయిత దేవరకొండ శ్రీనివాస్, కళాకారులు అభ్యుదయ గేయాలు ఆలపించారు.



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టిన కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగులు

రేపు కడవకుదురులో అథ్లెటిక్స్ ఎంపిక

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 12వ తేదీన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగిరెడ్డి స్వామిరెడ్డి, ఎం.వెంకటరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే అథ్లెట్లు 2007 జూన్ 7వ తేదీకి ముందు పుట్టినవారై ఉండాలని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మార్కుల సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో 12వ తేదీ ఉదయం 8గంటలకు హాజరుకావాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన అథ్లెట్స్‌ను ఆంధ్రప్రదేశ్ సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక చేస్తామని, వివరాలకు 7416825797, 9542354041, 9666685664 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తాగునీరు ఎట్ 24/7

(5వ పేజీ తరువాయి)

సరఫరాకు అవసరమైన చర్యలను పబ్లిక్‌హెల్త్ అధికారులు చేపట్టారు. ఏడాది లోపు ఆయా పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇక ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో లక్ష జనాభా దాటిన పట్టణాల్లో అమృత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అమృత్ పథకాన్ని ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పనులను అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఆ పనులను పట్టాలెక్కించింది. రక్షిత మంచి నీటి పథకాలను విస్తరిస్తున్నారు. నరసరావుపేటలో రూ.29.42 కోట్లతో, గుంటూరులో రూ.381.12 కోట్లు, తెనాలిలో రూ.61.61 కోట్లు, చిలకలూరిపేటలో రూ.160.90 కోట్ల వ్యయంతో అమృత్ 2.0 కింద పనులు చేపట్టనున్నారు.

135 లీటర్లు దాటితే పన్ను

ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇంతకు మించి నీటిని వినియోగిస్తే అదనపు నీటి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. నీటి వినియోగాన్ని లెక్కించేందుకు మీటర్లు ఏర్పాటు చేస్తారు. నీటి పన్ను ఒక్కో పట్టణంలో ఒక్కోరకంగా ఉంది. ఉదాహరణకు నరసరావుపేటలో నెలకు ఇంటికి రూ.100 నీటి పన్ను చెల్లించాలి. ఇంట్లో ఎంత మంది ఉన్నారో గుర్తించి ఒక్కొక్కరికి 135 లీటర్ల చొప్పున వినియోగానికి నెలకు రూ.100 పన్ను చెల్లిస్తే సరిపోతోంది. ఇంతకు మించి వినియోగిస్తే అదనంగా పన్ను వసూలు చేస్తారు. నీటి వృథాను అరికట్టేందుకే ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సహకార శాఖలో బదిలీలు

- డీసీఏవోగా రవిరాజశేఖర్

ఒంగోలు విద్య, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సహకార శాఖలో డివిజనల్ సహకారాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇనస్పెక్టరుగా పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఏవోగా పనిచేస్తున్న పోలిశెట్టి రాజశేఖర్ బదిలీ అయ్యారు. ఆయనను కావలి డివిజనల్ సహకారాధికారిగా నియమించారు. నెల్లూరు జిల్లా గుడూరు డివిజనల్ సహకారాధికారిగా పనిచేస్తున్న జి.రవిరాజశేఖర్‌ను ఇక్కడ డీసీఏవోగా నియమించారు. ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా పల్నాడు జిల్లా సహకార ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న డి. శ్రీనివాసరావును నియమించారు. ఇక్కడ డీసీఏవోగా పనిచేస్తున్న పి.రాజశేఖర్ ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా కూడా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పిరాజశేఖర్ మంగళవారం ఇక్కడి నుంచి రిలీవ్ కాగా డీసీఏవోగా రవి రాజశేఖర్, ఒంగోలు డీఎల్‌సీఏగా శ్రీనివాసరావులు బాధ్యతలు స్వీకరించారు. సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న పలువురు అధికారులు కూడా బదిలీ అయ్యారు. వినుకొండ ఎస్‌డీఏకేసీవోగా పనిచేస్తున్న ఎస్.సురేంద్రబాబును ఒంగోలు ఎస్‌డీఎల్‌సీవోగా నియమించారు అద్దంకి ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న ఎల్.సుధాకరరావును చీరాలకు బదిలీ చేశారు. కందుకూరు ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న వేణుగోపాలరావును ఒంగోలు జిల్లా సహకారాధికారి కార్యాలయానికి బదిలీ చేశారు. గిద్దలూరు ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న జీ.వీరప్రసాద్‌ను మార్కాపురానికి బదిలీ చేశారు. పలువురు సీనియర్ ఇన్‌స్పెక్టర్లను కూడా బదిలీ చేశారు. దర్శి ఎస్‌డీఎల్‌సీవో కార్యాలయంలో పనిచేస్తున్న జీవీ.ప్రసాదరావును బాపట్లకు బదిలీ చేయగా, అద్దంకిలో పనిచేస్తున్న వై వెంకటేశ్వరరావును దర్శికి, బి.మాధూరిని ఒంగోలు నుంచి కందుకూరు, అద్దంకిలో పనిచేస్తున్న టి. శ్రీనివాసులును ఒంగోలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

తెలుగుజాతి ఉన్నంత కాలం ఎన్‌టీఆర్ గుర్తే

జగన్ ఈ సమాజానికి పట్టిన చెద

పొత్తు ధర్మాన్ని ప్రతిఒక్కరూ పాటించాలి

మంత్రి రవికుమార్



ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి విక్టరీ చూపిస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, జూన్10(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఉన్నంత కాలం ఎన్‌టీఆర్ తెలుగు ప్రజల హృదయాలలో గుర్తుంటారని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని పార్వతీపురంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఏపార్టీ, ఏ వ్యక్తి కూడా తెలుగుదేశం పార్టీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేదన్న విషయం పలుమార్లు రుజువైందన్నారు. టీడీపీ లేకుండా చేయాలని జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా, గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక సీట్లతో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని చెప్పారు. జగన్ ఈ సమాజానికి పట్టిన చెద అని విమర్శించారు. మహిళల పట్ల వైసీపీ నేతలు అసభ్యకరంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పార్వతీపురం ఎత్తిపోతల పథకం మరమ్మతులకు టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు చెప్పారు. పొత్తు ధర్మాన్ని అందరూ పాటించాలని నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ముందుగా బాలకృష్ణ జన్మదినం సందర్భంగా ఆయన ఫాన్స్ ఏర్పాటు చేసిన కేక్‌ను మంత్రి కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కంచర్ల వెంకటరావు, కోట వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు

ఏడాది పాలనలోనే గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మండలంలోని గోవాడలో రూ.1.20 కోట్లతో నామ్ రోడ్డు నుంచి గోవాడ వరకు పునఃనిర్మాణం చేసిన తారురోడ్డును, టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ మార్గం ఆర్చీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు భవనాశివాగుపై బ్రిడ్జి నిర్మాణం, గుడి వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే మంజూరు చేస్తున్నట్లు రవికుమార్ ప్రకటించారు. అనంతరం కొత్తకోటికలపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. పార్వతీపురంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ పథకానికి మంత్రి రవికుమార్ శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులను మంత్రి దగ్గర ఉండి స్థానికులు, మహిళలతో ప్రారంభించడం విశేషం. కార్యక్రమాలలో విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, ఏవో వెంకటకృష్ణ, కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్, మాజీ సర్పంచులు పుట్టా దేవిసాంబశివరావు, ఏడుకొండలు, మండల టీడీపీ నేతలు మానం మురళీమోహన్‌దాస్, చాగంటి రాజేంద్రప్రసాద్, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, కోంద్రు వీరాంజనేయులు, నర్రా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్య కన్నా సభకే ప్రాధాన్యం

పొగాకు సాగులేని ప్రాంతాల నుంచి

భారీగా తరలింపునకు నేతల యత్నాలు

నేడు పొదిలిలో పొగాకు రైతులతో జగన్ ముఖాముఖి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాక సందర్భంగా భారీగా ప్రజలను సమీకరించేందుకు వైసీపీ నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. తద్వారా ప్రజల్లో పార్టీకి ముఖ్యంగా జగన్‌కు ఆదరణ తగ్గలేదన్న భావన కలిగించే ఉద్దేశంతో ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ నేతల ప్రయత్నాలను పరిశీలిస్తే జగన్ బుధవారం పొదిలి రాక వెనక పొగాకు రైతుల సమస్య పరిష్కారమా లేక బల నిరూపణ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారణాలు ఏమైనా ఈ ఏడాది దేశవ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించటం లేదు. కొన్ని పంటల ఉత్పత్తులు అయితే కొనే నాధుడే కరువయ్యాడు. ఈ దశలో ఆయా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు కూడా చేపట్టాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా విషయానికి వస్తే ప్రధానమైన వాణిజ్య పంట పొగాకు అధికంగా సాగు అవుతుంది. ఒకవైపు దొర పొగాకు, బర్లీ పొగాకును రైతుల భారీగా పండించారు.

బర్లీ సమస్య ప్రభుత్వం స్పందన ఇలా...

బర్లీ సాగులో పర్చూరు నియోజకవర్గం అగ్రగామిగా ఉంది. మొత్తం నల్ల బర్లీ సాగులో 65శాతం సాగు అక్కడే జరుగుతుంది. నల్ల, తెల్లబర్లీని కొనే వారు కరువయ్యారు. ఈ సమస్యను తొలుత పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు జోక్యం చేసుకున్నారు. వివిధ పరిణామాల అనంతరం బర్లీ పొగాకు కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపింది. పర్చూరు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ బర్లీ పొగాకు రైతుల సమస్యలపై వైసీపీ గాని ఆ పార్టీ అధినేత జగన్ కాని ప్రభుత్వంపై ఒత్తిడి చేసిన దాఖలాలు లేవు.

నేగు జగన్ కార్యక్రమ తీరు తెన్ను

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ముఖ్య ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసీపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమే. కానీ అందుకు జగన్ దొర పొగాకు అధికంగా పండే ప్రాంతాలను వదిలేసి పొదిలి ప్రాంతాన్ని ఎంచుకోవటమే చర్చనీయాంశమైంది. దీనికితోడు జగన్ రాక సందర్భంగా ప్రజలను భారీగా సమీకరించేందుకు వైసీపీ నాయకులు సర్వశక్తులొడ్డి ప్రయత్నించటం కూడా చర్చనీయాంశమైంది. అందునా దొర పొగాకు తక్కువగా పండే దర్శి, మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి జనసమీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ప్రాంతాల్లోనే ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నాయకులు భారీగా వాహనాలు ఏర్పాటు చేయటం విశేషం. మరోవైపు తూర్పు ప్రాంతంలో కూడా వైసీపీ నాయకులు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి అదేదో బలప్రదర్శన అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. దీంతో జగన్ రైతుల కోసమా.. బలప్రదర్శన కోసమా అనేది చర్చనీయాంశమైంది. పైగా ఆయన కూడా ఎప్పటిలాగే గంట సమయం మాత్రమే కేటాయించటం విశేషం.



జిల్లాలోనే అత్యధికం

ఇక దొర పొగాకు సాగు విషయానికి వస్తే ప్రకాశం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగు అవుతుందనేది జగమెరిగిన సత్యం. ఈ పంట సాగు కూడా అధికంగా కందుకూరు, కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు ఆ తర్వాత కనిగిరి, పొదిలి ప్రాంతాలతోపాటు ఇతర నియోజకవర్గాల్లో అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో సాగవుతుంది. గత ఏడాది అత్యధిక ధర లభించింది. మంచి లాభాలు వచ్చాయి. దీంతో రైతులు మరింత ఉత్సాహంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. దిగుబడి పెరగటంతో మార్కెట్‌లో సమస్య ఎదురైంది. అంతోఇంతో కొనుగోలులో సమస్యలు లేవు. గత ఏడాది కన్నా ధర తగ్గటమే ప్రధాన సమస్య. ఈ విషయంపై రాష్ట్రప్రభుత్వం కూడా స్పందించింది. ఒంగోలులో మంత్రులు స్వామి, రవికుమార్, రామనారాయణ రెడ్డి ఇతర టీడీపీ ఎమ్మెల్యేలు ఈ సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బోర్డు చైర్మన్, అధికారులు, వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని కేంద్ర పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడటంతో పాటు వ్యాపార సంస్థలు రైతులకు న్యాయం చేయకపోతే ఇబ్బందిపడతారని హెచ్చరికలు జారీ చేశారు. ఆ తర్వాత కొనుగోలులో వేగం పెరిగినప్పటికీ గత ఏడాది ధర మాత్రం రైతులకు లభించని మాట నిజం. బర్లీ పొగాకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించిన రాష్ట్రప్రభుత్వం తదనంతర చర్యగా దొర పొగాకు సమస్యపై దృష్టిసారించింది.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న వేటపాలెం ఎడ్లజత






బండను లాగుతున్న ఎడ్ల జత, ప్రథమ బహుమతి రూ.70వేలు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు సింగయ్య

సింగరాయకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఐదో రోజైన మంగళవారం ఆలయ సమీపంలో గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

పలు జిల్లాల నుంచి ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత నిర్ణీత 20 నిమిషాల్లో 3300 అడుగుల దూరంలాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన గోటికె హెత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో 3,168 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలేనికి చెందిన ఎడ్లజత నిర్ణీత సమయంలో 3,144 అడుగుల దూరంలాగి తృతీయ స్థానం దక్కించుకుంది. బల్లికురవ గ్రామానికి చెందిర పావులూరి వీరిస్వామిచౌదరికి చెందిన పీవీఎస్ఆర్ బుల్స్ 3100 దూరం లాగి చతుర్థస్థానాన్ని, ప్రకాశం జిల్లా అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు శివశంకర్ ఎడ్లజత నిర్ణీత 20 నిమిషాల్లో 2700 అడుగుల దూరంను లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్లజత యజమానులకు వరుసగా బహుమతులను టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య రూ.70వేలు, గంజిప్రసాద్ రూ. 50వేలు, బాపట్ల బ్రదర్స్ రూ. 40వేలు, చిమట మాధవ రూ.20వేలు అందజేశారు. నేడు రాష్ట్ర స్థాయి రాదాడి పోటీలను నిర్వహించనున్నారు.

చెరువులో పడి యువకుడు మృతి



వెంకటేష్ మృతదేహం

సంతనూతలపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు పెద్ద చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలశ్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. చీమకుర్తికి చెందిన నేరెళ్ల వెంకటేష్ (25) సోమవారం మధ్యాహ్నం చీమకుర్తి నుంచి ఒంగోలుకు ఆటోలో బయలుదేరాడు. రాత్రి 10 దాటిన అతను ఇంటికి చేరుకోకపోవడంతో చుట్టుపక్కల వారిని, వేరే ఊళ్లలో బంధువులను కుటుంబసభ్యులు విచారించారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం స్థానికులు కొందరు పెద్దచెరువు వైపుగా వెళ్తుండగా మృతదేహం నీటిలో తేలియాడుతున్న విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చేరుకుని వెంకటేష్ మృతదేహంగా గుర్తించి కన్నీరుమున్నీరు అయ్యారు. పోలీసులు చెరువులో నుంచి మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మార్గం మధ్యలో సంతనూతలపాడు చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిగిఉంటాడని, ప్రమాదవశాత్తు నీటిలో పడి వెంకటేష్ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు తండ్రి పున్నారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో

122 మంది బదిలీ

డిప్యూటీ ఎంపీడీవోలు 16 మంది..

గ్రేడ్-1 నుంచి 4 వరకు 106 మందికి స్థానచలనం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న 122మందిని బదిలీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తదనుగుణంగా ఈ బదిలీలను నిర్వహించారు. ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులు తొమ్మిది మంది ఉండగా రిక్వెస్టు కింద 71మంది, పరిపాలన సౌలభ్యం కోసం మరో 29మందిని మార్చారు. అందులో ఇతర జిల్లాలకు 13మందిని బదిలీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవోలు(ఈవోపీఆర్‌డీ) 16 మంది, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 20మంది, గ్రేడ్ పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులు 45మంది, గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు 39మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో డిప్యూటీ ఎంపీడీవోలు ఎనిమిది మందిని, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-3 కార్యదర్శులు ముగ్గురిని బాపట్ల, నెల్లూరు జిల్లాలకు పంపారు.

అవీఇవీ

గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలు



గాయపడిన సత్యనారాయణని వైద్యశాలకు తరలిస్తున్న బంధువులు

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన కడవకుదురు రైల్వే గేట్ సమీపంలో మంగళవారం చోటుచేసుకొంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... కడవకుదురు గ్రామానికి చెందిన తోటకూర నాగరాజు, కుమారులు సత్యనారాయణ, హరికిరణ్‌లు తమ మేనమామ గ్రామమైన వేమూరు మండలం పెరవలిపాలెం నుంచి గుడివాడ నాగేంద్రంతో కలిసి అతని ద్విచక్ర వాహనంపై కడవకుదురు గ్రామానికి వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న వారు కడవకుదురు రైల్వేగేటు దాటిన తరువాత చీరాల వైపు వేగంగా వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేంద్రం, హరికిరణ్‌లకు గాయాలు కాగా, సత్యనారామణ కుడికాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో గాయపడిన వారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారామణను మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ మణిపాల్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

325 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం



పాలవ్యాన్‌లో పట్టుబడిన రేషన్ బియ్యంతో ఎస్సై మహ్మద్ రఫీ

మేదరమెట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో పాలవ్యానులో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మేదరమెట్ల ఎస్సై షేక్ మహ్మద్ రఫీ పట్టుకున్నారు. సోమవారం రాత్రి నిర్దిష్ట సమాచారం మేరకు గుంటూరు వైపు నుంచి కృష్ణపట్నం వెళుతున్న బియ్యం లారీని ఎస్సై సిబ్బందితో కలసి పట్టుకున్నారు. తనిఖీ చేయగా ప్లాస్టిక్ బ్యాగుల్లో ఒక్కొక్కటి 30కేజీల బరువున్న 325 రేషన్ బస్తాలను గుర్తించారు. లారీడ్రైవర్ దేవరకొండ గోపీని విచారించగా చిలకలూరిపేటకు చెందిన కిషోర్‌కు చెందిన బియ్యంగా తెలిపినట్లు సమాచారం. ఆ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై మహ్మద్ రఫీ తెలిపారు.

అటవీభూములను ఆక్రమిస్తే చర్యలు

కొప్పెరపాడులో అటవీభూములను పరిశీలించిన బీట్ ఆఫీసర్



ఆక్రమణలోఉన్న అటవీ భూములను పరిశీలిస్తున్న బీట్ ఆఫీసర్ రమేష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అటవీ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కూకట్లపల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె.రమేష్ హెచ్చరించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కొండపోరంబోకు భూమి ఆక్రమణ' శీర్షికన వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. కొప్పెరపాడు గ్రామ సమీపంలో ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ మాట్లాడుతూ, అటవీ భూములను కొందరు ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్నారన్నారు. అలా చేయటం చట్ట రీత్యా నేరమని చెప్పారు. కొండ వద్దకు దారిని కూడా ఏర్పాటు చేశారని, వెంటనే దారిని తొలగించాలని తెలిపారు. ఈ పరిశీలనలో రెవెన్యూ గ్రామ వీఆర్వో గురవయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం

అద్దంకిటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఇద్దరు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం రోటరీ కార్యాలయంలో దాత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నుపాటి రామాంజనేయులు సౌజన్యంతో ఇంటర్ చదువుతున్న తస్నీరు మణికంఠ, సయ్యద్ అమీర్ అహమ్మద్ కళాశాల ఫీజుగా ఒక్కొకరికి రూ.15 వేలు చొప్పున రూ.30 వేలను అందజేశారు. తాను పేదరికం నుంచి వచ్చానని, ఏటా విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు రామాంజనేయులు అన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళీసుధాకరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, సుబ్బారావు, రామాకోటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయలపల్లి, నర్సాయపాలెం గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ఫాంపాండ్లు, కంధకాలు, గోకుల షెడ్‌లను దిశ జాయింట్ డైరెక్టర్ ఉమేష్ కుమార్‌రామ్, రూరల్ డెవలప్‌మెంట్ అకౌంట్ ఆఫీసర్ జీఎస్ రావత్, ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాలలో గ్రామసభలను నిర్వహించి ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏడు వారాలుగా చేసిన పనులకు నగదు జమకాలేదని కూలీలు బృంద సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో శైలజ, పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు

చెన్నూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో బరకం వెంకటేశ్ అనే వ్యక్తికి కడప 7వ ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఎ.రమేశ్‌కుమార్ జీవితఖైదుతో పాటు రూ.లక్షా 50 వేలు జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు.. చెన్నూరు మండలంలోని ఓ గ్రామ సచివాలయం పరిధిలో వలంటీరుగా పనిచేస్తున్న మహిళకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన బరకం వెంకటేశ్ పరిచయం అయ్యాడు. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. వెంకటేశ్ ఆ మహిళపై ప్రేమ ఉన్నట్లు నటించి పెళ్లి చేసుకుందామని నమ్మించి కడప నగరంలోని ఓ లాడ్జికి పిలిపించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తరువాత మహిళ పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో నిరాకరించడంతో పాటు దుర్భాషలాడాడు. దీనిపై 2021 జూన్ 20న బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. అనంతరం విచారణను అప్పటి కడప రూరల్ సీఐ మహ్మద్ ఆలీకి అప్పగించారు. సీఐ దర్యాప్తు చేసి వెంకటేశ్‌ను అరెస్టు చేసి కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి ఎదుట విచారణకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ క్రిష్ణారెడ్డి సంబంధిత సాక్షులను సకాలంలో హాజరు పరిచారు. బాధితురాలి తరఫున ఎం.యాస్మిన్ వాదనలు వినిపించారు. ఈ మేరకు వెంకటేశ్ నేరం చేసినట్టుగా రుజువు కావడంతో అతడికి జీవిత ఖైదుతో పాటు రూ.1.50 లక్షలు జరిమానా విధిస్తూ మంగళవారం జడ్జి తీర్పు ఇచ్చారు.

తీరనున్న విద్యుత్ వెతలు



లైన్లు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

- నలభై ఏళ్లనాటి స్తంభాలు మార్పు
- కొత్త తీగలతో లైన్లు
- ఇప్పటికే 2500 స్తంభాలు 34 ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు

మేదరమెట్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఎప్పుడో 40 ఏళ్లకు పూర్వం నిర్మించిన విద్యుత్ లైన్లు కిందకు వేళాడుతూ తరచూ మరమ్మతులకు గురవుతూ ఉండేవి. కొద్దిగా వర్షం పడినా, కొద్దిగా గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. భవనాలకు దగ్గరగా వేళాడుతున్న తీగలతో బిక్కు బిక్కు మంటుండేవారు. అయితే కొరిశపాడు మండలంలోని విద్యుత్‌శాఖ అధికారులు ఒక్కసారిగా పునఃనిర్మాణ పనులు చేపట్టారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో మట్టిరోడ్లున్నప్పుడు అర్థశతాబ్దం క్రితం విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. ఆ తరువాత గ్రామాలలో భవనాల నిర్మాణం పెరగడం, వీటికితోడు సిమెంట్‌రోడ్లు రావడంతో విద్యుత్ స్తంభాల ఎత్తు తగ్గింది. దీనికి తోడు పాతలైన్లు కావడంతో కిందకు వేలాడుతూ ఉండేవి. ఇక గ్రామాలు కూడా విస్తరించడంతో గతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు సామర్థ్యం చాలక తరచూ ఫీజులు పోయేవి. దీంతో ఎంతో ఇబ్బందికి గురయ్యేవారు. ముఖ్యంగా గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో కొరిశపాడు మండలంలో కొత్త విద్యుత్ స్తంభాలు, లైన్లు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. మేజర్ పంచాయతీలైన మేదరమెట్ల, రావినూతల, పమిడిపాడు గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పాతవాటి స్థానంలో 1500 కొత్త స్తంభాలు, 19 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించడంతో వేలాడుతున్న తీగలు, లోటల్టేజ్‌తో పాటు విద్యుత్ సమస్యలు తొలగిపోయాయని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొరిశపాడు, కుర్రవానిపాలెం, అనమనమూరు, దైవాలరావూరు, బొల్లవరప్పాడు, ప్రాసంగులపాడు, కాకానివారిపాలెం, రాచపూడి, అనుబ్రోలువారిపాలెం, బొడ్డు వానిపాలెం గ్రామాల్లో పాతస్తంభాల స్థానంలో 1000కి పైగా కొత్త స్తంభాలతోపాటు పాటు 15 ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం పూర్తిచేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో పడుతున్న ఇబ్బందులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముగింపు పలికారని, కొత్త నిర్మాణాల పట్ల కాలనీల వాసులు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

తిమ్మనపాలెం, ఎర్రబాలెం గ్రామాల్లో లైన్ల మార్పు పనులు జరుగుతున్నాయి. తమ్మవరం, వి.గుడిపాడు గ్రామాల్లో పనులు మొదలు కావలసి ఉందని విద్యుత్‌శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మంగళవారం మేదరమెట్లలో పూర్తైన పనులను డీఈ దామోదర్, ఏఈ మైలా శ్రీనివాసరావు సిబ్బందితో కలసి పరిశీలించారు.

తరచూ కరెంట్ పోతుండేది

గతంలో తరచూ లోటల్టేజ్ సమస్యతో కరెంట్ పోతూ ఉండేది. ఎప్పుడో 40ఏళ్ల క్రితం వేసిన స్తంభాలు, తీగలు కిందకు వేళాడుతూ ఉండేవి. మంత్రి రవికుమార్ చొరవతోనే ఎత్తు స్థంభాలు కొత్త తీగలు వేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టారు. దీంతో లోటల్టేజ్ సమస్య పరిష్కారమైంది.

పందుల ఆశీర్వాదం

అవీ..ఇవీ..

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో పోలేరమ్మ

హనుమోజిపాలెం (ఇంకొల్లు), జూన్ 10, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హనుమోజిపాలెంలో వేంచేసిన పోలేరమ్మ పోతురాజు స్వామివార్లకు మంగళవారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మూడో వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం, భరతనాట్యంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

మార్టూరు,జూన్10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, చిన్న వయస్సులోనే వివాహాలు జరగడం ద్వారా కలిగే నష్టాలను అంగన వాడీ సూపర్ వైజరు టి.శిరీష వివరించారు. మంగళవారం మార్టూరులో నేతాజీనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన శిరీష మాట్లాడుతూ బాలికల తల్లిదండ్రులకు బాల్య వివాహాలు వలన ఏర్పడనున్న సమస్యలను వి వరించాలన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహం జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శారదాదేవి, ప్రమీలరాణి, ఇంకా అంగనవాడీ కార్యకర్తలు అరుణ, రాజ్యం, దయమ్మ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి

- ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య
- చీరాల్లో ఏపీ మార్క్‌ఫెడ్ గోదాము ప్రారంభం



పొగాకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బర్లీ రైతుల క్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ వెంకటమురళీ, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. చీరాల పరిధిలోని పేరాల్లో ఏపీ మార్క్ ఫెడ్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదామును కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని కంపెనీల మాటలతో గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు రైతులు పొగాకు సాగుచేసి మోసపోయారన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ కంపెనీను రంగంలోకి దింపినట్లు చెప్పారు. ఇప్పటికే పర్చూరు, చీరాల మండలాల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరో మూడు కేంద్రాలు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్లు చెప్పారు. రైతుల వద్ద 7.78 లక్షల క్వింటాళ్ల పొగాకు ఉండగా, మార్క్ ఫెడ్ 1.48 లక్షలు క్వింటాళ్ల కొనుగోళ్ల చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈనెల 16 నుండి కొనుగోళ్ల విస్తృతం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జీఎం కరుణశ్రీ, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, తదతర అధికారులు, రైతులు ఉన్నారు.

వృద్ధులకు ప్రాణాయామంపై అవగాహన

మార్టూరు, జూన్10 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని అ మ్మ ఆశ్రమంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు ధ్యానం, ప్రాణాయామం, యోగాసనాలపై వైద్యాధికారి అంజమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతేగాకుండా వారిలో కొంతమందితో యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో యోగ ఇన్‌స్ట్రక్టర్ సౌజన్య,కాంపౌండర్ తనూజ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వారికి ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య

- టీడీపీ స్పోక్స్‌పర్సన్ మాదిగాని గురునాథం

పర్చూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) :అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని టీడీపీ స్పోక్స్‌పర్సన్ మాదిగాని గురునాథం అన్నారు. రాజకీయ మీడియా ముసుగులో వైసీపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే దీనికి భేషరతుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం

అద్దంకిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఇరువురు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం రోటరీ కార్యాయలంలో దాత, విశ్రాంత ప్రధానోపధ్యాయులు చెన్నుపాటి రామాంజనేయులు సౌజన్యంతో ఇంటర్ మీడియట్ చదువుతున్న తన్నీరు మణికంఠ, సయ్యద్ అమీర్ అహమ్మద్ కళాశాల ఫీజుగా ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున రూ.30 వేలను విద్యార్థులకు అందజేశారు. తాను పేదరికం నుండి వచ్చానని, ఏటా విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తుంటానని రామాంజనేయులు అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆ కాంక్షించారు. దాత రామాంజనేయులును రోటరీ క్లబ్ సభ్యులు, కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళిసుధాకరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, సుబ్బారావు, రామాకోటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధితకుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఇటీవల అగ్నిప్రమాదంలో మేదరమెట్లలోని పులివాసుకు సంబంధించిన పుస్తకాలు, ఫ్యాన్సీ దుకాణంలో అగ్నిప్రమాదం జరగ్గా, బాధిత కుటుంబాన్ని మంత్రి రవికుమార్ పరామర్శించారు. తన సొంత నిధులు రూ2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. తిరిగి వ్యాపారంలో నిలదొక్కుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాసరావు, చావా రాజేష్, రవవరపు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు యంత్రపరికరాలు

అద్దంకి : ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని పార్వతీపురంలో పార్వతీ కిసాన్‌డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్‌కు 80 శాతం రాయితీతో డ్రోన్‌ను మంత్రి రవికుమార్ అందజేశారు. అద్దంకి మండలానికి మూడు డ్రోన్లు మంజూరు అయ్యాయన్నారు. ఆధునికి వ్యవసాయ యాంత్రీకరణతో సాగు సులభం అవుతుందన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు కోట శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూముల సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇనాం భూముల సమస్య పరిష్కారానికి సీసీఎల్ఏ (చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) కమిషనర్ జి.జయలక్ష్మితో మంగళవారం ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ బాపట్ల జిల్లా, పర్చూరు నియోజకవర్గంలో ఎనిమిది దశాబ్దాలుగా రైతులు సాగుచేసుకుంటున్న ఇనాం భూములకు పట్టాలులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా నియోజకవర్గంలోని మార్టూరు మండలం లక్కవరం, జంగమహేశ్వపురం, పర్చూరు మండలం ఏదుబాడు, చెన్నుంబొట్ల అగ్రహారం గ్రామాల్లో ఈ భూములు ఉన్నాయన్నారు. రైతులు 80 ఏళ్లగా ఇనాం, ఎస్టేట్ భూములను సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. సన్న, చిన్నకారు రైతులు సాగుచేసుకుంటున్న ఈ భూములకు ఎలాంటి పట్టాలు కానీ పాసు పుస్తకాలు కానీ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ల దృష్టికి తీసుకువెళ్లానని వివరిం చారు. ఇప్పటికే రెవెన్యూ మంత్రి కీలక ఆదేశాలు కూడా జారీ చేశారన్నారు. ప్రభుత్వ పరంగా అందించే ఎటువంటి సంక్షేమ పథకాలు, రాయితీ పథకాలు అందక తీవ్రఅవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే సమస్య పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యను త్వరిత గతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి : ఎమ్మెల్యే



గోపాలకృష్ణయ్యకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, చీరాల - పేరాల ఉద్యమకారులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జ్ఞాపకాలు భద్రపరచడంలో ప్రత్యేక దృష్టిసారిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం నియోజకవర్గంలో ఘనంగా దుగ్గిరాల వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో ప్రముఖులు, వివిధ సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు దుగ్గిరాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. అలాగే బహుముఖ ప్రజ్ఞశాలిగా వ్యవహరించి ప్రజలకు కల్పించిన ఆదరణను కొనియాడారు. అలాగే రామనగర్‌లో దుగ్గిరాల నివసించిన ప్రదేశంలో లైబ్రరీ ఏర్పాట్లుకు స్థలాన్ని గుర్తించి చదును చేయించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దుగ్గిరాల అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి

చీరాల : ప్రతి ఇంటికి తాగు నీటి కొళాయిను అందించేందుకు అన్ని విధాలుగా కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. చీరాల మండల పరిధిలోని కొత్తపాలేనికి చెందిన దండు బాటలో జలజీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న తాగునీటి పైపల్‌లైన్ పనులను పరిశీలించారు. పనులు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వేగవంతంగా జరగాలని సూచించారు. అలాగే పట్టణంలో ఎమ్మెల్యే, సినీ నటులు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

వేములపాటిని కలిసిన జనసేన నాయకులు



అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ను పర్చూరు నియోజకవర్గ పరిధిలోని జనసేన పార్టీ మండల అధ్యక్షులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని టిడ్కో కార్యాలయంలో ఆయనను కలిసి పర్చూరు నియోజకవర్గంలో జనసైనికులు ఎదురుకొంటున్న సమస్యలపై వినతిపత్రాన్ని జనసేన మండల నాయకులు అందజేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ చినగంజాం, మార్టూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు, మందపాటి కిషోర్, సాగిరి శ్రీనివాసరావు, నారిశెట్టి ప్రవీణ్‌కుమార్, గడివిశెట్టి అయ్యప్ప, పలు మండలాల నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థినికి బంగారు పతకం

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల విద్యార్థినీ బిటెక్ పరీక్షల ఫలితాల్లో బంగారు పతకం సాధించినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన పరీక్షల్లో ఎస్‌కె ఫర్హాన ఉత్తమంగా రాణించి పతకం సాధించినట్లు తెలిపారు.

బండరాయిపడి కార్మికుడి మృతి

మార్టూరు, జూన్10 (ఆంధ్రజ్యోతి): మార్టూరు నుంచి నాగరాజుపల్లి వెళ్లే రోడ్డులోని ఓ గ్రానైట్ పరిశ్రమలో గ్రానైట్ బండరాయిని ఎక్స్‌కవేటర్ లేపే సమయంలో ఇనుప చైను తెగిపోవడంతో ఒడిషా రాష్ట్రానికి చెందిన ఒక కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. ఈ ఘటనలో మరో ఇద్దరు కార్మికులు కూడా గాయపడినట్లు తెలిసింది. అయితే ఈ ఘటన జరగగానే గ్రానైట్ పరిశ్రమను లీజుకు నడుపుతున్న వ్యక్తులు మృతిచెందిన కార్మికుని మృతదేహాన్ని, గాయపడిన ఇద్దరు వ్యక్తులను కారులో గుంటూరుకు తీసుకువెళ్లినట్లు తెలిసింది. గుంటూరులో చనిపోయిన కార్మికుని సొంతరాష్ట్రానికి మృతదేహాన్ని పంపించేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అంతేగాకుండా గాయపడిన ఇద్దరు కార్మికులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ గ్రానైట్ పరిశ్రమను మార్టూరులో సంపత్‌నగర్‌కు చెందిన ఇద్దరు యువకులు లీజుకు తీసుకున్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై పోలీసులను సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

రోడ్డుపై విరిగిన లారీ గేరు రాడ్డు



విరిగిన గేర్ రాడ్డు

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి-216లో లోడు లారీ గేరు రాడ్డు అకస్మాత్తుగా విరిగి రోడ్డుపై పడింది. ఈ ఘటన మంగళవారం రాత్రి మన్నవ అపార్ట్‌మెంట్ సమీపంలో చోటుచేసుకుంది. లోడుతో బాపట్ల వైపు నుండి ఒంగోలు వైపు వెళుతున్న లారీ గేరు రాడ్డు విరగడంతో పెద్ద శబ్దంతో లారీ అర్ధాంతరంగా నిలిచింది. అయితే ఆ సమయంలో ఆ సమీపంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది, అయితే రాత్రంతా శ్రమించి లారీ డ్రైవర్, కండక్టర్ మరమ్మతుల అనంతరం లారీను కదిలించారు.

డ్రమ్ములు ఢీ కొని ఇరువురికి తీవ్ర గాయాలు

తోటవారిపాలెం(చీరాల), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన డ్రమ్ములు కారణంగా ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు ఈ ఘటన మంగళవారం రాత్రి జాతీయ రహదారి వెంబడి తోటవారి పాలెం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం బాపట్ల మండలం పాండురంగాపురానికి చెందిన ఓ వ్యక్తి, మహిళ ద్విచక్ర వాహనంపై చీరాల వైపు నుంచి బాపట్ల వైపు వెళుతున్నారు. అంబేడ్కర్ నగర్ వద్ద ఉంచిన డ్రమ్ములు కనపడక వేగంగా ఢీ కొట్టారు. ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 సహాయంతో బాపట్ల వైద్యశాలకు తరలించారు.

ఎస్ఎంవీటీ సూపర్ ఫాస్ట్‌లో పొగలు

- ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది
- గంటపాటు చీరాల సమీపంలో నిలిపివేత
- ప్రమాదం లేదని తేల్చడంతో కదిలిన రైలు



రైలు దిగి ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎంవీటీ రైలులో పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బాపట్ల జిల్లా చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు గంటపాటు రైలు నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే.. ముజఫర్‌పూర్ నుంచి బెంగళూరు వెళుతున్న 15228 ఎస్ఎంవీటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈపూరుపాలెం రైలు గేటు సమీపంలోకి రాగానే గార్డు నుంచి ముందు వైపునకు సుమారు ఐదో బోగీ (ఎస్2) వద్ద పొగలు వచ్చాయి. దీంతో రైలులోని ప్రయాణికులు భయాందోళనతో చైన్ లాగారు. అయితే రైలు పేరాల గేటు సమీపానికి రాగానే నిలిచిపోయింది. ఆ సమయంలో చైన్ లాగిన వ్యక్తి రైలు దిగి వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే రైల్వే అధికారులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతా పరిశీలించిన ఎటువంటి ప్రమాదం లేదని తేల్చడంతో రైలు బయలుదేరింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

దివ్యాంగులకు రాయితీపై రైల్వే పాసులు



దివ్యాంగులకు రైల్వేపాసులు అందజేస్తున్న ఏపీఎం, సీసీలు

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : చినగంజాం వెలుగు కార్యాలయంలో మండల దివ్యాంగుల సమాఖ్య కార్యదర్శి వడ్లమేడి వేణు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో నలుగురు దివ్యాంగులకు రాయితీపై రైల్వే పాసులు అందజేశారు. మండల దివ్యాంగుల సమాఖ్యలోని సభ్యులైన హనుమంతరావు, వెంకటరావు, అంకిరెడ్డి, వెంకటేశ్వర్లులకు రైల్లో ప్రయాణించేందుకు 75 శాతం రాయితీపై పాసులను అందజేసినట్లు ఏపీఎం జి.పెదసుబ్బారావు తెలిపారు. వారికి సెక్యూరిటీగా ఉన్న వ్యక్తికి కూడా 75 శాతం రాయితీ ఇస్తారన్నారు. మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మేంద్ర దివ్యాంగ గ్రూపునకు శ్రీనిధి ద్వారా లక్ష రూపాయిలు రుణం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల దివ్యాంగుల సమాఖ్య కోశాధికారి హనుమంతరావు, సభ్యులు వెంకటరావు, కే.సురేష్, చిట్టిబాబు, సీసీలు కే.వెంకటస్వామి, మాధవి, శ్రీలక్ష్మి, అకౌంటెంట్ పద్మావతిలు పాల్గొన్నారు.

కల్వర్ట్ నిర్మాణానికి భూమిపూజ



కల్వర్ట్‌కు భూమిపూజ చేస్తున్న నాయకులు

ఇంకొల్లు, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులోని బస్టాండు నుంచి కడవకుదురురోడ్డుకు వెళ్లే మార్గంలో మురుగుకాల్వపై నూతన కల్వర్టు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న కల్వర్ట్ శిధిలావస్థకు చేరి కుంగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో మండల పరిషత్ నిధులు రూ.9.5లక్షలు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. ఇటు వెళ్లే ట్రాఫిక్‌ను సినిమాహాల్ కూడలి మీదగా మళ్లించారు. భూమి పూజా కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి సుబ్బారెడ్డి, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, కరి శ్రీనివాసరావు, రఫీ, జరుగుల శ్రీను, మాబాషా, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొలిమేర సరిహద్దు పరిశీలన



పొలిమేర సరిహద్దును పరిశీలిస్తున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

పంగులూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని చందలూరు - ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామాల మధ్య పొలిమేర సరిహద్దు ప్రాంతాన్ని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు మంగళవారం పరిశీలించారు. తమ సరిహద్దు ప్రాంతంలో కొణికి గ్రామానికి చెందిన కొందరు రైతులు మట్టితో కట్టలు వేశారని, దీని మూలంగా తమ పంటపొలాలోని వర్షపు నీరు బయటకు పోవడం లేదని చందలూరు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సంబంధిత రైతులకు స్థానిక తహసీల్దార్ సింగారావు కొద్దిరోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆర్డీవో చంద్రశేఖరనాయుడు సంబందిత రైతులు, రెవెన్యూ అధికారులతో కలసి వివాదాస్పద ప్రాంతాన్ని పరిశీలించి సమస్యపై రైతులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి ఇరిగేషన్ అధికారులు చొరవ చూపాలని, ఎగువ పొలాలలో వర్షపు నీరు నిలువకుండా తగిన విధంగా తూములు ఏర్పాటు చేసి ఇరు గ్రామాల రైతులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, సర్వేయర్ శ్రీనివాసరావు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న నాయకులు

పంగులూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన నిదానపు కోటినాగులు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికాగా వైద్య చికిత్స నిమిత్తం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వం ద్వారా ఆరు లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయించారు. మంజూరైన రూ.6 లక్షలను ఎల్‌వోసీని స్థానిక టీడీపీ నాయకులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, గరిమిడి జగన్‌లు మంగళవారం కోటినాగులు తండ్రి అచ్యుతరావుకు అందజేశారు. ఒంగోలు కిమ్స్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న కోటినాగులుకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కిమ్స్ యాజమాన్యంతో మాట్లాడటంతో పాటు రూ.6 లక్షలు మంజూరు చేయించారు. వైద్యచికిత్సకు తోడ్పాటునందించిన మంత్రి రవికుమార్‌కు అచ్యుతరావు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

అద్దంకి, జూన్10(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్ లో మంగళవారం రా త్రి వాహనచోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు.


నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 3 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

బదిలీల్లో మాయలు

జీవోకు విరుద్ధంగా పలు శాఖల్లో స్థానచలనాలు

నెల్లూరులోనే అటు, ఇటు తిప్పి జిమ్మిక్కులు



ఉద్యోగుల బదిలీల్లో అనేక చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. బలం ఉన్న వారికి ఒక రకంగానూ, బలహీనులకు మరోరకంగానూ స్థానచలనాలు జరుగుతున్నాయి. సాధారణ బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను స్పష్టంగా జీవోలో తెలియజేసినా కొన్ని శాఖల్లో వాటిని అతిక్రమించారు. ఒకే ఆఫీసు ప్రాంగణంలో అటు నుంచి ఇటు బదిలీ చేసి జిమ్మిక్కులు చేసిన వ్యవహారాలూ వెలుగులోకి వస్తున్నాయి. ఇక ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకూ ప్రాధాన్యత ఇచ్చారు.

నెల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఒకేచోట సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికీ బదిలీ తప్పనిసరి. అలానే ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న వారు కూడా రిక్వెస్ట్ మీద బదిలీ కోరుకోవచ్చు. అయితే బదిలీ అనేది ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు జరగాలని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. స్టేషన్ అంటే ఒక సిటీ లేదా పట్టణం లేదా గ్రామం అని అర్థమని కూడా వివరణ ఇచ్చారు. ఒక స్టేషన్‌లో ఏ కేడర్‌లోనైనా ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు, అధికారులను మరో స్టేషన్‌కు పంపాలి. కానీ కొన్ని శాఖల్లో స్టేషన్ అనే పదానికి అర్థం మార్చారు. ఉదాహరణకు ఇరిగేషన్ శాఖలోని సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను సెంట్రల్ డివిజన్, డ్రైనేజీ డివిజన్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న వారిని సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ కార్యాలయాన్నీ ఒకే ప్రాంగణంలో ఉంటాయి. అలానే రెవెన్యూ శాఖలో కూడా ఇదే తంతు జరిగింది. నెల్లూరు నగరంలో పనిచేసే ఉద్యోగులు కొందరిని అటు ఇటూ మార్చారు తప్ప నెల్లూరు దాటి పంపలేదు. పలు శాఖల్లో కూడా అధికారులు ఈ విధానాన్నే అనుసరించారు. కొందరు ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. కాగా ఆర్‌అండ్‌బీలో ఐదేళ్ల సర్వీసు నిండిన వారిని బదిలీ చేయలేదని కొందరు ఉద్యోగులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

● 'రెవెన్యూ'లో భారీగా...

సాధారణ బదిలీలకు ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారంతో ముగిసింది. దీంతో రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. తహసీల్దార్ స్థాయి నుంచి వీఆర్వో స్థాయి వరకూ వందల మందికి స్థానచలనం కలిగింది. వీరిలో అనేక మంది ఎమ్మెల్యేల వద్ద సిఫారసు లేఖలు తెచ్చుకోవడం గమనార్హం. ఈ బదిలీల్లో గతేడాది సెప్టెంబరులో బదిలీ అయిన వారు కూడా ఉండడం విశేషం. మొత్తం 22 మంది తహసీల్దార్లు, మరో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లకు అడహక్ తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి కల్పించి బదిలీ చేశారు. వీరితోపాటు 36 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 11 మంది రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, 42 మంది సీనియర్ అసిస్టెంట్లు, 19 మంది జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు.

తహసీల్దార్ల బదిలీ వివరాలు...

తహసీల్దార్	ప్రస్తుతం	బదిలీ
కే అనీల్‌కుమార్	నెల్లూరు (డీఎస్వో)	ఏఎస్‌పేట
సీహెచ్ సుబ్బయ్య	మనుబోలు	కోవూరు
ఏ నిర్మలానందబాబా	కోవూరు	నెల్లూరు (డీఎస్వో)
ఎం సుభద్ర	ఉదయగిరి	సైదాపురం
ఈ రమాదేవి	సైదాపురం	మనుబోలు
ఎం సురేష్‌బాబు	బోగోలు	కొండాపురం
ఎస్ శ్రీనివాసులురెడ్డి	ఏపీ మారిటైమ్ బోర్డు	బోగోలు (తహసీల్దారు)
జీ రాఘవేంద్రరావు	ఏపీ మారిటైమ్ బోర్డు	తహసీల్దార్ (కలెక్టరేట్)
ఎం కోటేశ్వరరావు	కొండాపురం	లింగసముద్రం
ఎస్ సీతామహాలక్ష్మి	లింగసముద్రం	కందుకూరు (డీఏవో)
ఎం నిరంజన్	ఆత్మకూరు (డీఏవో)	నెల్లూరు (ఐటీడీఏ)
ఏ లక్ష్మీనారాయణ	అల్లూరు	ఏపీ మారిటైమ్‌బోర్డు
ఎం పద్మజ	సెలవు	తహసీల్దార్ (కలెక్టరేట్)
టీవీఎం కృష్ణప్రసాద్	ఇందుకూరుపేట	నెల్లూరు రూరల్
బీ పద్మావతి	తిరుపతి కలెక్టరేట్	టీపీ గూడూరు (తహసీల్దారు)
బీ జయవర్ధన్	ప్రకాశం కలెక్టరేట్	అనంతసాగరం (తహసీల్దారు)
పీ పద్మజా కుమారి	తహసీల్దార్ (కలెక్టరేట్)	ఆత్మకూరు
జీ స్వర్ణ	గుడ్లూరు	డీఏవో (ఆత్మకూరు)
ఎం నయీమ్ అహ్మద్	ప్రకాశం కలెక్టరేట్	వలేటివారిపాలెం
వీ సుధీర్	ఆత్మకూరు	తహసీల్దార్ (కలెక్టరేట్)
సయ్యద్ ఇక్బాల్	డీఏవో, కందుకూరు	తిరుపతి కలెక్టరేట్
ఎస్ఎండీ హుస్సేన్	తహసీల్దార్, కలెక్టరేట్	ప్రకాశం కలెక్టరేట్

నెల్లూరు ఆర్టీవోగా మదనీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు ఆర్టీవోగా ఉన్న వై శ్రీచందనను మార్కాపురం ఆర్టీవోగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో జంగారెడ్డిగూడెంలో ఆర్టీవోగా ఉన్న మదనీని నియమించారు. ఆయనకు గతంలో నెల్లూరు డీటీసీ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. కాగా, జిల్లాలో పలువురు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఎంవీఐ, ఏఎంవీఐలను బదిలీ చేస్తూ రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు డీటీసీలో ఎంవీఐగా ఉన్న అనిల్‌కుమార్, ఏఎంవీఐగా ఉన్న సంధ్య, సీనియర్ అసిస్టెంట్ సాయిరాంను నెల్లూరు డీటీసీకి బదిలీ చేశారు. ప్రకాశం డీటీసీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సునీతను కూడా నెల్లూరు డీటీసీకి మార్చారు. నెల్లూరు డీటీసీలో విధులు నిర్వహిస్తున్న నాగవల్లీశ్వరిని కావలి ఆర్టీవో కార్యాలయానికి, సీనియర్ అసిస్టెంట్లు ఎస్‌కే షాహిన్‌ను ప్రకాశం డీటీసీకి, సీహెచ్ పద్మవతిని తెనాలి ఆర్టీవో కార్యాల యానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. కందుకూరు ఆర్టీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న కే లావణ్యను ప్రకాశం డీటీసీకి బదిలీ చేశారు.

నెల్లూరు ఏఎంసీ కార్యదర్శిగా శ్రీనివాసులు

● కావలికి రామాంజనేయులు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా కావలి ఏఎంసీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఎం శ్రీనివాసులు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఆయన్ను బదిలీ చేసింది. అయితే ఆయన ప్రస్తుతం కావలితో పాటు నెల్లూరుకు ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, పెనుగొండ ఏఎంసీ



కార్యదర్శిగా పనిచేస్తున్న టీసీ రామాంజనేయులు కావలి ఏఎంసీకి బదిలీ అయ్యారు. ఈయన గతంలో నెల్లూరు ఏఎంసీ కార్యదర్శిగా పని చేశారు. అదేవిధంగా కోవూరు ఏఎంసీలో ఓడీగా పనిచేస్తున్న టీ శ్రీనివాసులు కడపకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దుగ్గిరాల ఏఎంసీ కార్యదర్శిగా ఉన్న ఎన్ శ్రీనివాసరావును ప్రభుత్వం బదిలీ చేసింది.



కౌన్సెలింగ్ నిర్వహణపై ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

ఎస్జీటీలకు మాన్యువల్‌గానే...

● 2,543 మంది దరఖాస్తు, 1516 మందికి తప్పనిసరి స్థానచలనం

నెల్లూరు(విద్య) : సెకండరీగ్రేడ్ టీచర్లకు (ఎస్‌జీటీ) వెబ్ కౌన్సెలింగ్‌పై అపోహలు, సందేహాలు, ఆందోళనలకు తెరదించుతూ మాన్యువల్‌గానే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి నెల్లూరుజిల్లాలో దరఖాస్తు చేసుకున్న 2,543 మంది ఎస్‌జీటీలకు మాన్యువల్ విధానంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. బదిలీల ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆందోళనలు చేస్తున్నా విద్యాశాఖ పట్టించుకోకుండా వారం రోజుల నుంచే వెబ్ ఆప్షన్లను ఇచ్చే ప్రక్రియను ప్రారంభించింది. దీంతో అప్పటికే వెబ్ ఆప్షన్‌లు ఇచ్చిన ప్రభుత్వ, ఉర్దూ పాఠశాలల ఎస్‌జీటీలకు సోమవారం నుంచే బదిలీ ఉత్తర్వులు జారీ ప్రారంభమైంది. వీరితో పాటు జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ యాజమాన్యాల ఎస్‌జీటీలు కూడా వెబ్ ఆప్షన్‌లు ప్రారంభం కాగా ఇదే ప్రక్రియతో కౌన్సెలింగ్ పూర్తవుతుందని కూడా అధికారులు తెలిపారు. అయితే, మంగళవారం ఉదయం మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్ణయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడంతో విడుదల కావాల్సిన ఆర్డర్లన్నీ నిలిచిపోయాయి. జిల్లాలో 2543 మంది ఎస్‌జీటీలు ఉండగా వీరిలో 1516 మంది తప్పనిసరిగా బదిలీ కానున్నారు. వీరందరికీ మాన్యువల్ కౌన్సెలింగ్ పూర్తి చేయాలంటే రోజుకు సగటున 300 నుంచి 400 మంది వరకు మాత్రమే నిర్వహించడం సాధ్యమవుతుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బదిలీల ప్రక్రియలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల అన్ని కేడర్ సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయులకు నూతన బదిలీ స్థానాలను వెబ్ ఆప్షన్ పద్ధతిలోనే కేటాయించారు. వీరందరికీ నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో వారు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరిపోయారు. ఎస్‌జీటీలకు మాత్రం మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ జరగాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ ఎన్నిరోజులు పడుతుందోనన్న ఆందోళన విద్యాశాఖ సిబ్బందిలో నెలకొంది. మరోవైపు ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో ఆ సమయానికి కౌన్సెలింగ్ పూర్తి చేస్తారా లేదా అన్నది వేచి చూడాలి.

ఆర్టీసీ డిపో మేనేజర్లు...

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలో ముగ్గురు డిపో మేనేజర్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు రెండవ డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్‌ను ఆత్మకూరుకు, ఆత్మకూరు డిపో మేనేజర్ కరిమున్నీషాను నెల్లూరు 2వ డిపోకు బదిలీ అయ్యారు. కావలి డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను కందకూరుకు బదిలీ చేయగా కావలికి ఎవరినీ కేటాయించకపోవడంతో కందుకూరు డిపో మేనేజర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

జిల్లా పరిషత్, పంచాయతీ శాఖల్లో 108 మంది

నెల్లూరు, (జడ్పీ) : జిల్లా పరిషత్, పంచాయతీ శాఖలలో బదిలీల ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాల ప్రకారం జిల్లా పరిషత్‌లో 65 మంది, పంచాయతీ శాఖలో 43 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను ఉన్నతాధికారులు మంగళవారం జారీ చేశారు.



● జడ్పీలో స్వల్ప వివాదం

బదిలీల ప్రక్రియ పంచాయతీ శాఖలో ప్రశాంతంగా ముగిసినా జిల్లా పరిషత్ స్వల్ప వివాదానికి దారి తీసింది. జిల్లా పరిషత్‌లో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించినా ఐదేళ్ల పూర్తి చేసుకున్న వారికి ఎటువంటి భేదాలు రాలేదు. జీరో సర్వీస్ వారికి కూడా అవకాశం ఉంటే బదిలీలు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటంతోనే కొంత గందరగోళం నెలకొంది. అటెండర్ల బదిలీల్లో పారదర్శకత లేదని ఉద్యోగ సంఘాలలోని ఓ వర్గం పేర్కొంది. అయితే ఐదారు నెలల క్రితమే జడ్పీ కార్యాలయం నుంచి బదిలీపై వెళ్లిన వారిని తిరిగి ఇక్కడికే బదిలీ చేయమని ఒత్తిడి చేయడం ఎంతవరకు సబబని, ఏళ్ల తరబడి దూరంగా ఉన్న వారికి అవకాశం ఇవ్వకపోతే ఎలా అంటూ మరోవర్గం వాదించటంతో కొంత గందగోళం నెలకొన్నా బదిలీల ప్రక్రియ మాత్రం ముగిసిపోయింది.

ఇదేం బాదుడు సారూ!

● రూ.13 బిల్లుకు రూ.421 అదనం

● లబోదిబోమంటున్న విద్యుత్ వినియోగదారులు

నెల్లూరు (జడ్పీ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లులో అసలు కంటే కొసరే ఎక్కువగా ఉంటోంది. కరెంటు వాడకం లేకున్నా ప్రతినెలా అదనపు చార్జీలు భారీగా చెల్లించాల్సి వస్తోంది. దీంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా కరెంటు వాడకాన్ని బట్టి బిల్లులు ఉండాలి తప్ప, వాడకంతో సంబంధం లేకుండా ఇష్టానుసారం అదనపు బిల్లులు వసూళ్ళు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ఎన్టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన ఓ ఖాళీ ఇంటికి ఈ నెల విద్యుత్ బిల్లును రీడర్ అందజేశాడు. ఆ బిల్లులో కేవలం 7 యూనిట్లు మాత్రమే వాడినట్లు చూపి, చార్జీని రూ.13.30 వేశారు. అయితే, అదనపు చార్జీల కింద రూ.421 కలిపి 434 బిల్లు ఇవ్వడం వినియోగదారుడిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒక్క బిల్లుకు పది రకాల అదనపు చార్జీలను ఒకేసారి విధిస్తున్నారు. పేదలు నివాసముంటున్న కాలనీల్లో సైతం ఇలా భారీగా అదనపు చార్జీలు విధించడంపై వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 7 యూనిట్ల వాడకం కలిగిన సదరు బిల్లుకు అసలు చార్జీ రూ.13.30 వేయగా, ఫిక్సిడ్ చార్జీ రూ.10, కస్టమర్ చార్జీ రూ.25, డ్యూటీ 42 పైసలు, ఎఫ్‌పీపీసీఏ (2022)కు రూ.168.28, ఎఫ్‌పీపీసీఏ (2023)కు రూ.138.07 పైసలు, మళ్ళీ ఎఫ్‌పీపీసీఏ (2025) రూ.60.80, వడ్డీ కింద 12 పైసలు, ట్రూఅప్ చార్జీలు రూ.28.71, ఎనర్జీ లాస్ 28 పైసలు ఇలా మొత్తం రూ.434 బిల్లులో చూపారు. అసలు చార్జీతోపాటు అదనపు చార్జీలుంటే ఒకటో, రెండో ఉండాలి కానీ, ఒకే బిల్లుకు పది రకాల అదనపు చార్జీలు వేయడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పాలకులు స్పందించి, అదనపు చార్జీల భారం నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.





కందుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

మహిళాగ్రహం

వైఎస్ జగన్ రోత పత్రిక, మీడియాపై నారీలోకం కన్నెర్ర జేసింది. అమరావతి మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన వారిని, సాక్షి మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లావ్యాప్తం గా ఎన్డీఏ కూటమి మహిళా నేతలు ఆందోళనలు చేశారు. కావలి, కందుకూరు, వింజమూరు, కోవూరులలో భారీ ర్యాలీలు నిర్వహించారు.

- వివరాలు 8లో..

13న పీసీసీ చీఫ్ షర్మిల రాక

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 13వ తేదీన నెల్లూరుకు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. నగరంలోని ఇందిరాభవన్‌లో జరిగే సమావేశానికి రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా, మండల అనుబంధ సంఘం అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి రంగనాథుడి వసంతోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం నుంచి వసంతోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు సాయంత్రం స్వామివారికి నవ కలశ స్నపన తిరుమంజనం, విశేష పుష్పాలంకారం, దివ్య ప్రబంధ గోష్ఠి, ఆస్థాన సేవ, శాత్తుమురై జరుగుతాయని తెలిపారు.

సోమశిల అభివృద్ధి పనులకు ఊతం

● ప్రాజెక్టు వద్దకు చేరుకున్న సామగ్రి

● క్రస్ట్‌గేట్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

అనంతసాగరం జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నమయ్య ప్రాజెక్టుకు జరిగిన నష్టం రాష్ట్రంలోని మరే ప్రాజెక్టుకు జరగకూడదన్న సంకల్పంతో రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సోమశిల జలాశయం అభివృద్ధిపై దృష్టి సారించి లోపాలను అధ్యయనం చేసి అత్యవసర పనుల గుర్తించి ప్రాజెక్టుకు ముప్పు జరగకమందే సమగ్రంగా పనులు పూర్తిచేసే విధంగా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటైన అనతికాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమశిల డ్యాంను సందర్శించారు. అనంతరం నిపుణులు, జలవనరుల శాఖ విశ్రాంత ఇంజనీరు, సలహాదారు కన్నయ్యనాయుడును పంపించి పూర్తిసమాచారం తెలుసుకొన్నారు. ఈ క్రమంలో సోమశిల అభివృద్ధికి నిధుల విడుదలకు అడుగులు పడ్డాయి. డ్యాంకు మొత్తం 12 గేట్లు ఉండగా అందులో సగం గేట్ల పరిస్థితి దయనీయంగా ఉన్నాయి. భారీ వరద వస్తే కిందకు నీరు వదల్లేని పరిస్థితి కారణంగా ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు. 11, 12 గేట్ల రోప్‌లు తుప్పు పట్టి తెగిపోయేస్థితిలో ఉండగా ఇప్పటికే అండర్‌వాటర్ వర్కర్స్ టీంను పిలిపించి నీటిలోపల గేట్ల పటిష్టతను అధ్యయనం చేసి ఫొటోలు సేకరించారు. ఆ బృందంతోనే కొంతమేరకు పనులు చేపట్టారు. తాత్కాలిక చర్యలు కాకుండా ప్రతిపాదనల మేరకు కొత్త రోప్‌లు ఇటీవల ప్రాజెక్టు వద్దకు చేరాయి. క్రస్ట్‌గేట్ల అభివృద్ధికి రూ.2.50 కోట్లు ఖర్చు చేస్తుండగా, ఆర్‌హెచ్‌ఆర్ అభివృద్ధి కోసం రూ.5.25 కోట్లు మంజూరు చేశారు. టెండర్ల దశ పూర్తికాగానే పనులు పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం జలాశయం నుంచి రెండవ పంటకు నీరు ఇస్తున్నారు. మరి కొంత మేర నీటిమట్టం తగ్గితే పనులు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి.



జలాశయం వద్దకు చేరుకున్న కొత్తరోప్‌లు

దూర విద్య.. దగ్గరవుతోంది!

ఏలూరు కేంద్రంగా అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ

త్వరలోనే అడ్మిషన్ల ప్రక్రియ

ఏపీలో బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఉద్యోగులకు, యువతకు ఊరట లభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా ఇప్పటివరకు కొనసాగిన ఈ వర్సిటీ రాష్ట్ర విభజన పదేళ్ల కాలం పూర్తవడంతో ఈ ఏడాది జనవరి నుంచి ఆ యూనివర్సిటీ పరిధిలోని ఏపీ కేంద్రాలన్నీ మూసివేశారు. సిబ్బంది జీతాలను నిలిపివేయడంతో పాటు విద్యార్థుల అడ్మిషన్లను కూడా నిలిపివేశారు. దీంతో జిల్లాలో వివిధ కోర్సుల్లో చదువుకుంటున్న పదివేల మందికిపైగా విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. నాటి నుంచి ఎంతో మంది చేసిన విజ్ఞప్తులు, పోరాటాలతో ఎట్టకేలకు రాష్ట్రంలో వర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నెల్లూరు (విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఏపీ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని 1992లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా పేరు మార్పు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఏపీలో అడ్మిషన్లను నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఏపీలోని అభ్యాసక సహాయ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, పార్ట్‌టైమ్ ఉద్యోగుల జీతాలు కూడా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అలాగే అంబేడ్కర్ వర్సిటీలో అడ్మిషన్లు తీసుకుని ఇంకా కోర్సులు పూర్తి చేయని వారు రాష్ట్రంలో 2 లక్షల మంది ఉండగా జిల్లాలో 10వేల మందికిపైగా ఉన్నారు. 2023-24లో డిగ్రీ మొదటి సంవత్సరంలో 12వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, రాష్ట్రంలో మొత్తం అన్ని కోర్సులు కలిపి 35 వేల మంది విశ్వవిద్యాలయంలో చేరారు. ఎస్‌సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు 89శాతం అడ్మిషన్ తీసుకున్నారు. మొత్తం విద్యార్థుల్లో 48శాతం మహిళలు చదువుకుంటుండగా, ఏపీ అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్లు, ఫీజుల రూపంలో రూ.21 కోట్లను తెలంగాణా ప్రభుత్వానికి చెల్లించేవారు. వీరు తిరిగి ఏపీలో పనిచేసే సిబ్బందికి రూ.4కోట్లు చెల్లించేవారు. రాష్ట్ర విభజన అనంతరం అనేక సవాళ్లను ఎదుర్కొనడంతో పాటు గడిచిన మూడేళ్ల నుంచి అధ్యయన కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు కూడా ఆపివేశారు. అందరూ కలిసి పోరాడగా కొంతవరకు చెల్లించి మిగిలినవి పెండింగ్‌లో ఉంచారు. దీనిపై జిల్లాలోని అధ్యయన కేంద్రాల నిర్వాహకులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆందోళనలు సైతం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుకు కృషి చేయాలని జిల్లా అధ్యయన కేంద్రం సిబ్బంది మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును కోరుతూ విజ్ఞప్తి కూడా చేశారు. వెంకయ్య కూడా ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వర్సిటీ సిబ్బంది తెలిపారు.

ఫలించిన పోరాటాలు

రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో తీర్మానం చేసి జీఓను కూడా విడుదల చేసింది. ఈ క్యాంపస్ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచే వివిధ కోర్సులకు నోటిఫికేషన్లు జారీ చేస్తున్నట్లు ఓవర్సిటీ వ్యవహారాల ప్రతినిధులు ప్రకటించారు. ఇప్పటికే వర్సిటీ పరిధిలోని విద్యార్థులు, సిబ్బందికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఏలూరు కేంద్రంగా వర్సిటీ క్యాంపస్ ఉండబోతోందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల స్టడీసెంటర్లన్నీ దీని పరిధిలోకి రానున్నాయని చెబుతున్నారు. వర్సిటీకే నేరుగా విద్యార్థుల ఫీజుల ద్వారా ఆదాయ వనరులు సమకూరనుండటంతో సిబ్బంది జీతాలకు కూడా ఎలాంటి ఇబ్బందులు కలగవు. జిల్లాలో ఇప్పటికే ఈ వర్సిటీ ద్వారా పదివేలమందికి పైగా విద్యనభ్యసిస్తుండగా, అడ్మిషన్లు ప్రారంభమైతే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని స్టడీ సెంటర్ నిర్వాహకులు తెలిపారు.



నెల్లూరులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది (ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100): 550	

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

కొండాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంపై మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఆనందరావు పాల్గొని మాట్లాడుతూ నూతన మెనూను తెలియచేసి ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకే నన్నబియ్యం నేరుగా సరఫరా చేస్తుందన్నారు. మండలంలో ఉన్న 62 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు.

159 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 472 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 313 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-139, ఆర్‌ఆర్-5, నీలర్-8, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 159 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.234.28గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి.ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

న్యూస్ బాక్స్

రైల్వే పీడబ్ల్యూఐ అధికారులకు సన్మానం

బిట్రగుంట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూఐ అధికారులను బిట్రగుంట పెన్షనర్ల అసోసియేషన్ వర్కింగ్ చైర్మన్ నాగసాని శ్రీనివాసులయాదవ్, సెక్రటరీ గోవిందరావులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కొన్నేళ్లుగా బిట్రగుంటలో పీడబ్ల్యూఐగా పనిచేస్తున్న కృష్ణన్ సింగరాయకొండకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో రాజమండ్రిలో పనిచేస్తున్న రాజకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిద్దరిని శాలువతో సన్మానించారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు

దగదర్తి(బిట్రగుంట), జూన్ 10(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల సచివాలయంలో ఎన్నికల కోసం నెల్లూరు జెడ్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ పీకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పరిశీలించారు. మండలంలో 600 మందికి పైగా ఎన్నికలు ఆధార్ కార్డులు లేవని తహసీల్దార్ పేర్కొన్నారు. ఐదురోజుల పాటు ఆధార్ నమోదు సెంటర్ నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తహసీల్దారు సీతామహాలక్ష్మి బదిలీ

లింగసముద్రం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారు సీతామహాలక్ష్మి కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు వచ్చాయి. ఆమె స్థానంలో కొండాపురం తహసీల్దారు ఎం కోటేశ్వరరావును నియమించారు.

ముగిసిన 'కిశోర వికాసం'

అల్లూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : అల్లూరులో గత నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా అల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కావలి ఐసీడీఎస్ సీడీపీఓ సౌజన్య, ఎంపీడీవో రఘునాథ్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచలరెడ్డి, ఏపీఎం వెంకటప్రసాద్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇండోసోల్ కోసం మామిడి తోటలను నాశనం చేయొద్దు

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ పరిశ్రమ కోసం ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ పరిధిలో దశాబ్దాలుగా పెంచుకొన్న మామిడి తోటలు, ఇతర తోటలను ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధ పడడం దుర్మార్గపు చర్య అని ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కరేడు గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం కందుకూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. కరేడు పరిధిలో ఎంతో విలువైన భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టాలని కుట్ర తప్ప ఇందులో ఏమాత్రం హేతుబద్దత లేదని విమర్శించారు. సోలార్ ఎనర్జీ ప్లాంట్‌కు ఎక్కడైనా నిరుపయోగమైన ఎందుకు ఆధికారం ఉండి పంటలు పండని భూములు కేటాయిస్తారు తప్ప ఇలా ఏటా మూడు పంటలు పండే భూములు కావని పేర్కొన్నారు. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్ పరిశ్రమలు పూర్తయితే తీరప్రాంతంలో భూముల విలువ భారీగా పెరగనున్నందువల్ల ఆ భూములపై ఇండోసోల్ కంపెనీ కన్నుపడడం అందుకు ప్రభుత్వం సహకరించడం అన్యాయం అన్నారు.

మేమింతే.. మారమంతే..!

- కమీషన్ల కోసం వ్యాపారులకు అండ
- రేటు పెంచుకో.. మామూళ్లిచ్చుకో...
- మద్యం దుకాణాల్లో తనిఖీలకు మంగళం
- మారని ఎక్సైజ్ అధికారుల తీరు



వలేటివారిపాలెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా.. మద్యం పాలసీ మారినా ఎక్సైజ్ అధికారులు తీరుమారలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మేమింతే.. మారమంతే.. అన్న చందంగా వారి వ్యవహారశైలి ఉందని, మద్యం పాలసీలో ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు కమీషన్ల కోసం మద్యం దుకాణాల యజమానులతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకొని కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రేటు పెంచుకో.. నెల మామూళ్లు ఇవ్వుకో అనే రీతిన ఎక్సైజ్ అధికారులు పనిచేస్తున్నారు ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్వార్టర్ సీసాపై రూ.10 అదనంగా రేటు పెంచుకొని నెల మామూళ్లు ఇవ్వాలని మద్యం దుకాణాల నిర్వాహకులకు సూచిస్తున్నట్లు తెలిసింది. నెల మామూళ్లు ముట్టుతుండడంతో షాపుల వద్ద సిట్టింగ్‌లు, బెల్టుషాపులు ఏర్పాటుకు పచ్చజెండా ఊపేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతిమంగా మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం విక్రయాలు జరిపిన నేపథ్యంలో మందుబాబుల నుంచి ఏ విధమైన వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రస్తుతం ఆదే పరిస్థితి నెలకొంది. ఈ విషయం పాలకులకు తెలిసినా మిన్నకుండి పోతుండడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కందుకూరు ఎక్సైజ్ డివిజన్ పరిధిలో వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, కందుకూరు మద్యం లాలు ఉన్నాయి. వలేటివారిపాలెం మండలంలో 3, లింగసముద్రం 3, గుడ్లూరు 4, ఉలవపాడు 4, కందుకూరు 4 మద్యం దుకాణాలతో పాటు 3 బార్లు ఉన్నాయి. అయితే ఒక్కో మద్యం షాపు నుంచి ప్రతి నెల ఎక్సైజ్ అధికారులు రూ.50 వేలు మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో హోదాల వారీగా బట్టి పంపకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక్కో బార్ నుంచి నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. నగటున నెలకు రూ.12 లక్షలు మద్యం దుకాణాల నిర్వాహకులు ముట్టజెబుతున్నట్లు మద్యం యజమానులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మద్యం పాలసీ నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై ఉన్నా ఆశాఖ అధికారులు ఆ బాధ్యతను విస్మరించి నెల మామూళ్లకు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

● నిబంధనలకు తూట్లు

మద్యం దుకాణాల నిర్వాహకులు మద్యం పాలసీ నిబంధనలకు తూట్లు పొడిచిన గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా, దుకాణాల పక్కనే అనధికారికంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు నుంచి ఇబ్బందులు తలెత్తడంలేదన్న దీమాతో మద్యం యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మద్యం దుకాణాల పరిధిలో ఇబ్బందిముబ్బడిగా బెల్టు షాపులు నిర్వహించుకునేందుకు నిర్వాహకులు తెరతీశారు. అంతేకాకుండా గ్రామాల్లో బెల్టుషాపులను బహిరంగ వేలం పాట పెట్టి షాపు నిర్వహిస్తున్నా పట్టించుకునేవారు లేరు.

● తనిఖీలకు మంగళం

బెల్టుషాపుల నియంత్రణ, మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్‌లను అనుమతులు లేవు. నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు నెల మామూళ్ల ఒప్పంద ం నేపథ్యంలో తనిఖీలకు మంగళం పాడారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆకస్మిక తనిఖీలు లేవు. మద్యం దుకాణాలు గాడి తప్పడానికి ఇదే కారణమని ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మామూళ్లు వసూళ్లు చేయడం లేదు

మద్యం దుకాణ యజమానుల నుంచి నెల మామూళ్ల వసూలు చేయడం లేదు. కానీ తెలియకుండా ఎవరైనా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో బెల్టు షాపుల నియంత్రణపై దృష్టి పెడతాం. మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్‌లకు అనుమతులు లేవు. తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.

- వెంకట్రావు, ఎక్సైజ్ సీఐ, కందుకూరు

రాళ్లపాడు ప్రాజెక్టు

అభివృద్ధికి చర్యలు

● వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు డీఈఈ



లింగసముద్రం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాళ్లపాడు అభివృద్ధికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ప్రాజెక్టు పాత, కొత్త స్పిల్‌వేలలో గేట్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త గేట్ల ముందు స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపుతున్నట్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలు, కాలువ రోడ్ల అభివృద్ధికి ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రాజెక్టు వంతెన రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు చెప్పారు.

ఈతరం ముఖాముఖి

? రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధికి ఏవైనా చర్యలు తీసుకున్నారా.

! ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలు, బ్రాంచి కాలువల రోడ్ల అభివృద్ధికి, ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్ల తొలగింపునకు ప్రభుత్వం రూ.75 లక్షలు మంజూరు చేసింది.

? ఈ పనులు ఎప్పుడు చేపడతారు. కొత్త, పాత స్పిల్‌వేల గేట్ల మరమ్మతులు చేపడుతున్నారా.

! ప్రస్తుతం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రిటైర్డ్ ఎస్ఈ కేవీ కృష్ణారావు, విజయవాడలోని సీతానగరం మెకానికల్ అధికారులు (ప్రాజెక్టు సెంట్రల్ డిజైనింగ్ అధికారుల బృందం గత నెల 23న ప్రాజెక్టును సందర్శించి గేట్లను పరిశీలించి, నివేదిక ఇచ్చారు. వారి సూచనల మేరకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నాం.

? కొత్త స్పిల్‌వేలో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా.

! కొత్త స్పిల్‌వే గేట్ల ఏర్పాటుకు, గేట్ల మరమ్మతులకు, వంతెన రోడ్డు మరమ్మతులకు వేరే విడిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

? చాలా ఏళ్ల నుంచి ఆపరేట్ చేయని పాత స్పిల్‌వే గేట్ల పరిస్థితి ఏంటి.

! ప్రాజెక్టు రెండవ గేటు కౌంటర్ వెయిట్ తప్ప మిగిలిన గేట్ల కౌంటర్ వెయిట్లు బాగున్నాయి. ప్రాజెక్టులో నీరు 4, 5 అడుగులకు తగ్గినప్పుడు ఆపరేట్ చేయాలి. ఇప్పుడు ఆపరేట్ చేస్తే నీరు వృథాగా పోతుంది.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

గుడ్లూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు ఎస్సీ కాలనీ, గుండ్ల గిరిజన కాలనీ, ఎమ్మెస్సార్ గిరిజనకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు అస్తవ్యస్తంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా గుడ్లూరు ఎస్సీ కాలనీలో తీగలు ఇళ్లమీదుగా పోతుండడంతో అవి తెగి ఎక్కడ ఇళ్లపై పడతాయేనని భయాందోళన చెందుతున్నారు. అలాగే ఎమ్మెస్సార్ గిరిజన కాలనీల్లో సైతం విద్యుత్ స్తంభాలు లేక కర్రలకు కరెంటు లైను బిగించుకొని ఇబ్బంది పడుతున్నామని, రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు కూడా వెలగకపోవడంతో విషసర్పాల బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. అలాగే గుడ్లూరు - పూరేటిపల్లి రోడ్డులో శివాలయం దగ్గర ఒక విద్యుత్ స్తంభం నెర్రెలు కొట్టి విరిగి కింద పడేందుకు సిద్ధంగా ఉంది, వర్షం పడే సమయంలో తరచుగా మంటలు చెలరేగుతున్నాయని వాపోతున్నారు. ఇంతో ఈ ప్రాంత రహదారిపై ప్రయాణించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై అనేక సార్లు విద్యుత్ అధికారులకు తెలియజేసినా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంత వాసులు కొప్పోలు నారాయణ, వెంకటేశ్వర్లు, చిరంజీవి, మల్లికార్జున, మారుతీరావు తదితరులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేయడంతోపాటు ప్రమాదకరంగా మారిన వద్యుత్ వైర్లను వెంటనే సరి చేయాలని కోరుతున్నారు.

'ఉపాధి' పనులు 200 రోజులు కల్పించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

కావలిటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులు ఒక వ్యక్తికి 200 రోజులు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నేత తాళ్లూరి మాల్యాద్రి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాధాకృష్ణయ్య తదితరులు ఎంపీడీవో తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనికి రూ.250 కోట్లు కేటాయించాలన్నారు. వేసవి కాలంలో పని చేసే ప్రాంతంలో నీడ ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు సరఫరా చేయాలని కోరారు. పేస్లిప్ ఇచ్చి ప్రతి వారం వేతనం ఇవ్వాలన్నారు. అనేక గ్రామాల్లో అన్ని తరగతుల వారికి పని సరిగా కేటాయించడం లేదన్నారు. పట్టణాల్లో ఉండేవారికి ఉపాధి హామీ పనిని ప్రవేశ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కె జాన్, నరేష్, ఆర్ సీతారామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



కావలి : బాలకృష్ణ జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, అభిమానులు, టీడీపీ నేతలు

కావలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం కావలిలో ఆయన అభిమానులు నాయకులు ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం కావలి ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రాత్రి బలిజపాలెం కావలి సెల్ఫీ పాయింట్ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ కావలి డివిజన్ అధ్యక్షుడు జ్యోతి బాబూరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, పలువురు టీడీపీ నేతలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు** : బాలకృష్ణ జన్మదిన వేడుకలను కందుకూరులో పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మూడుపూట్ల పేదలకు ఉచితంగా ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, వీడికేటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, రషీ, చీ రవిచంద్ర, బెజవాడ ప్రసాదు, చిలకపాటి మధుబాబు, చుండూరి శ్రీను, వేణు, మండపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● **గుడ్లూరు** : నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను గుడ్లూరులో బాలయ్య బాబు అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు. బస్టాండ్ సెంటర్‌లో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అలాగే గుడ్లూరు బీసీ హాస్టల్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే కూలింగ్ వాటర్ ఫ్రిజ్‌ను అందజేశారు. డీజే సందడితో యువకుల ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనిగర్ల నాగరాజు, చెన్నారెడ్డి మహేష్, చిత్తూరి మల్లికార్జున, ఉమ్మినేని సుబ్బారావు, పువ్వాడి వేణుగోపాలు, ఉప్పు వెంకటేశ్వర్లు, రావూరి వేణు, చుండి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన వర్షం

● విద్యుత్ తీగలపై పడిన చెట్లు



జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద నిలిచిన నీరు

లింగసముద్రం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటల ఆకస్మాత్తుగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ తీగలపై చెట్లుపడి, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం సుమారు గంట సేపు కురవడంతో లింగసముద్రం, జంపాలవారిపాలెం, పెంట్రాల, వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెంతో పాటు పలు గ్రామాల్లో రోడ్లు బురదమయమయ్యాయి. లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద సైడు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు పక్కనే ఉన్న పాఠశాల సమీపంలో నిలిచి పోయింది. లింగసముద్రం పాత చెరువు అలుగు సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద వేపచెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సుమారు 2 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనంతరం సిబ్బంది చేపచెట్టును తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

యోగాపై సన్నాహక సమావేశం



యోగా గురువులు, మాస్టర్ ట్రైనర్లతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్

కావలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలి పురపాలక సంఘం లో నిర్వహించే యోగాకు సంబంధించిన యోగా గురువులు, మాస్టర్ ట్రైనర్లతో మంగళవారం కావలి మున్సిపల్ కమిషనర్ తన ఛాంబరులో సమావేశం నిర్వహించారు. ఈనెల 21న నిర్వహించే యోగా దినోత్సవం విజయవంతానికి చేపట్టనున్న కార్యక్రమాల గురించి చర్చించి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు.

బద్రిరాజు ప్రీతంకు ప్రతిభా పురస్కారం



వెంకటమణి ప్రీతంను సత్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌లో 234 ర్యాంక్, ఎంసెట్‌లో స్టేట్ 10వ ర్యాంక్ సాధించిన కందుకూరుకు చెందిన బద్రిరాజు వెంకట మణిప్రీతంకు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రీతం తల్లిదండ్రులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు బద్రిరాజు నారాయణమూర్తి, రజనీ దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రీతంకు వెల్ఫేర్ సొసైటీ తరుపున కాశమాను ప్రవీణ్, వెంకటేశ్వర్లు పెన్నును బహుకరించారు. ఈ కార్యక్రమంలో రావూ శ్రీనివాసులు, చెక్కా వెంకట కేశవరావు, గుర్రం చిన్నఅల్లూరయ్య, కోటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ మాన్యువల్ కౌన్సెలింగ్‌పై ఉపాధ్యాయుల హర్షం

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : సెకండ్ గ్రేడ్ టీచర్ల బదిలీలో వెబ్ కౌన్సెలింగ్ స్థానంలో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్ణయం తీసుకోవడంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ క్రియాశీలక పాత్ర పోషించారని పలువురు ఉపాధ్యాయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్జీటీలు మాన్యువల్ కౌన్సెలింగ్ కోరుకున్నారని, టీచర్ల కోరిక మేరకు మంత్రి లోకేష్ ఎమ్మెల్సీతో సమావేశం చేయగా శ్రీకాంత్ ప్రత్యేక చొరవ తీసుకొని మంత్రిని ఒప్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మంత్రి లోకేష్‌కు, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో అవగాహన లేని ప్రజల వల్ల జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టాలని పందలపాడు గ్రామ సర్పంచ్ కేవల్లావల్లి అన్నారు. మంగళవారం పందలపాడు గ్రామ సచివాలయం పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయం మహిళా పోలీస్ గిరిజ మాట్లాడారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, వివాహం అనంతరం గర్భధారణ ప్రారంభంలో ఒక్కొసారి ప్రాణాంతక పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేయడం వలనే ఇలాంటి పరిణామాలకు దారి తీస్తుందన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన మహిళల చేత బాల్య వివాహ రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాల్య వివాహ రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఆక్రమణల చెరలో ప్రభుత్వ భూమి

● స్వాధీనం చేసుకోవాలని సర్పంచు వినతి

కొండాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 18లో కోట్లు రూపాయల విలువైన 2 ఎకరాల వాగుపోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని, దీనిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆ పంచాయతీ సర్పంచు ఎం.మల్లికార్జున తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొండాపురం గ్రామానికి చెందిన సుదాకర్ అనే వ్యక్తి భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సర్వే చేసి పోతున్నారు తప్ప జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకుని ఆ భూమిని పంచాయతీకి అప్పగించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న కోట్లు విలువైన వాగు పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పజెప్పాలని కోరారు. ఈవిషయమై తహసీల్దారు కోటేశ్వరరావును వివరణ కోరగా ఆ భూమిని సర్వే చేయగా కొంతవరకు ఆక్రమణకు గురైనట్టు గుర్తించి ఆక్రమణదారుడికి కట్టడాలను తొలగించాలని నోటీసు ఇచ్చామన్నారు. నోటీసు గడువు పూర్తయిన వెంటనే రెవెన్యూ అధికారులతో తొలగించి భూమిని పంచాయతీకి అప్పగిస్తామన్నారు.

పంట కాలువల్లో పూడికతీత పనులు



వెంగయ్యగారిపాలెం రోడ్డులో కాలువలో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్

కావలి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వెంగయ్యగారిపాలెం రోడ్డులోని పంట కాలువల పూడికతీత పనులను మున్సిపల్ అధికారులు మంగళవారం చేపట్టారు. ఈ నెల 9వ తేదీన 'వర్షాలు వస్తే ఎలా?' అంటూ ఆంధ్రజ్యోతిలో పూడికతో నిండిన పంట కాలువలపై కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ వెంగయ్యగారిపాలెం రోడ్డులోని కాలువలను పరిశీలించి పూడిక తీతకు చర్యలు చేపట్టారు. రానున్న వర్షాలకు పట్టణంలో మురుగు నీటి నిల్వ లేకుండా ఉండేందుకు పాతూరు నుంచి పంట కాలువలో కలిసే మురుగునీటి కాలువలు కూడా పూడిక తీస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నారు. దీనిపై పాతూరు వాసులతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి పూట కరెంటు కష్టాలు!

● మూగబోయిన అధికారులు, సబ్‌స్టేషన్ ఫోన్లు ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కావలి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ఉక్కపోత, కరెంటు కోతలతో కావలి పట్టణ వైకుంఠపురం, జనతాపేట వాసులకు తరచూ రాత్రి సమయాల్లో కరెంటు కష్టాలు తప్పడం లేదు. అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు 2 గంటల పాటు విద్యుత్ సరఫరా లేక వీధులన్నీ గాడాంధకారంగా మారాయి. ఎక్కువగా పేదలు నివసించే వైకుంఠపురంలో విద్యుత్ కోత, ఉక్కపోతతో ఆ ప్రాంత వాసులు అర్ధరాత్రి సమయాల్లో చంటిబిడ్డలతో వీధుల్లోకి రావాల్సి వస్తుందని వాపోతున్నారు. విద్యుత్ కోత విషయమై అధికారులకు సమాచారం చేరవేసేందుకు అనేక మార్లు అధికారులకు ఫోన్లు చేసినా బాధ్యత గలవారు పని చేయాల్సిన సంబంధిత అధికారుల ఫోన్లు తియ్యడం లేదని అంటున్నారు. వెంగళరావునగర్‌లోని సబ్‌స్టేషన్‌కు ఎన్ని సార్లు ఫోన్లు చేసినా బిజీటోన్ తప్ప ఫోన్లు తియ్యలేదంటున్నారు. ఇబ్బందికర పరిస్థితుల్లో సమాచారం చెప్పాల్సిన అధికారులు తీరు పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాక్షి చానల్‌ను బ్యాన్ చేయాలి

- అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు హేయం
- కావలిలో మహిళల నిరసన ర్యాలీ


వింజమూరులో తెలుగు మహిళల మానవహారం


కోవూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

కావలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అమరాతి మహిళల పట్ల అనుచితంగా మాట్లాడి వారి మనోభావాలను దెబ్బతీసిన జర్నలిస్ట్ ముసుగులో ఉన్న వ్యక్తులు, విశ్లేషకులు, సాక్షి మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కూడా జిల్లావ్యాప్తంగా ఎన్డీఏ కూటమి మహిళా నేతలు ఆందోళనలు చేశారు. కావలిలో తెలుగు మహిళా అధ్యక్షురాలు అర్షియా బేగం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన మహిళా నేతలు, మహిళా సంఘాలు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మాగుంటపార్వతమ్మ ట్రంకురోడ్డులోని ఐలవ్‌యూ కావలి సెల్ఫీ పాయింట్ నుంచి ఏరియా వైద్యశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు మహిళలు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నిరసన తెలిపి సాక్షి యాజమాన్య చర్యలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు అంచిపాకల కమల, టీడీపీ నేతలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, పోతుగంటి అలేఖ్య, పద్మావతి శ్రీదేవి, మనోరమ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కావలి : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

● **కందుకూరు :** తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళల ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో సాక్షి పత్రికను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి మీడయాను రాష్ట్రంలో నిషేధించాలని, అమరావతి మహిళలపై సొకబారు విమర్శలు చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కల్లూరి శైలజ, ముచ్చు లక్ష్మీరాజ్యం, అల్లం సుమతి, కంసాని మయూరి, ఎన్వీ రమణయ్య, చదలవాడ కొండయ్య, జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు.

● **వింజమూరు :** పట్టణంలోని స్థానిక బంగ్లా సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ సెంటర్ వరకు మహిళా నాయకులు భారీ ర్యాలీ నిర్వహజంచారు. సాక్షి చానల్‌కు, ప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మాట్లాడుతూ మహిళలను కించపరిచే విధంగా ప్రచారం చేసిన సాక్షి చానల్‌ను వెంటనే రద్దు చేసి మూసి వేయాలన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ భారతిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి బేషరతుగా మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, యాకసిరి భవాని, అపర్ణ, జయలక్ష్మిలతో పాటు స్వచ్ఛందంగా మహిళలు పాల్గొన్నారు.

● **కోవూరు :** జగన్ రోత మీడియాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మహిళలు కోవూరులో భారీ ప్రదర్శన చేశారు. స్థానిక బజారు కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో మండల పరిధిలోని పలు కాలనీల మహిళలు పాల్గొన్నారు.

మనుగడ ప్రశ్నార్థకం !

- జీవనోపాధి కరువై... దుర్భర జీవనంలో చేనేతలు
- వృత్తికి దూరమైన వేలాది కుటుంబాలు
- భుక్తి కోసం కూలి పనులకు..
- ఆదరణ కోల్పోతున్న నేతన్నలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


వడ్డిపాలెంలో మగ్గం నేస్తున్న కార్మికుడు


మంచం పట్టిన చేనేత వృద్ధ దంపతులు అండగుండ శేషయ్య, వెంకటరమణమ్మ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదరణ కరువై చేనేతలు మనుగడ కోల్పోతున్నారు. దీంతో జీవనోపాధి కోసం వారు వ్యవసాయ, బేల్దారి, ఇతర కూలిపనులకు వెళుతున్నారు. కోవూరు నియోజకవర్గంలోని కోవూరు, బుచ్చి, ఇందుకూరుపేట మండలాలు, వింజమూరు, సంగం, ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి ప్రాంతాల్లో వేలాది చేనేత కుటుంబాలు ఉన్నాయి. కోవూరు మండలం పాటూరులో మగ్గాలపై నేసిన చీరలకు దేశవ్యాప్తంగా పేరుంది. జిల్లావాప్తంగా ఆరేళ్ల క్రితం వరకు సుమారు 25వేల చేనేత కుటుంబాలు, 3వేలు అనుబంధ వృత్తుల చెందిన కుటుంబాలు ఉండేవి. గతంలో ప్రభుత్వాల ఆదరణ లేక ఇప్పటి వరకు 15వేలకుపైగా చేనేత కుటుంబాలు వృత్తికి స్వస్తి పలికాయి. కేవలం 9వేల కుటుంబాలు మాత్రమే నేటికీ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాయి. బుచ్చి మండలంలోనే 700 కుటుంబాలకుగాను 200 వందల కుటుంబాలు మాత్రమే వృత్తిలో కొనసాగుతున్నాయి.

● **దుర్భర జీవనం**

చాలీచాలని సంపాదనతో చేనేతలు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు. ఎన్ని పవర్‌లూమ్ ఉన్నా... నూలు, జరీని గంజిలో తడిపి (హ్యాండ్‌లూమ్)చేనేతలు తయారుచేసే చీరల నైపుణ్యానికి ఏవీ కూడా సాటి రావు. కానీ నేడు అవి కూడా ఆదరణ కోల్పోయాయి. వర్షాకాలంలో పనులు సాగని మూడు నెలలపాటు ప్రభుత్వం తమ జీవనభృతి కోసం ఆర్థిక సాయం అందించాలని చేనేత కార్మికులు కోరుతు న్నారు. ఆఖరికి సొంత ఇల్లు కూడా లేక అవస్థలు పడు తున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులు కూడా చదివించుకోలేని దుస్థితిలో ఉన్నామని వడ్డిపాళెంకు చెందిన ఈతల వెంకట రమణయ్య ఆవేదన వ్యక్తం చెందారు.

మంచం పట్టిన కార్మికులు

వడ్డిపాళెంలో అండగుండ శేషయ్య, వెంకటరమణమ్మ అనే వృద్ధ చేనేత కార్మికులకు పూట గడవడమే కష్టంగా ఉంది. శేషయ్యకు నెలరోజులుగా ఆనారోగ్యం బాగాలేదు. ఆయన భార్యకు బైపాస్ సర్జరీ చేశారు. వారికి ఓ కొడుకు, కూతురు కాగా, కూతురికి వివాహం చేశారు. కొడుకు చనిపోయాడు. ప్రస్తుతం ఇద్దరూ పనిచేయలేకపోవడంతో పూట గడవడం లేదు. దీంతో పలువురు చేనేత కార్మికులు, ఆయా సంఘాల నేతలు తమవంతు ఆర్థిక సాయం అందిస్తున్నారు.ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆ దంపతులు కోరుతున్నారు.

ఈ ప్రభుత్వమైనా ఆదుకుంటుందేమో...



నెలంతా కష్టపడితే రూ.7నుంచి రూ.8వేలు సంపాదిస్తాం. చిన్న కార్యం చేయాలన్నా, ఇతర ఏ అవసరమొచ్చినా ఆసాముల వద్ద అప్పులు తెచ్చుకుని పనులు చేసి నిదానంగా తీరుస్తాం. సొంతంగా నేత నేయాలంటే పెట్టుబడి కావాలి. అధికారులు రుణాలు ఇస్తామని చెప్తారుకానీ ఆ తరువాత పట్టించుకోరు. టీడీపీ ప్రభుత్వమైనా చేనేత కుటుంబాలను ఆదుకుంటుందని అనుకుంటున్నాం.

- దాసెట్టి సన్యాసిరావు, వడ్డిపాళెం

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి



చేనేత సహకార సంఘాలు మూతపడ్డాక ఆసాములే నేత కార్మికులకు పని కల్పిస్తున్నారు. చేనేతలకు పెట్టుబడులు, ముడిసరుకు అందించి, వారి ఉత్పత్తులను మార్కెట్‌లో పెట్టి, నేత కుటుంబాలు అభివృద్ధి చెందేలా చొరవచూపడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. చేనేత కుటుంబాలకు స్థలాలు, ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు కూడా అంతంత మాత్రంగానే అందుతున్నాయి. మగ్గాల ఆధునికీకరణ, అందుకు తగిన విధంగా పరికరాలు కొనుగోలుకు ప్రభుత్వం చేయూతనివ్వాలి.

- ఆశం సురేష్, వీవర్స్ అసోసియేషన్ నెల్లూరు పార్లమెంట్ కన్వీనర్

లోకేష్‌తోనే చేనేతలకు పూర్వవైభవం



చేనేత కార్మికులకు పూర్వ వైభవం చేకూరాలంటే మంత్రి నారా లోకేష్ వల్లే సాధ్యమవుతుంది. జిల్లాలోని చేనేత కార్మిక కుటుంబాల కోసం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అసెంబ్లీలో తన గళం వినిపించారు. దీంతో సీఎం నారాచంద్రబాబు 2017 నుంచి 2024 మార్చి వరకు చేనేతల రుణాల మాఫీకి హామీ ఇచ్చారు. 50 ఏళ్లకు పింఛన్ పునరుద్ధరణ, 100 నుంచి 200 యూనిట్ల వరకు విద్యుత్ సరఫరా ఉచితం, నేత కార్మికులకు ఆన్‌లైన్‌లో గుర్తింపు కార్డులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లులు, ఆస్తుల పేరుతో పింఛన్లు, నేస్తం పథకం, రేషన్ కార్డులు తొలగిస్తే వాటిని టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించింది.

- తాళ్ల నరసింహస్వామి, చేనేత కార్మిక సంఘం నాయకుడు, బుచ్చి


యోగాసనాలు వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తదితరులు

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరిలో యోగాంధ్ర కార్యక్రమానికి విశేష స్పందన

ఉదయగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మారిన జీవన విధానానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు యోగాను జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకర జీవనాన్ని కొనసాగించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉదయగిరిలోని రంగనాయకులస్వామి ఆలయ ఆవరణలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జ్యోతిప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా పర్యాటకాన్ని పరిచయం చేస్తూ యోగా జీవనశైలి గురించి ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రెండు వేల మందితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మానసిక వత్తిడి పెరుగుతున్న సమయంలో యోగా ఒక చక్క సమాధానమని, బలమైన సందేశాన్ని ప్రజల్లోకి పంపాలనే ఉద్దేశంతో యోగాంధ్ర కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. జూన్ 21న జిల్లాస్థాయిలో ప్రతివార్డు, గ్రామ సచివాలయం పరిధిలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందులో ప్రతిఒక్కరు పాల్గొనాలన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరిని పర్యాటకంగా తమ ప్రభుత్వ హయాంలో అందరి సహకారంతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. యోగా ప్రాధాన్యతపై అవగాహన పెంచుకుని ప్రతిఒక్కరు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, జిల్లా నోడల్ క్రీడా సాధికారసంస్థ అధికారి యతిరాజ్, డీఎంహెచ్‌వో సుజాత, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నాగరాజకుమారి, గంగాభవానీ, సీఈవో విద్యారమ, డీసీవో గుర్రప్ప, తహసీల్దారు సుబ్రత, ఎంపీడీవో అప్పాజీ, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో నీటి సామర్థ్యం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి 39.840 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందన్న మన స్థాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో రబ్బానీ(30), మమూల దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. రబ్బానీ తన ఇంటి పక్క వీధిలో టిఫిన్ అంగడి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను భార్య, పిల్లలను పట్టించుకోక పోవడంతో దంపతుల మధ్య నమస్పర్ధలు చోటుచేసుకున్నాయి. ఈ నెల 8న వారి మధ్య గొడవ జరగడంతో భార్య అలిగి పిల్లలను తీసుకుని శ్రీనివాసనగర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం రబ్బానీ ఉరేసుకుని మృతి చెందాడు. అతని స్నేహితుడు అక్బర్ అలియస్ ఇక్బాల్ సమాచా రంతో భార్య, బంధువులు ఇంటికి చేరుకున్నారు. మమూల ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బోడిగాడితోట ప్రభుత్వ వైద్యశాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆ ప్రాంతంలో సోమవారం రాత్రి అపస్మారక స్థితిలో పడిఉన్న వ్యక్తిని స్థాని కులు 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మంగళవారం సమాచారం అందుకున్న 5వ వార్డు వీఆర్వో భాస్కరయ్య నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నుడా చైర్మన్ కోటంరెడ్డికి కేక్ తినిపిస్తున్న మంత్రి ఆనం, పక్కన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ తదితరులు

సేవాతత్పరత కలిగిన నేత బాలకృష్ణ

- రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- నుడా చైర్మన్ కోటంరెడ్డి ఆధ్వర్యంలో బాలయ్య జన్మదిన వేడుకలు

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ మకుటం లేని మహారాజు, సేవాతత్పరత కలిగిన నేత నందమూరి బాలకృష్ణ అని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా మంత్రి ఆనం కేక్‌కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయటంలో కోటంరెడ్డి సిద్ధహస్తుడన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, బాలకృష్ణతో కలిసి తాను పనిచేయటం ఎంతో అదృష్టమని వెల్లడించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తనలోని భయాన్ని, బాధను, పోగొట్టి ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని నింపిన ఏకైక వ్యక్తి నందమూరి బాలకృష్ణ అన్నారు. రాజకీయంగా తాను ఎన్నో ఇబ్బందులు పడుతున్నప్పుడు బాలకృష్ణ సాన్నిహిత్యంతో ధైర్యంగా వాటిని ఎదుర్కొన్నట్లు గుర్తుచేసుకున్నారు. తల్లి ఆశయాలను తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న వ్యక్తి బాలకృష్ణ అంటూ కొనియాడారు. బసవతారకం కేన్సర్ ఆసుపత్రికి ఎంతో మంది బాధితులను నెల్లూరు నుంచి పంపించానని వారికి ప్రాణం పోసిన వ్యక్తి బాలకృష్ణ అని వెల్లడించారు. తనకు నుడా చైర్మన్ పదవి వచ్చేందుకు చంద్రబాబు, లోకేష్‌తో బాలకృష్ణ మాట్లాడి పదవి వచ్చేలా చేశారన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ మాట్లాడుతూ కోటంరెడ్డి సూచనలతో బాలకృష్ణ తన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారన్నారు. బాలకృష్ణ, టీడీపీ నేతల ఆశీస్సులతోనే తాను గెలిచారని తెలియచేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ వీడియోలను ప్రదర్శించారు. బ్యాండ్‌మేళం, పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి దినేష్ రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, బాలకృష్ణ అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు ఎద్దల రవి, జనసేన నేతలు కిశోర్, నూనె మల్లికార్జున యాదవ్, రాధయ్య తదితరలు పాల్గొన్నారు.

మ్యూజియం ఏడీగా డాక్టర్ జరీనాబేగం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పురావస్తు ప్రదర్శనశాల, పురావస్తు శాఖ సహాయ సంచాలకులుగా డాక్టర్ జరీనా బేగం నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆమె విజయవాడ నుంచి నెల్లూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం నెల్లూరులో ఆ స్థానంలో పని చేస్తున్న గంగాధరంను విజయవాడకు బదిలీ చేశారు.

14 నుంచి జిల్లాలో యోగా ప్రదర్శన

నెల్లూరు(విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 14వతేదీ నుంచి అన్నీ చోట్ల యోగా ప్రదర్శన నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో మంగళవారం ఆయన యోగాంధ్ర కార్యక్రమంపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ గ్రామంలో యోగా చేయడానికి అనువుగా ఉన్న ప్రదేశాలను గుర్తించారన్నారు. ఆయా ప్రదేశాల్లో ఇప్పటి నుంచే ప్రతి రోజూ మాస్టర్ ట్రైనర్లు, ఇతర ట్రైనర్లు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 14న ప్రజలను భాగస్వాములను చేస్తూ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన అన్నీ ప్రదేశాల్లో యోగా ప్రదర్శనలు జరపాలని, దీని ని విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ 2024 సంవత్సరానికి టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022, 23, 24 సంవత్సరాల్లో భూమి, నీరు, వాయువుపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధిం చిన వారి నుంచి, నైపుణ్యం ప్రదర్శించిన వారు, జీవిత సాఫల్యం సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని పేర్కొన్నారు. పూర్తి వివరాలు ఎౌౌౌటటీటజౌౌ.జీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, అర్హత కలిగిన వారు ఈనెల 30వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో నగదు బదిలీ సరికాదు

● **రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు**


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం నగదు బదిలీ విధానాన్ని అమలు చేయాలనుకోవడం సరికాదని పలు పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నగదు బదిలీ, దాని ప్రభావం అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళం పుల్లయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మీద కోపంతో పేదల ఆహార భద్రతపై అంక్షలు విధించి పేదల కడుపు కొట్టేందుకు యత్నిస్తోం దని ఆరోపించారు. డీలర్ల వద్దకెళ్లి సరుకులు తెచ్చుకునే విధానం పేదలకు సబ్సిడీ సరుకులను దూరం చేసేలా ఉందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని కొందరు వ్యాపారులు రీసైక్లింగ్ ద్వారా బయట రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్య బట్టారు. రైతాంగం జిల్లా కార్యదర్శి పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ చౌక దుకాణాల ద్వారా 16 రకాల సరకులను పేదలకు అందిస్తే పేదవాడు కడుపు నిండా తినే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం నగదు బదిలీ పథకాన్ని ఇందులో చేర్చటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నందిపోగు రమణయ్య, సీఐటీయూ నాయకురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శి ఎంవీ రమణయ్య, జిల్లా అధ్యక్షుడు నూకలపాటి రఘురామయ్య, నక్క రాధయ్య, ఎస్‌కే షాన్‌వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన పారిశుధ్య కార్మికుల గొడవ

- నిద్రమాత్రలు మింగిన కార్మికురాలు
- కార్మికుడిపై పోలీసు కేసు

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ పారిశుధ్య కార్మికురాలిని విధుల గురించి ప్రశ్నించి న నేపథ్యంలో మొదలైన గొడవ ముదిరింది. దీనికి సంబంధించిన వివరా లు ఇలా ఉన్నాయి. గ్లోరీ అనే పారిశుధ్య కార్మికురాలు జీజీహెచ్‌లోని ఆపరేషన్ థియేటర్‌లో పనిచేస్తుంది. గత శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు సాధారణ పరిశీలనలో భాగంగా ఆపరేషన్ థియేటర్ వద్దకు వెళ్లారు. గ్లోరీ విధుల్లో లేకపోవడంతో అక్కడు న్న ఇతర కార్మికులను ప్రశ్నించారు. గ్లోరీ సక్రమంగా విధుల్లో ఉండదని వారు చెప్పారు. కాసేపటికి తిరిగి వచ్చిన గ్లోరీని సూపర్‌వైజర్లు ప్రశ్నించా రు. పర్మిషన్ తీసుకుని వెళ్లానని ఆమె సమాధానమిచ్చింది. ఈ క్రమంలో ఆమె బంధువు కొండా అనిల్ సూపర్‌వైజర్, ఇతర కార్మికులతో గొడవప డ్డాడు. దీంతో అనిల్‌పై దర్గామిట్ట పోలీస్ స్టేషన్‌లో పారిశుధ్య కార్మికులు కేసు పెట్టారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవటంతో కార్మికులు మంగళవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కొండా అనిల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇదిలా ఉండగా గ్లోరీ వెంగళరావునగర్‌లోని తన నివాసంలో సోమవారం నిద్రమాత్రలు మింగింది. వెంటనే జీజీహెచ్‌కు తరలించి చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉంది. అయితే తనను అవమానించారం టూ ఇద్దరిపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఆమె మంగళవారం ఫిర్యాదు చేసింది.

రైల్లో గంజాయి స్వాధీనం


నిందితుడి వివరాలు తెలుపుతున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గూడూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ మంగళవారం తన కార్యాలయంలో నిందితుని వివరాలను మీడియాకు వెల్లడించారు. సోమవారం నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో కావలి, నెల్లూరు, గూడూరు రైల్వే ప్లాట్‌ఫారమ్‌లపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గూడూరు రైల్వే స్టేషన్‌లో ఇన్‌చార్జి ఎస్ఐ వై చెన్నకేశవరావు తనిఖీలు చేస్తుండగా టాటానగర్-ఎర్నాకులమ్ రైలు దిగి హడావిడిగా స్టేషన్ బయటకు వెళుతున్న జార్ఖండ్ రాష్ట్రం కుచాయి జిల్లాకు చెందిన దేవదాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగులో మూడు కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా ఒడిశాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నై పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేందుకు వెళుతున్నట్లు తెలిపాడు. దీంతో అతనిని అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు రైల్వే సీఐ ఏ సుధాకర్, నెల్లూరు, గూడూరు ఇన్‌చార్జి ఎస్ఐలు జీ మాలకొండయ్య, వై చెన్నకేశవరావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ సీకేఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.